వనిత
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 66 పేజీలు: 8+16 వెల: 6.50

పరువు హత్యలకు అడ్డుకట్టవేసిన కర్ణాటక 5

పనిమనిషికి కూడా కోటి విలువైన ప్లాట్!

నోటిఫికేషన్ విడుదల
ఆంధ్రప్రదేశ్ రాజధానికి పూర్తి చట్టబద్ధత

అమరావతి బిల్లుకు
## రాష్ట్రపతి ఆమోదం 2



## రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించండి



5

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు
4 వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం





# మీ ఊరొస్తున్నా.. తేల్చుకుందాం



## కేరళం సిఎం విజయన్‌తో చర్చకు సిద్ధమన్న సిఎం రేవంత్

### మీ రాష్ట్రం 70 యేళ్ల ప్రగతిని మా 28 నెలల ప్రభుత్వంతో పోల్చడమా?

మీ పదేళ్లలో ఎంత సాధించారో లెక్కలున్నాయి..

అక్కడి ఘనత అంతా కాంగ్రెస్ ముఖ్యమంత్రులదే

స్వల్పకాలంలోనే రికార్డుస్థాయి అభివృద్ధి సాధించాం

**విజయన్‌కు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ.. నేడు కేరళం ఎన్నికల ప్రచారానికి సిఎం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్6:** తెలంగాణ, కేరళ ముఖ్యమంత్రుల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు కీలక మలు తిరిగింది. కేరళ సిఎం పినరయి విజయన్ చేసిన విమర్శలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలకు ఉన్న సారూప్యతను బేరీజు వేసి ఏకంగా ఆరు పేజీల సుదీర్ఘ లేఖను రాశారు. రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి, అక్షరాస్యత, తదితర అంశాలను పూర్తి గణాంకాలతో వివరించారు. సిఎం పినరయి విజయన్‌పై నాకు అపారమైన గౌరవం ఉంది, ఆయన చేసిన ట్వీట్లను శ్రద్ధగా చదివాను. రెండు రాష్ట్రాల ప్రజల ముందు నిజాలు వెల్లడించడం నాబాధ్యత. మీరు చేసిన విమర్శలకు పూర్తి గణాంకాలతో సమాధానం ఇస్తున్నాను అని పేర్కొన్నారు. కేరళ అభివృద్ధి మోడల్ లోని లోపాలను ఎత్తిచూపుతూనే, తెలంగాణలో గత 28 నెలల్లో సాధించిన ప్రగతిని ఆయన ఆ లేఖలో వివరించారు. పినరయి విజయన్ ఉటంకించిన గణాంకాలన్నీ 2023-24 నాటివని, అవి తెలంగాణలో గత ప్రభుత్వం (బిఆర్ఎస్) చివరి దశకు సంబంధించినవని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'మేము అధికారంలోకి వచ్చి 28 నెలలే అయ్యింది. మీరు 120 నెలులగా అధికారంలో ఉన్నారు. 70 ఏళ్ల కేరళ ప్రస్థానాన్ని మా 28 నెలల పాలనతో పోల్చడం తగదు అని ఆయన హితవు పలికారు. 2024-25 ఆర్థిక ఏడాదిలో తెలంగాణ జీఎస్డీపీ వృద్ధి రేటు 10.1 శాతంగా ఉంది. ఇది జాతీయ జిడిపి 9.9శాతం కంటే ఎక్కువ, మా రాష్ట్ర జిఎస్‌డిపీ రూ.16.12లక్షల కోట్లు దాటిందని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ రెండో ర్యాంకులో ఉందని, దక్షిణాదిలోనే అత్యధిక తలసరి ఆదాయం (రూ.3.79 లక్షలు) కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. మా జియోగ్రాఫికల్ ఏరియా దేశంలో 3.5శాతం, జనాభా తీసుకుంటే 3శాతం కంటే తక్కువ, కానీ జాతీయ జిడిపిలో తెలంగాణ వాటా దాదాపు 5శాతంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే రూ.20.617 కోట్లు మేర రైతు రుణాలను మాఫీ చేశాం. 25.36 లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశాం, ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. పంటల సాగుబడికి ఏటా ఎకరాకు రూ.12వేలు ఇస్తున్నాం. వ్యవసాయ పెట్టుబడి కింద ఇప్పటి వరకు 69.70లక్షల మంది రైతులకు రూ.25,279 కోట్లు ఇచ్చామన్నారు. రైతు భరోసా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని వివరించారు. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం 29.40 లక్షల మంది రైతులకు రూ.26,098 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. 14,91లక్షల మంది రైతులకు రూ.5లక్షల బీమా కోసం రూ.3,124 కోట్లు ఖర్చు చేశాం. క్రాప్ బోనస్ కింద 14.91 లక్షల మంది రైతులకు రూ.3,139 కోట్లు ఇచ్చామని స్పష్టం చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. కేరళలో యువత ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు >>2

## టెహ్రాన్ వర్శిటీపై ఇజ్రాయెల్ దాడి

పెట్రో కెమికల్ ప్లాంట్ కూడా ధ్వంసం

ఐఆర్‌జిసి ఇంటెలిజెన్స్ ఛీఫ్ మృతి

ఒప్పందానికి రాకుంటే ఇరాన్‌కు నరకమే: ట్రంప్

**45 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన తిరస్కరించిన ఇరాన్**



సోమవారం ఇజ్రాయెల్ దాడుల అనంతరం సహాయక చర్యల్లో ఇరాన్ బృందాలు

**టెహ్రాన్ /టెల్ అవీవ్ / వాషింగ్టన్, ఏప్రిల్ 6:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాల వైమానిక దాడుల కారణంగా 13 మంది మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున టెహ్రాన్‌కు నైరుతి దిశలో ఉన్న బహారెస్థాన్‌లోని ఒక నివాస భవనంపై వైమానిక దాడి జరిగింది. టెహ్రాన్‌లోని షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పైనా దాడులు అమెరికా, ఇజ్రాయెల్‌సేనలు దాడులుచేసాయి. క్యాంపస్ సమీపంలోని సహజవాయువు సరఫరా చేసే పైపులైన్ లక్ష్యంగా దాడులుజరిగాయి. క్యాంపస్ పక్కనే ఉన్న సహజవాయువు పంపిణీ కేంద్రం కూడా వైమానిక >>2

వన్ ధన్ వికాస్ కేంద్రాలకు ఆర్థిక సాయం
## మంజూరు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** వన్‌ధన్ వికాస్ కేంద్రాల (విడివికె) స్థాపన కోసం గిరిజనులకు కేంద్రం ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే తెలిపారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ప్రధాన మంత్రి జనజాతియ వికాస్ మిషన్ (పిఎం జెవిఎం), ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పిఎం జెఎన్ఎమ్మెఎన్) పథకాల కింద ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. గిరిజన సంక్షేమ పథకాలపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు, పిఎంజెవిఎం పథకం కింద 12.48 లక్షల మంది గిరిజన సభ్యులను అనుసంధానిస్తూ >>2



## పాతబస్తీని మజ్లిస్‌కు రాసిచ్చారా?

కాంగ్రెస్ పాలనలో హిందువులకు రక్షణ కరవు: కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్,ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** అక్రమ నిర్మాణాల కూల్చివేతకు వెళ్లిన జిహెచ్ఎంసి అధికారులు, పోలిసులపై దాడులకు తెగబడ్డ మజ్లిస్ నేతలను అరెస్ట్ చేయకపోవడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. అక్రమ నిర్మాణాలు కూల్చిన చోటే గంటల వ్యవధిలో మళ్లీ నిర్మాణాలు చేపట్టినా చేష్టలూడిగిపోవడం సిగ్గు చేటని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పాతబస్తీని మజ్లిస్‌కు రాసిచ్చారా?, వాళ్లు ఎవరిపైనైనా దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు, దొంగతనాలు చేసుకోవడానికి పర్మిషన్ ఇచ్చారా?, పాతబస్తీకి ఒక రూల్, ఇతర ప్రాంతాలకు మరో రూల్ అమలు చేస్తున్నారా? అని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఈమేరకు సోమవారం సాయంత్రం పాతబస్తీలోని హైకోర్టు సమీపంలో ఉన్న మురళీధర్ ఆలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం బెంగాలీ కుటుంబాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చొరబాటుదారుల ఓట్లతో గెలవాలని మమతా బెనర్జీ కుట్రలు చేస్తోందన్నారు. బంగ్లా చొరబాటుదారులతో దేశ భద్రతకు ముప్పు వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్ సరిహద్దుల్లో ఫెన్సింగ్ వేయనీయకుండా మమతా బెనర్జీ ప్రభుత్వం ఇబ్బందులు సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశభక్తులకు, దేశ ద్రోహులకు మధ్య జరుగుతున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి ఓట్లు వేయించి గెలిపించాలని స్థానిక బెంగాలీ కుటుంబాలను అభ్యర్థించారు. బెంగాల్‌లో ఉండలేక చాలా మంది బెంగాలీలు హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారని, ఇప్పుడు పాతబస్తీలోనూ బెంగాలీ కుటుంబాలు ఉండలేని విధంగా పరిస్థితులు నెలకొన్నాయని రేవంత్ సర్కారుపై ధ్వజమెత్తారు. 2014 కంటే ముందే యూపిఎ పాలనలో బంగ్లాదేశ్, ఇతర దేశాల >>2



## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

**తమిళనాట లాకప్‌డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు**

**మదురై, ఏప్రిల్ 6:** ఆరేళ్ల క్రితం దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన తమిళనాడులోని సాతన్‌కుళం పోలీస్‌స్టేషన్‌లో తండ్రీకొడుకుల లాకప్‌డెత్ కేసులో మదురై కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. సాతన్‌కుళంలో బెన్నిక్స్, జయరాజ్‌లను చిత్రహింసలకు గురిచేసి హత్య చేసిన 9 మంది పోలీసులకు మరణశిక్ష విధించింది.

2020 జూన్‌లో పి. జయరాజ్, అతని కుమారుడు జె. బెన్నిక్స్‌ల కస్టడీ చిత్రహింసలు, మరణాలలో వారి పాత్రకు గాను మదురైలోని మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తొమ్మిది మంది నిందితులను వారం రోజుల క్రితమే దోషులుగా నిర్ధారించగా, సోమవారం నిందితులకు శిక్ష ఖరారు చేస్తూ సోమవారం తుదితీర్పు వెల్లడించింది. "సాధారణ పౌరులు ఇదే నేరం >>2

## ప్రజలే కేంద్రంగా పాలన

రూ.225 కోట్లతో బాసర ఆలయం అభివృద్ధికి శంకుస్థాపన

మహిళా సాధికారతకు రూ. 53.5 కోట్ల చెక్కు అందజేత

**సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం: పిప్రి బహిరంగ సభలో సిఎం రేవంత్**



పిప్రి బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సిఎం రేవంత్, డి.సిఎం భట్టి. చిత్రంలో మంత్రి జూపల్లి, పిసిసి చీఫ్ మహేష్

**ఆదిలాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలకు ఉతమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, తదితరులతో కలిసి సోమవారం శ్రీకారం చుట్టారు. తొలుత బాసర జ్ఞాన సరస్వతి దేవి ఆలయాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్చకుల సమక్షంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనమనవడికి అక్షరభ్యాసం చేయించారు. అనంతరం దక్షణ భారతంలోనే ఉన్న ఏకైక శ్రీ జ్ఞాన సరస్వతి పుణ్యక్షేత్రం బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. రూ.225 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది అంతస్థుల రాజగోపురం, మూడు దిక్కుల ఏడు అంతస్థుల రాజగోపురాలు, ముప్పై మూడు అడుగుల వెడల్పుతో పదిహేడు మాడవీధులు, ఈశాన్యంలో కోనేరుతో ఆలయ విస్తీర్ణం మూడు రేట్ల పెంపు, భక్తులయ సౌకర్యార్థం కోసం క్యూ కాంపేక్సులు, బోజన శాలలు, ప్రసాద కేంద్రాలు, పార్కింగ్, హెల్త్ సెంటర్లు, తదితర పనులను >>2

## ప్రభుత్వ బడులకు తగ్గిపోతున్నారు..



పదేళ్లలో 12 లక్షల మంది విద్యార్థుల తగ్గుదల

**2014-15లో 28 లక్షల మంది చేరగా, 2025-26లో 16.70 లక్షల మంది మాత్రమే చేరిక**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 6:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. గత పదేళ్లల్లో ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా 12 లక్షల మంది తగ్గారు. 2014-15 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్‌లో కలిపి 59,54,376 విద్యార్థులు చేరితే వారిలో సుమారు 28 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో చదువుతుండగా.. మిగిలిన సుమారు 31 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్నారు. ఈ ఏడాది 2025-26లో రాష్ట్రంలో చేరిన విద్యార్థులు 60,57,539గా ఉండగా.. వాటిలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చేరిన వారి సంఖ్య 16.70 లక్షల మంది. మిగిలిన 43.3లక్ష మంది విద్యార్థులు ప్రైవేటు స్కూల్స్‌లో చదువుతున్నారు. గత పదేళ్ల కాలంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గతం కంటే 35 శాతం పెరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ప్రస్తుతం 24,219 కొనసాగుతుండగా.. వాటిలో 2025-26 విద్యా సంవత్సరంలో 16,61,472 మంది విద్యార్థులు చేరినట్టు యుడైస్ లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 11,832 ప్రైవేటు స్కూల్స్ ఉండగా వాటిల్లో 43.3 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త కాలనీలు, గ్రామపంచాయతీలుగా ఏర్పడిన చోట కొత్తగా ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లోని సుమారు 2వేల పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉండగా.. 10 కంటే తక్కువగా ఉన్న స్కూల్స్ 2500 వరకు ఉన్నాయి. గత పదేళ్లల్లో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 8.9 శాతం మంది విద్యార్థులు తగ్గారు. 24,219 ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం 15 పాఠశాలల్లో మాత్రమే 1,000 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్నారు. 7,876 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 30 కంటే తక్కువగా ఉంది. గత పదేళ్లల్లో విద్యార్థుల చేరికలను పరిశీలిస్తే ప్రజలు ప్రైవేట్ విద్యకేఅధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో లక్షకుపైగా ఉపాధ్యాయులు ఉన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో 90 శాతం >>2

రోహిత్ సహా ముగ్గురికి
## మూడో దఫా కస్టడీపై తీర్పు రిజర్వు 3
మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు

ప్రాణహిత-చేవెళ్లకు
## కొత్తఊపిరి



ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధం

పాత డిజైన్ల ఆధారంగా మార్పులు, చేర్పులు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు పనులను మొదలుపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రాజెక్టు పాత డిజైన్ల ఆధారంగా మార్పులు, చేర్పులతో నీటిపారుదలశాఖ అంచనాలు రూపొందిస్తోంది. దీంతో సాగు నీరందని తెలంగాణ మాగాణానికి ప్రాణహిత ప్రాజెక్టు జీవం పోయనుంది. గోదావరి పరివాహక పరిధిలోని అన్ని జిల్లాలు, గ్రామాలకు ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా సాగునీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. తాజాగా సోమవారం బాసర పర్యటనలో భాగంగా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహారాష్ట్ర సరిహద్దు సమీపంలోని తుమ్మిడిహట్టి గ్రామంలోబ్యారేజీని నిర్మించే ప్రణాళికతో, ఉమ్మడి >>2

త్వరలో విసిలతో
## గవర్నర్ సమావేశం

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 6:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా నియమితులైన అనంతరం మొదటిసారి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సోమవారం గవర్నర్‌ను కలిశారు. ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తో కలిసి గవర్నర్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల స్థితిగతులపై గవర్నర్‌కు >>2



ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించడంతో బెంగాల్‌లోని రాణాఘాట్ పట్టణంలో సోమవారం ప్రత్యేక ట్రిబ్యునల్ ముందు వినతిపత్రాలను సమర్పించడానికి బారులు తీరిన ప్రజలు

## అమరావతి బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

### నోటిఫికేషన్ విడుదల

### ఆంధ్రప్రదేశ్ రాజధానికి పూర్తి చట్టబద్ధత

**విజయవాడ,ఏప్రిల్ 6:ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని విషయంలో కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో, అభివృద్ధి పథంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలవనుంది. అమరావతిని ఏకైక రాజధానిగా శాశ్వత చట్టబద్ధత కల్పించే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026" సోమవారం రాష్ట్రపతి ఆమోదించారు.తదనంతరం వెనువెంటనే కేంద్ర న్యాయశాఖ అమరావతి రాజధాని గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఇప్పటికే పార్లమెంట్‌లోని ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం తర్వాత ఈ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అప్పుడు రాష్ట్రపతి ఆమోదంతో ఏపీ రాజధాని అమరావతి కానుంది. అమరావతి చట్టబద్ధత బిల్లును ఏప్రిల్ 1, 2 తేదీల్లో పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించాయి. సుమారు 5 గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో అమరావతి ప్రాంత ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారు. బెజవాడ కనకదుర్గమ్మ ఆలయానికి పాదయాత్రగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు అమరావతి రైతులు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చట్టబద్ధతతో అమరావతి అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు, అంతర్జాతీయ సంస్థల నుంచి నిధుల సేకరణకు, పెట్టుబడుల రాకకు పూర్తి స్థాయి భరోసా లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. మలిదశ తమ త్యాగానికి ప్రభుత్వం చట్టబద్ధమైన గుర్తింపునిచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అమరావతి కోసం సుదీర్ఘకాలం సాగిన పోరాటానికి ఇది ఒక విజయంగా వారు భావిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో పలు కీలక అంశాలను పొందుపరిచింది. గతంలో చర్చకు వచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనను పక్కన పెట్టి, అమరావతిని పూర్తిస్థాయి పాలనా, శాసన, న్యాయ రాజధానిగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సీఆర్డీఏ పరిధిలోని భూములను మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు గెజిట్ ద్వారా అనుమతులు మంజూరయ్యాయి. నిలిచిపోయిన ఐకానిక్ భవనాలు (సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ), మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించేందుకు ఈ నోటిఫికేషన్ మార్గం సుగమం చేసింది.

## తగ్గిపోతున్నారు..

>> స్కూల్స్‌కి సొంత భవనాలున్నాయి. విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలాలు ఉన్నాయి. ఈ మధ్యకాలంలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక వసతులను సైతం కల్పించారు. ఇలా అన్నిరకాల సౌకర్యాలను కల్పించినప్పటికీ.. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలను కాదని వేలు, లక్షలు ఫీజులు చెల్లిస్తూ ప్రైవేటు స్కూల్స్‌లో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు చూస్తున్నారు తప్ప.. అన్నిరకాల సౌకర్యాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులున్న ప్రభుత్వ స్కూల్స్ వైపు చూడటం లేదు. ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడం కోసం ప్రభుత్వం ప్రతి ఏడాది బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ తల్లిదండ్రుల్లో నమ్మకం కలగడం లేదు. గత రెండేళ్లల్లో ప్రభుత్వ స్కూల్స్‌లోనే ప్రీప్రైమరీ క్లాసులను సైతం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1740 ప్రభుత్వ స్కూల్స్‌లో ప్రీప్రైమరీని ప్రారంభించగా వాటిల్లో 19,438 మంది విద్యార్థులు చేరగా.. అదే 7692 ప్రైవేటు పాఠశాలల్లోని ప్రీప్రైమరీ క్లాసుల్లో 6,15,314 మంది చేరారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకి బోధన కంటే బోధనేతర పనులు ఎక్కువగా ఉంటున్నాయని, వాటి మూలంగా బోధనపై శ్రద్ధపెట్టడానికి అవకాశం లేకుండా పోతుందని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. విద్యార్థులు హాజరును పరిశీలించే ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి మొదలుపెట్టి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించడం ఇతర బోధనేతర పనులను కూడా ఉపాధ్యాయులే చూడటం మూలంగా ప్రభుత్వ, స్థానిక సంస్థల్లోని ఉపాధ్యాయులు బోధనపై శ్రద్ధపెట్టలేకపోతున్నారని అంటున్నారు. దీనికి తోడు ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకుండా.. వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తుండటంతో వారు ప్రయాణంలో అలసిపోయి పిల్లలకు పాఠాలు చెప్పలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఏతా వాతా అన్ని సమస్యలను పరిశీలిస్తే ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య గత పదేళ్లుగా తగ్గుతూ వస్తోంది. గత పదేళ్లల్లో సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూల్స్‌లో తగ్గినట్టు యుడైస్ లెక్కలు చెబుతున్నాయి.

## వన్ ధన్ వికాస్ కేంద్రాలకు ఆర్థిక సాయం మంజూరు

>> 4,172 విడివికెలు మంజూరు చేయబడగా, పిఎం జెఎన్‌ఎమ్మెఏఎన్ కింద దేశవ్యాప్తంగా సుమారు 0.46 లక్షల మంది గిరిజన సభ్యులను అనుసంధానిస్తూ 540 విడివికెలు మంజూరు చేయబడ్డాయని వివరించారు.

గిరిజన వర్గాలలో జీవనోపాధి కల్పన కోసం విడివికెలను లాభదాయకమైన సంస్థలుగా స్థాపించడానికి, వాటికి అందించే ఆర్థిక సహాయంలో ముడి పదార్థాలు, శిక్షణ, సామర్థ్య పెంపు, టూల్ కిట్లు, యంత్రాలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, రవాణా, నిల్వ మొదలైన వాటికి మద్దతు ఉంటుందన్నారు. అలాగే పిఎంజెవిఎమ్ పథకం కింద, గిరిజన వర్గాలకు జీవనోపాధి అవకాశాలను కల్పించేందుకు, ట్రైఫెడ్ గిరిజన కళాకారులు, ఉత్పత్తిదారులను తమ సంస్థలో చేర్చుకోవడం, వారి నుండి వివిధ గిరిజన ఉత్పత్తులను సేకరించడం వంటి పనులను కూడా చేపడుతుందని వెల్లడించారు.

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష

>> చేసి ఉంటే, సాధారణ శిక్ష విధించి ఉండవచ్చు. కానీ ఈ నేరాన్ని చేసిందే పోలీసులే" అని తీర్పునిస్తూ న్యాయమూర్తి ముత్తుకుమారన్ అన్నారు. పోలీసు కస్టడీలో తండ్రీకొడుకులపై దారుణంగా దాడి జరిగిందని సాక్ష్యాధారాలు చూపించడంతో ఈ కేసు కస్టడీ హింసకు స్పష్టమైన ఉదాహరణ అని కోర్టు నిర్ధారించింది. ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీధర్ ఈ దాడిని ప్రేరేపించారని, ఇతర సిబ్బంది కూడా ఈ హింసలో పాలుపంచుకుని, ఆ తర్వాత దానిని కప్పిపుచ్చారని కోర్టు తేల్చింది. నిందితులందరిపై హత్య అభియోగాలతోపాటు, తీవ్రమైన గాయాలు కలిగించడం, సాక్ష్యాలను తారుమారు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం వంటి అభియోగాలు కూడా మోపబడ్డాయి.

జయరాజ్(58), బెన్నిక్స్(31)లను జూన్ 19, 2020న కొవిడ్-19 లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా హింసించడంతో ఆస్పత్రికి తరలించారు. కోవిల్‌పట్టి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. వారిపై తీవ్రమైన కస్టడీ హింస జరిగినట్లు దర్యాప్తులో తర్వాత నిర్ధారణ అయింది. ఈ కేసును దర్యాప్తు చేసిన సిబిఐ, సాతన్‌కుళం పోలీస్‌స్టేషన్ లోపల జరిగిన దాడి నిరంతరాయంగా, క్రూరంగా ఉందని నిర్ధారించడానికి ఫోరెన్సిక్ సాక్ష్యాలు, వైద్య నివేదికలు, సాక్షుల వాంగ్మూలాలు సేకరించింది. స్టేషన్ అంతటా కనిపించని రక్తపు మరకలు, పోస్టుమార్టం నివేదికలలో నమోదైన గాయాలు కీలక సాక్ష్యాలుగా నిలిచాయి. నిందితులలో ఒకరైన స్పెషల్ సబ్ ఇన్‌స్పెక్టర పాల్దురై, విచారణ జరుగుతున్న సమయంలో కోవిడ్-19 బారిన పడి మరణించారు. పాతన్‌కుళం కేసు దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. కస్టడీ హింస, పోలీసుల జవాబుదారీతనంపై జరిగే చర్చలలో ఒక కీలక ప్రస్తావనగా నిలిచింది. ఇప్పుడు శిక్ష ఖరారు కావడంతో మరోమారు మదురై కోర్టు తీర్పు దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది.

### వారం - వర్జ్యం

07-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
పంచమి సా.4.35
జ్యేష్ఠ తె.5.53
వర్జ్యం : ఉ.9.14-ఉ.11.02
దు.ఉ.8.26-ఉ.9.16, 2)రా.11.18-రా.12.08
శుభసమయం : ఉ.5.30-6.30
రాహుకాలం - మ.3.00-4.30

### వార్తాఫలం

**మేషం :** కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు.నూతన విద్యావకాశాలు కలవు.

**వృషభం:** చిన్న పనికీ, పెద్ద పనికీ ఒకే విధంగా శ్రమ చేయవలసి ఉంటుంది. శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**మిథునం:** మీలో ఉన్న చిన్న లోపాన్ని పెద్దదిచేసి మీ ప్రతిష్ఠను భంగపరచాలను కునే వారి సంఖ్య పెరుగుతుంది.

**కర్కాటకం:** రహస్యపు వ్యూహాలు విజయ వంతమవుతాయి. జీవితభాగస్వామి నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** అదృష్టము కలిసివచ్చినా అది సంపూర్ణంగా మీ ఒక్కరికి సొంతం కాదు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య :** సన్నిహితుల నుండి ముఖ్య సమాచారాన్ని అందుకుంటారు. కానీ పెద్దగా ఉపయోగించుకోలేకపోతారు.

**తుల :** చాలా కాలంగా అపరిష్కారంగా ఉన్న ఓ కుటుంబ సమస్య పరిష్కార దశకు చేరుకుంటుంది. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**వృశ్చికం:** గృహ విషయంలో కాని, ఇతరత్రా విషయాలలో గాని బంధువుల జోక్యము రానీయకండి.నూతన విద్యావకాశాలు కలవు.

**ధనుస్సు:** అదనపు సౌకర్యాలు ఏర్పరచు కుంటారు. ముఖ్యమైన ప్రయాణ సంబంధిత ప్రయత్నాలు ఆలస్యంగా అనుకూలిస్తాయి.

**మకరం:** కార్యక్రమాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**కుంభం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. సన్నిహితుల నుండి సహాయసహకారాలు అందుకుంటారు.

**మీనం :** ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనడం వలన మానసిక ప్రశాంతత పొందుతారు. వాహనసౌఖ్యం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మీ ఊరొస్తా.. తేల్చుకుందాం

>> వలస వెళ్తున్నారని (బ్రెయిన్ డ్రెయిన్), అక్కడ పారిశ్రామికాభివృద్ధి కుంటుపడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో కేవలం 28 నెలల్లోనే 67,763 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామని, హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి) హబ్ గా మార్చామని తెలిపారు. కేరళలో జరిగిన గోల్డ్ స్మగ్లింగ్ కేసును, శబరిమల ఆలయ బంగారం తాపడం విషయంలో జరిగిన అక్రమాలను రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాంధీ. కుటుంబాన్ని వేధిస్తోందని, కానీ బేదళ సీఎం కార్యాలయంపై వస్తున్న ఆరోపణల విషయంలో సీబీఐ ఎందుకు మౌనంగా ఉందో ప్రజలకే వదిలేస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నుంచి ముఖ్యమంత్రిగా సేవలందించిన కరుణాకరణ్, ఆయన హయాంలోనే కేరళంలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి జరిగిందని చెప్పారు. మాజీ సీఎం ఊమెన్ చాందీ హయాంలో సంక్షేమం, అభివృద్ధి వంటి అంశాలతో కేరళం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల కృషిని, ఘనతలను కూడా విజయన్ తన ప్రభుత్వ గొప్పతనంగా ఆపాదించుకోవడం సబబు కాదన్నారు. విజయన్‌కు అనుకూలమైన అంశాలను మాత్రమే ఎంచుకొని మాట్లాడి, సామూహిక కృషిని తన ఖాతాలో వేసుకోవడం సహేతుకం కాదన్నారు.పేదరికంపై నీతి ఆయోగ్ 2023-24 గణాంకాల ప్రకారం,కేరళలో పేదరికపు రేటు 0.55శాతం గానూ, తెలంగాణలో 5.88శాతం గానూ ఉందని విజయన్ ఉదహరించారు. కేరళలో పేదరికం తక్కువ కావడానికి గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, వామపక్ష సర్కారులు గత 60కి పైగా సంవత్సరాలుగా సాగించిన పరిపాలన ఫలితం. అలాగే గల్ఫ్ దేశాల నుండి భారీ మొత్తంగా వచ్చిన విదేశీ మారక ద్రవ్యాల (నగదు) ప్రవాహం సమిష్టి ఫలితం. తెలంగాణ ఏర్పడి కేవలం 12 సంవత్సరాలే అయ్యింది. అందులోనూ దాదాపు 10 సంవత్సరాలు రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ సంయుక్తంగా సృష్టించిన ఆర్థిక విధ్వంసం కారణంగా రాష్ట్రంలో 5.88 శాతం పేదరికం నమోదు అయింది. 60 సంవత్సరాల తర్వాత కేరళం ఏ స్థితిలో ఉన్నదన్నది ఇక్కడ విషయం కాదు. కేవలం 28 నెలల కాలంలోనే తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఎంతమేర అభివృద్ధి చేసిందన్నదే ఇక్కడ మా వాదన. మా ప్రభుత్వ విజయాలు ఏంటో యావత్ దేశానికి తెలుసు అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తూ... గ్రీన్ ఎనర్జీ దిశగా వెళ్ళేందుకు క్యూర్(కోర్ అర్బన్ రిమూవల్ ఆఫ్ పొల్యూటింగ్ ఇండస్ట్రీస్), తయారీ రంగం కోసం ప్యూర్ (పెరి అర్బన్ రీజియన్ ఫర్ మ్యానుఫ్యాక్చరింగ్)లను అమలు చేస్తున్నాం,.మెట్రో రైల్ విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రైల్వే, బుల్లెట్ ట్రైన్ హబ్, రెండు కొత్త విమానాశ్రయాలు,డ్రై పోర్ట్, పక్క రాష్ట్ర ఓడరేవుకు 12లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాము.మూసీ నదికి పునరుజ్జీవం, చెరువులను ఆక్రమణల నుండి సంరక్షి ంచాము. చెరువుల తీరంలో ఆర్థిక వ్యవస్థను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకు ంటున్నామని తెలిపారు. దేశంలోనే అత్యంత ప్రణాళికాబద్ధంగా పారిశ్రామికసేవల జోన్‌లలో ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును చేపట్టామని వివరించారు. అయితే లేఖ చివరలో రేవంత్ రెడ్డి ఒక ఆసక్తికరమైన ముగింపు ఇచ్చారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన నరసింహం సినిమాలోని ప్రసిద్ధ డైలాగ్ 'నీ పో మోనే విజయన్' (నువ్వు వెళ్లు బాబు విజయన్) అని ఉటంకిస్తూ కేరళ సీఎంకు సెటైర్ వేశారు. అలాగే, ఏప్రిల్ 7న తిరువనంతపురం వచ్చి నేరుగా గణాంకాలతో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధిని విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని రేవంత్ రెడ్డి ఈ లేఖ ద్వారా హితవు పలికారు. స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి సారి మా రాష్ట్ర ప్రభుత్వం సామాజికఆర్థిక కుల సర్వేను మొత్తం జనాభాలో బీసీల శాతాన్ని గుర్తించడానికి నిర్వహించి శతాబ్దాల నాటి సామాజిక సమస్యను పరిష్కరించిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర స్థాయిలో చట్టం తీసుకువచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ విప్లవాత్మక అడుగులు, జాతీయ జనాభా లెక్కలలో కులాన్ని చేర్చాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ప్రధాన కారణమైందన్నారు.దశాబ్దాలుగా, దళితులు షెడ్యూల్డ్ కులాల కోటాను వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశాయి. అందుకు ఒక కమిటీని మా ప్రభుత్వం ఏర్పాటు చేసి, సర్వే నిర్వహించి, సామాజిక ఏకాభిప్రాయాన్ని తీసుకొచ్చి, ఎస్సీ వర్గీకరణ విజయవంతంగా చేపట్టామన్నారు. తల్లిదండ్రుల రక్షణ బిల్లు, గిగ్ వర్కర్ల రక్షణ బిల్లు వంటి సామాజిక చట్టాలను ఆమోదించి, ఆచరణ దిశగా ముందుకు కదులుతున్నాం.ప్రభుత్వంలో, ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసు లలో ట్రాన్స్‌జెండర్లను నియమించి ప్రగతిశీల నిర్ణయం తీసుకున్నాము. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిర్ణయాన్ని యావత్ దేశం ప్రశంసలు గుప్పించింది. కొన్ని రాష్ట్రాలు అనుకరిస్తున్నాయి కూడా అని లేఖలో పేర్కొన్నారు.



సోమవారం బాసర ఆలయంలో మనవడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న సిఎం రేవంత్

## బాసరలో మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్6:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో తన మనవడు రియాన్ష్ (రుద్రదేవ్)కు అక్షరాభ్యాసం చేయించారు. ముఖ్యమంత్రి ఈరోజు బాసరలో పర్యటించి ఆలయ అభివృద్ధి పనులకోసం భూమిపూజ చేశారు. కుటుంబంతో సహా ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం తన మనవడికి అక్షరాభ్యాసం చేయించారు.బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మహారాజ్... రియాన్ష్ కు పలక బలపంతో అక్షరాభ్యాసం చేయించారు. సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, వారి కుమార్తె నైమిశా రెడ్డి దంపతులతో పాటు మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, తన మనవడికి తల్లిదండ్రులు రియాన్ష్ అని పేరు పెట్టగా, తాను మాత్రం రుద్రదేవ్ అని పిలుచుకుంటానని ఒక సందర్భంలో ముఖ్యమంత్రి చెప్పారు.

## ప్రజలే కేంద్రంగా పాలన

>> రాబోయే గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం బోథ్ నియోజకవర్గంలోని పిప్రిలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదట యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఐటిడిఏ భవనం, నగోబా గుడి సౌకర్యాలు, మైనార్టి, బిసి రెసిడెన్షియల్ స్కూల్స్, పిప్రి, తేజాపూర్, ముత్నూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తి పోతల పథకం, సిరికొండ, ల్యాండ్ సంగి చెక్‌డ్యాం, చిక్‌మన్ వాగు ప్రాజెక్టు,మున్సిపల్ సౌకర్యాలు, విద్యుత్ సబ్ స్టేషన్లు తదితర అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంతం నిరంకుశత్వానికి నిటారుగా నిలబడి కొట్లాడి అమరులైౖ రాజులనే గద్దెదించిన చరిత్ర కలిగినదని అనాడు కొమురం భీం, రాంజీ గోండు నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన వెయ్యి ఉరుల మర్రిగా ఈ ప్రాంతంలో ప్రసిద్ధి పొందిన రాంజీ గోండు త్యాగం, జల్ జంగల్ జమీన్ నినాదం ప్రపంచానికే వినిపించేంతా గొప్పగా ఉద్యమాన్ని నడిపిన కొమురం భీం గొప్ప స్ఫూర్తి ప్రదాత అని, ఈ అటవీ ప్రాతంలో అపారమైన ఖనిజ సంపద, ఒడిసి పట్టేంతా నదిజలాలు, శ్రమించే గల ప్రజలు ఉన్నారన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతం వెనుకబడిందన్నారు. మూడు సంవత్సరాల క్రితం సిఎల్‌పి నేత బట్టి విక్రమార్క ఈ ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఈ పిప్రి గ్రామం నుండి ప్రజలు, పటేళ్ళతో కలిసి ఖమ్మం వరకు 1400 కిలో మీటర్లు పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, 45వేల ఇండ్లకు రూ.22,500 కోట్లు నిధులు కేటాయించామన్నారు. ఐటిడిఏ ప్రాంతంలోని గిరిజనులకు అదనంగా 25వేల ఇండ్లను మంజూరు చేసి ప్రతి లబ్ధిదారునికి రూ.5లక్షలను ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.బోథ్ నియోజకవర్గంలో రూ.50.70 కోట్ల అంచనాతో పిప్రి ఎత్తిపోతల పథకం, రూ.44.64 కోట్లతో తేజాపూర్ ఎత్తిపోతల పథకం, ఇంద్రవెల్లి మండలంలో రూ.65.85 కోట్లతో ముత్నూరు చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ (త్రివేణి సంఘం పథకం) ,ఆదిలాబాద్ నియోజకవర్గంలో ల్యాండ్ సంగి దగ్గర రూ.6.435 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణం, ఖానపూర్ నియోజకవర్గం సిరికొండ మండలంలో రూ.31.52కోట్ల అంచనాతో చిక్‌మన్ వాగు ప్రాజెక్టు నిర్మాణం, కొమ్రం భీం జిల్లా కెరమెరి మండలం అమ్మన మడుగు వాగు ప్రాజెక్టు రూ.11.76 కోట్ల అంచనాతో మరమ్మత్తుల పనులు, బోథ్ నియోజకవర్గం ఆడేగామ గ్రామంలో రూ.200 కోట్ల అంచన వ్యయంతో యంగ్ ఇండియా సమీకృత గురుకల పాఠశాల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్పూర్ మండలం సిర్గాపూర్ గ్రామంలో రూ 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణం, బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో రూ 45.15 కోట్ల అంచనా వ్యయంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం, అదిలాబాద్ నియోజకవర్గంలో రూ 20 కోట్ల అంచన వ్యయంతో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు) భవనం, అదిలాబాద్ నియోజకవర్గం జైనథ్ లో రూ 20 కోట్ల మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్య పాఠశాల భవనం (బాలురు), నాగోబా దేవస్థానం అభివృద్ధి సుందరీకరణ ప్రాజెక్టుకు శంకుస్థాపన రూ 20.10 కోట్ల అంచనా వ్యయం, అదిలాబాద్ సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో రూ 13.46 కోట్ల అంచనా వ్యాయామంతో నూతనంగా నిర్మించిన వంతెన ప్రారంభోత్సవం, బోథ్ నియోజకవర్గం దన్నూరు, కుప్టి, కుచాలాపూర్లలో 3.33/11కేవి విద్యుత్ కేంద్రాల నిర్మాణం,రూ. 30 కోట్ల వ్యయంతో బోథ్ దేద్రారోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. యూనివర్శిటి స్థాపనకు త్వరలో శ్రీకారం చుడుతామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు కోరినట్లుగా గూడేం గుట్ట సత్య నారయణ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపోదించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేందర్ గౌడ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, విజయ రమణ, ఎంపి గేడం నగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మట్, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, శాసన సభ్యులు అనిల్ జాదవ్, పాయల శంకర్, ప్రేంసాగర్ రావు, వెడ్మ బొజ్జు తదితరులు, ఉన్నారు.

## ప్రాణహిత-చేవెళ్లకు కొత్తఊపిరి

>> ఆదిలాబాద్ జిల్లాలో లక్షలాది ఎకరాలకు నీరందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రాణహితచెవెళ్ల నీటిపారుదల ప్రాజెక్టును పునరుద్ధరించింది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన డాక్యుమెంటేషన్ తయారీ, పరీక్షలతో సహా సన్నాహక పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నీటిపారుదల సలహాదారు యోగి ఆదిత్యనాథ్‌దాస్‌ను నియమించారు. సవరించిన రేట్లకు ప్రాజెక్టును పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. తుమ్మిడిహట్టి బ్యారేజీకి పూర్తి జలాశయ మట్టం 148 మీటర్ల వద్ద నిర్వహించాలని భావిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర జల సంఘానికి వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డిపిఆర్)ను ప్రభుత్వం సమర్పించింది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 17,875 కోట్లుగా అంచనా వేయబడిన ఈ ప్రాజెక్టు వ్యయం ఆ తర్వాత రూ. 36,257 కోట్లకు పెరిగింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పేరుతో ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టును రిడిజైన్ చేయకమునుపే రూ. 11,678 కోట్లను ఖర్చు చేశారు. సుందిళ్ల లింకు ద్వారా సవరించిన సాధ్యాసాధ్యాలను ప్రభుత్వం అధ్యయనం చేసింది. సవరించిన అంచనాల వల్ల ప్రాజెక్టు వ్యయం దాదాపు 10 నుండి 12 శాతం వరకు తగ్గనుంది. అంతేకాకుండా భూసేకరణ కూడా దాదాపు సగానికి తగ్గనుంది. తెలంగాణలోని ఎత్తైన ప్రాంతాలు, కరువు పీడిత ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నడుంబిగించింది.

## విసిలతో గవర్నర్ సమావేశం

>> వివరించారు, ఉన్నత విద్యా బలోపేతం కోసం ఉన్నత విద్యా మండలి చేపట్టిన వివిధ కార్యక్రమాలను గవర్నర్‌కు తెలిపారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సిలబస్ సవరణలు, వినూత్నంగా ఉండే కొత్త కోర్సులను ప్రవేశ పెట్టడం గురించి వివరించారు. విద్యా సహకారాలను ప్రోత్సహించడానికి, నైపుణ్యాభివృద్ధిని పెంచడానికి చేసుకున్న అవగాహన ఒప్పందాల(ఎంవోయు) గురించి చెప్పారు. గవర్నర్ భేటీలో ప్రధానంగా యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకం, మౌలిక సదుపాయాల పరిమితులు, విశ్వవిద్యాలయాల్లోని ప్రస్తుత విద్యా, పరిపాలనా పరిస్థితిపై గవర్నర్‌కు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి సవివరంగా వివరించారు. ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి రచించిన ఫౌండేషన్స్ అండ్ ఫ్రాంటియర్స్ లా, లీగల్ ఎడ్యుకేషన్, అండ్ గ్లోబల్ ఆర్డర్ అనే తన పుస్తకాన్ని గవర్నర్‌కి అందజేశారు. రాష్ట్రంలో ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి ఉన్నత విద్యా మండలి తీసుకున్న చర్యలను గవర్నర్ అభినందించారని తెలిపారు. ఉన్నత విద్యలో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని గవర్నర్ సూచించారని తెలిపారు.

## మజ్లిస్‌కు రాసిచ్చారా?

>> నుండి అక్రమంగా వేల మంది హైదరాబాద్‌కు వచ్చారని, కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులు రోహింగ్యాలకు రేషన్ కార్డులు, ఓటర్ కార్డులిచ్చి రెడ్ కార్పెట్ పరిచారని దుయ్యబట్టారు. పాతబస్తీలో కొంత మంది బెంగాలీ కుటుంబాల పిల్లలను మజ్లిస్ గూండాలు డ్రగ్స్ ఎరవేసి లోబర్చుకునే ప్రయత్నం చేశారని, మజ్లిస్ గూండాల అరాచకాలకు పోలీసులూ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు. సీఎంగా, హోం మంత్రిగా ఉన్నా రేవంత్‌రెడ్డి పాతబస్తీలో అరాచకాలను అడ్డుకోలేకపోతున్నారని దుయ్యబట్టారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలుస్తుంటే అడ్డుకుంటే బీజేపీ కార్యకర్తలపై, పేదలపై లాఠీ ఛార్జ్ చేసి కేసులు పెట్టారని, కాని పాతబస్తీలో మాత్రం అక్రమ నిర్మాణాలను కూలుస్తున్న అధికారులపై మజ్లిస్ దాడులు చేస్తున్నా కనీసం కేసులు పెట్టలేని అసమర్ధ సర్కారు తెలంగాణలో నడుస్తోందని బండి సంజయ్ మండిపడ్డారు. పాతబస్తీతోపాటు రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నా, గోవధ జరుగుతున్నా, లవ్ జీహాద్ పేరుతో హిందువులపై దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. పాతబస్తీని అబివృద్ధి చేయలేని సిఎం బాసరకు పోయి ఆదిలాబాద్‌ను వేల కోట్లతో అభివృద్ధి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులిస్తున్నా గ్రామాలను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా పాతబస్తీలో అధికారులు, పోలిసులపై జరుగుతున్న దాడులపె సిఎం వెంటనే స్పందించాలని, లేనిపక్షంలో పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదముందని హెచ్చరించారు.

## వర్సిటీపై ఇజ్రాయెల్ దాడి

>> దాడుల్లో దెబ్బతిందని ఇరాన్ ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ దాడులపై ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఇరాన్‌లోని కుర్దులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌లో నిరసనకారులకు చేరవేసేందుకు తాము రహస్యంగా ఆయుధాలు పంపిస్తే, అవి వారికి చేరలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో నిరసనకారులకు ఆయుధాలు చేరవేయాలనే ఉద్దేశంతో కుర్దుల ద్వారా వాటిని పంపించామని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున తుపాకులు పంపించినట్లు తెలిపారు. కానీ ఈ ఆయుధాలు నిరసనకారులకు చేరలేదని అనుకుంటున్నానని, వాటిని కుర్దులు తమ వద్దనే ఉంచుకున్నట్లుగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇరాన్‌లో ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే. ఇక్కడి ప్రభుత్వాన్ని పడగొట్టాలనే ఉద్దేశంతో అమెరికా ఆయుధాలను పంపించే ప్రయత్నం చేసింది. ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న కుర్దుల ద్వారా నిరసనకారులకు ఆయుధాలను చేరవేయాలనుకుంది. కానీ ఈ ఆయుధాలు నిరసనకారులకు చేరకుండా కుర్దులు తమ వద్దనే ఉంచుకున్నారని తాజాగా ట్రంప్ ఆరోపించడం గమనార్హం. అలాగే ఇజ్రాయెల్ తాజాగా సోమవారం సౌత్‌పార్స్ పెట్రోకెమికల్‌ప్లాంట్‌పై దాడిచేసింది. ఈ దాడిలో ఒక ఐఆర్‌జిసి సైనికుడు కూడా చనిపోయాడు. యుద్ధ శాశ్వత విరమణ ఉండాలని ఇరాన్ తన డిమాండ్లుప్రకటించింది. సైనిక ఉపసంహారణ, నష్టానికి పరిహారం చెల్లింపులు, తక్షణమే శాశ్వతప్రాతిపదికన యుద్ధవిరమణ, భవిష్యత్తులో దాడులు ఉండవన్న స్పష్టమైన హామీ ఉండాలనిప్రకటించింది. అయితే ఈజిప్టు, తుర్కియే, పాకిస్తాన్‌ల ఆధ్వర్యంలో 45 రోజులపాటు కాల్పుల విరమణ ప్రతిపాదన, హార్ముజ్ జలసంధిని పూర్తిస్తాయిలో రాకపోకలకు అనువుగా మార్చడం వంటివి పేర్కొంటూ డిమాండ్ల వివరాలను ఇరాన్‌కు చేరవేసాయి. వీటిని పరిశీలించిన ఇరాన్ నిష్కర్షగా తిరస్కరించింది.

# రోహిత్‌సహా ముగ్గురికి మూడో దఫా కస్టడీపై తీర్పు రిజర్వ్

## మొయినాబాద్ ఫాంహౌజ్ డ్రగ్స్ కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్‌రెడ్డి ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అ రెస్టయిన ముగ్గురు వ్యక్తుల మూడో దఫా కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. దీనిపై రాజేంద్రనగర్ కోర్టు మంగళవారం తీర్పు వెలువరించనుంది. గత నెల 14వ తేదీ రాత్రి మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లోగల రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్ పోలీసులతోపాటు చేవెళ్ల పోలీసులు రట్టుచేయడం తెలిసిందే. ఈ సందర్భంగా 11 మంది పట్టుబడగా ఇందులో రోహిత్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్‌రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌యాదవ్, ఢిల్లీకి చెందిన నమిత్‌శర్మ, అర్జున్‌రెడ్డి, కౌశిక్ రవులు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడం విదితమే. అయితే పోలీసులు దాడిచేసిన సమయంలో రితేష్‌రెడ్డికి చెందిన లైసెన్స్ రివాల్వర్‌ను నమిత్‌శర్మ తీసుకుని పోలీసులను భయపెట్టేందుకు గాలిలో నాలుగురౌండ్లు కాల్పులు జరపడం సంచలనం రేపింది. దీంతో రోహిత్‌రెడ్డి తన ఫాంహౌస్‌లో అసాంఘిక కార్యకలాపాలకు స్థానం కల్పించినందుకు, తన లైసెన్స్ రివాల్వర్ మరో వ్యక్తికి ఇచ్చినందుకు రితేష్ రెడ్డిని, మరొకరి రివాల్వర్ చేత పోలీసులపై కాల్పులు జరిపినందుకు న మిత్‌శర్మను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సేవించిన ఎంపి మహేష్ కుమార్ యాదవ్‌సహా అందరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. కాగా పోలీసులు అరెస్టు చేసిన రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్‌శర్మ మూడు వారాలుగా చంచల్‌గూడ జైల్లో ఉండగా చేవెళ్ల పోలీసులు రెండు దఫాలు మూడేసి రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన సమాచారం ఏది వీరు వెల్లడించకపోవడంతో మరోదఫా కస్టడీ కోరాలని నిర్ణయించడం తెలిసిందే. వీరిపై డ్రగ్స్ వాడడం, అక్రమంగా మాదకద్రవ్యాలు కలిగి ఉండడంతోపాటు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో రోహిత్‌రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్‌శర్మలను మరింతగా విచారించేందుకు మూడో దఫాగా ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని మొయినాబాద్ పోలీసులు రాజేంద్రనగర్‌లో దాఖలు చేసిన పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ముగ్గురికి మూడో దఫా కస్టడీని నిందితుల తరపు న్యాయవాది వ్యతిరేకించారు. ఇప్పటికే ఆరు రోజులపాటు విచారించినందున ఇక కస్టడీ విచారణ అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని ఆయన కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న రాజేంద్రనగర్ కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. దీనిపై మంగళవారం కోర్టు తీర్పు ఇవ్వనుంది.

**రితేష్‌రెడ్డి రివాల్వర్ లైసెన్స్ రద్దు?**

ఇదిలా ఉండగా పైలెట్ రోహిత్‌రెడ్డి సోదరుడు రితేష్‌రెడ్డి రివాల్వర్ లైసెన్స్‌ను సైబరాబాద్ పోలీసులు రద్దు చేసినట్లు తెలిసింది. రోహిత్ రెడ్డి ఎమ్మెల్యేగా వున్న సమయంలో తన సోదరుడికి రివాల్వర్ లైసెన్స్ ఇప్పించారు. ఆయన ఫాంహౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ పార్టీ, కాల్పుల తరువాత రివాల్వర్‌ను జప్తు చేయగా ఇప్పుడు దీనిని లైసెన్స్‌ను రద్దు చేశారు.



ఈట్ రైట్ – స్టే హెల్దీ మేళాలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

# హైదరాబాద్‌లో ఈట్ రైట్ - స్టే హెల్దీ మేళా

**హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** సంజీవరెడ్డి నగర్‌లోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన ఈట్ రైట్ – స్టే హెల్దీ మేళాలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించి, అక్కడ ప్రదర్శించిన ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు.మేళాలో భాగంగా నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పలువురు ఫుడ్ వెండర్లు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మిల్లెట్స్‌తో తయారు చేసిన ఐస్‌క్రీమ్, కాఫీ తదితర వంటకాలు ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాయి. మంత్రి స్వయంగా ఈ పదార్థాలను రుచి చూసి, తయారీ విధానంపై ఆరా తీశారు.అదేవిధంగా పాలు, పండ్లు, కూరగాయలు, మసాలా దినుసులు, పప్పులు, టీ పౌడర్ వంటి ఆహార పదార్థాల్లో కల్తీని ఎలా గుర్తించాలో వివరించే స్టాల్స్‌ను ఫుడ్ సేఫ్టీ అధికారులు ఏర్పాటు చేశారు. కల్తీ ఆహారాన్ని గుర్తించే పద్ధతులను అధికారులు, శాస్త్రవేత్తలు మంత్రికి వివరించారు. ఈ అవగాహనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి అధికారులకు సూచించారు. ఇప్పపువ్వుతో లడ్డూలు తయారు చేసి విజయవంతంగా వ్యాపారం నిర్వ హిస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని గుర్తు చేశారు. మేళా అనంతరం నిర్వహించిన సభలో స్ట్రీట్ ఫుడ్ వెండర్లకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, హోటళ్లు, రెస్టారెంట్లకు హైజీన్ సర్టిఫికెట్లు మంత్రి అందజేశారు. ఫుడ్ సేఫ్టీ, పోషకాహారంపై నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు కూడా అందించారు. ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, కల్తీ ఆహారం కనిపించిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని మంత్రి రాజనర్సింహ పిలుపునిచ్చారు.

# ఇంధన కొరతతో నేపాల్‌లో వారానికి రెండురోజులు సెలవులు!

**కఠ్మాండు, ఏప్రిల్ 6:** హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ దేశాలు ముఖ్యంగా ఆసియా దేశాలకు ఇంధన కొరత భారీ ఎత్తున పెరిగిన సంగతి తెలిసిందే. వీటిని అదుపులో ఉంచుకునేందుకుగాను పొరుగు దేశమైన



నేపాల్‌లో ప్రభుత్వ కార్యాలయాలకు శని, ఆదివారాలను రెండు వారపు సెలవు దినాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదివారం రెండు ముఖ్య నిర్ణ యాలను ప్రకటించింది. ఈ కొత్త నిర్ణయం ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తెరిచి ఉంటాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఇకపై శని, ఆదివారాల్లో మూసివేయబడతాయని ప్రభుత్వ ప్రతినిధి సస్మిత్ పోఖరేల్ తెలిపారు. పెట్రోలియం సరఫరాల విషయంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితి కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటివరకు నేపాల్‌లో శనివారం మాత్రమే వారపు సెలవు దినంగా ఉండేది, కానీ ఈ వారం నుండి శని, ఆదివారాలు రెండూ సెలవు దినాలుగా ఉంటాయి. ప్రభుత్వ కార్యాలయాల పనివేళలను ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలని కూడా ప్రభుత్వం నిర్ణయిం చింది. విద్యాసంస్థలు మినహా ప్రభుత్వ కార్యాలయాలకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలను కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ సమయ పరిమితి విద్యా సంస్థలు మినహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వర్తిస్తుంది. ఇప్పటి వరకు నేపాల్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసేవి, అయితే ఉదయం పూట ఈ సమయాన్ని ఒక గంట పొడిగించారు. ఈ కొత్త విధానం సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుంది. పనితీరుకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, ప్రభుత్వ కార్యాలయ ఉద్యోగులు ఇకపై ఒక గంట ముందుగా, అంటే ఉదయం 9 గంటలకే విధులకు హాజరు కావాల్సి ఉంటుంది.

# భారీగా పతనమైన ఉల్లి ధరలు

## గిట్టుబాటు ధర రాక రైతుల పరేషాన్

**హైదరాబాద్, ఎప్రిల్ 6, ప్రభాతవార్త:** పశ్చిమాసియా యుద్ధ ప్రభావం ఉల్లి రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. ఉల్లిని కొనుగోలు చేసి కోసే సమయంలో వినియోగదారుల కంటనుండి రావాల్సిన కన్నీళ్లు.. భారీగా పతనమైన ధరలతో ఉల్లి పండించిన రైతుల కంట నుండి వస్తున్నాయి. ప్రస్తుతం ఉల్లి ధరలు భారీగా పడిపోయాయి. గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో మార్కెట్‌లోకి ఉల్లి సరఫరా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. పతనమైన ధరలతో పంట సాగు గిటుబాటు కాక రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం ధరలు పడిపోవడంతో రూ.100కు 8 కిలోల ఉల్లిపాయలు మార్కెట్లలో లభ్యమవుతున్నాయి. ఉమ్మడి మహబూబ్ నగర్‌లో నెల క్రితం క్వింటా ఉల్లి రూ.2 వేలు ఉండగా ఇప్పుడు రూ.800 నుంచి రూ.1200 మధ్యకు పడిపోయింది. పండించిన పంటకు ధర లేకపోవడంలో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ఇక ధర లేకపోవడం, కనీసం ప్రయాణ ఖర్చులకు కూడా సరిపోకపోవడంతో రోడ్ల పక్కన ఉల్లిని పారబోసి వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. కనీసం పోలం నుంచి మార్కెట్‌కి తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదని అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

# కుమార్తె విడాకులను వేడుకగా నిర్వహించిన రిటైర్డ్ జడ్జి కుటుంబం!

**మీరట్, ఏప్రిల్ 6:** సాధారణంగా ఎవరైనా పెళ్లిళ్లు, పండుగలు, పెళ్లిరోజులు, పుట్టినరోజులు, ఇతర శుభ సందర్భాల్లో చేసుకునే సంబరాలు ఓ రిటైర్డ్ న్యాయ మూర్తి కుటుంబం మాత్రం ఆయన కుమార్తె విడాకులను వేడుకగా నిర్వహించుకోవడం ఆసక్తి రేకెత్తించింది. బ్యాండ్ బాజాలు, మేళతాళాలు, ఆటపాటలు, విందు భోజనాలతో అచ్చం పెళ్లి మాదిరిగానే వేడుక నిర్వహించింది. ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో ఈ ఘటన జరిగింది.



మేరఠ్‌కు చెందిన రిటైర్డ్ జడ్జి డాక్టర్ జ్ఞానేంద్ర కుమార్ శర్మ కుటుంబం సంప్రదాయ సామాజిక వైఖరులకు పూర్తి భిన్నంగా కుమార్తె విడాకుల మంజూరును ఓ వేడుకలా నిర్వహించింది. సైకాలజీలో పీజీ చేసిన శర్మ కుమార్తె ప్రణీత వశిష్ఠకు 2018లో ఆర్మీ మేజర్‌తో వివాహమైంది. దంపతుల మధ్య వివాదాల నేపథ్యంలో మేరఠ్‌లోని కుటుంబ న్యాయ స్థానం ఆమెకు విడాకులు మంజూరు చేసింది. ప్రణీత కోర్టు నుంచి బయటకు రాగానే కుటుంబసభ్యులు పూలమాలలు వేసి, మేళ తాళాలతో ఊరేగింపుగా పుట్టింటికి తీసుకుని వెళ్లారు. ఈ ఊరేగింపు సందర్భంగా ప్రణీత కుటుంబ సభ్యులందరూ ఐ లవ్ మై డాటర్ అంటూ ప్రణీత చిత్రాలు కలిగిన టీషర్టులు ధరించారు. వైవాహిక జీవితంలో తన కుమార్తె సంతోషంగా లేదంటే ఆ వాతావరణం నుంచి ఆమెను బయటకు తీసుకురావడం తన విధి అని అన్నారు.

విడాకుల సందర్భంగా ఏమైనా భరణాలు తీసుకుంటున్నారా అని స్థానిక మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా కుమార్తెలు అంటే ఆస్తులు కాదని, తమకు ఎటువంటి భరణాలు అక్కర్లేదని జ్ఞానేంద్రకుమార్ చెప్పారు.

# లియాండర్‌పేస్‌కు కేంద్రం ఎక్స్ కేటగిరి భద్రత

**కోల్‌కతా, ఏప్రిల్ 6:** భారత టెన్నిస్ దిగ్గజం, భారతీయ జనతా పార్టీలో ఇటీవలే చేరిన లియాం డర్ పేస్‌కు కేంద్ర ప్రభుత్వం ఎక్స్ కేటగిరీ భద్రతను కల్పించింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆయన భద్రతకు ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో పనిచేసిన పేస్ వారం క్రితమే ఢిల్లీలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన స్టార్ క్యాంపెయినర్‌గా పాల్గొననున్నారు. ఈ క్రమంలో ఆయనకు భద్రతాపరమైన ముప్పు ఉందని ఐబీ హెచ్చరించడంతో కేంద్రం వెంటనే స్పందించింది. ఎక్స్ కేటగిరీ భద్రత కింద ఇద్దరు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్లు షిఫ్టుల పద్ధతిలో 24 గంటలూ లియాండర్ పేస్‌కు రక్షణగా ఉంటారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సమయంలో తరచూ హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటాయి. ఈ నేపథ్యంలో బీజేపీ తరఫున ప్రచార బరిలోకి దిగుతున్న పేస్ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం భావించింది. ముఖ్యంగా కోల్‌కతా వంటి పట్టణ ప్రాంతాల్లో లియాండర్ పేస్‌కు ఉన్న క్రీడాకారుడి ఇమేజ్‌ను ఓట్లుగా మలచుకోవాలని కమలం పార్టీ వ్యూహరచన చేస్తోంది. రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఆయనకు భద్రత కల్పించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



# గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలను వారంలోగా పరిష్కరించాలి

## లేదంటే రాష్ట్రవ్యాప్తంగా మెరుపు సమ్మె

## వర్కర్స్ ట్రేడ్ యూనియన్ హెచ్చరిక

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల యుద్ధంతో యావత్ ప్రపంచం గ్యాస్ సరఫరా లేక అనేక ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో తమ సమస్యలను వారంరోజుల్లో పరిష్కారించకపోతే మెరుపు సమ్మె చేస్తామని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేట్ ఇచ్చింది. రాష్ట్రంలో 600 గ్యాస్ ఏజెన్సీలలో పనిచేస్తున్న 60వేల మంది కార్మికులు సమ్మె చేస్తారని యూనియన్ హెచ్చరించింది. ఈ మేరకు యూనియన్ నాయకులు సిఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకట స్వామి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో యూనియన్ గౌరవ సలహాదారులు చామకూర రాజు, కె.వి.గౌడ్, గడ్డం సత్యనారాయణ, నల్ల లక్ష్మణ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీని వాస్‌గౌడ్, బి.చంద్రాయి తదితరులు మాట్లాడుతూ కార్మికులకు ఏజన్సీలు తక్షణమే కనీస వేతనాలు చెల్లించాలని, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కలి ్పంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

# డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే మార్గం

## ఎంపి మల్లు రవికి అలైన్‌మెంట్ మ్యాప్ అందజేసిన దక్షిణమధ్యరైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్





దక్షిణ మధ్యరైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ నుంచి మ్యాప్ అందుకొంటున్న ఎంపి రవి

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** డోర్నకల్–గద్వాల రైల్వే మార్గంపై చర్చించడానికి రైల్వే బోర్డు ఛైర్మన్, రైల్వేశాఖ మంత్రిని సమయం కోరానని త్వరలో వారికి వెనుకబడిన ప్రాంతంలో మౌళిక వసతులు పెంచడంతో ఆర్థికంగా సామాజికంగా ప్రజల్లో వచ్చే వృద్ధిని వివరిస్తానని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి తెలిపారు. సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ దగ్గర నుండి డోర్నకల్ టు గద్వాల్ అలైన్‌మెంట్ మ్యాప్‌ను ఎంపి మల్లు రవి అధికారికంగా అందుకున్నారు.ఈ రైల్వే లైన్ మార్గ నిర్మాణంలో ఏ ఏ ప్రాంతాలకు రవాణా సౌకర్యవంతంగా ఉండటానికి అనుసరించాల్సి న విధి విధానాలు రైల్వే బోర్డులో రైల్వే మంత్రి దగ్గర సూచనలు రవి తెలియాజేశారు. డోర్నకల్–గద్వాల రైల్వేలైను రెవెన్యూ రిటర్న్స్‌లేవని సాకు పెట్టకుండా బ్యాకవర్డ్ ఏరియా డెవలప్‌మెంట్ రాయల్ ప్లాంట్ కింద తీసుకొని రావడానికి ప్రయత్నాలు చేశాననిఆయన తెలిపారు. 1998లో నితిష్ కుమార్ రైల్వ మంత్రిగా బ్యాక్‌వర్డ్ ఏరియా స్కీమ్ ఏర్పాటు చేశారని ప్రధానమంత్రి,రైల్వే మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్ళినట్లు తెలిపారు. ఇంకా ఈ మార్గం గరిష్ఠ ప్రాంతాలకు లాభం చేకూర్చేలా రూపొందించడానికి సలహాలు సూచనలు ఇవ్వడానికి ఈ నెల 10వ తారీఖున రైల్వే బోర్డు ఛైర్మెన్‌ను,ఈ నెల 16,17,18 వ తేదీలలో రైల్వే శాఖ మంత్రి సమయం కోరామని ఆయన తెలిపారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో, బుధవారం జరిగే వనపర్తి జిల్లా కాంగ్రెస్ మీటింగ్ లో డోర్నకల్–గద్వాల్ రైల్వే లైన్ ప్రాముఖ్యతను వివరిస్తామని మల్లు రవి తెలిపారు. ఈ రైల్వే లైన్ ను సాధించడానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం లోని ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రైల్వే లైన్ వస్తే మన వెనుకబడిన నాగర్ కర్నూల్ పార్లమెంట్ కి దేశంలో ఉన్న ముఖ్యమయిన రైల్వే లైన్లతో అనుసంధానం కావడమే కాకుండా మనము ప్రాంతం అభివృద్ధి చెందడానికి దోహద పడుతుందని ఆయన అభిప్రాయ పడ్డారు. డోర్నకల్ నుంచి సూర్యపేట,నల్లగొండ జిల్లాలో ప్రవేశించి అక్కడ నుంచి నాంపల్లి మండం కేంద్రం నుంచి కల్వకుర్తి నియోజకవర్గంలోని ఇరువీన్‌కు ఈ మార్గం చేరుకొంటుంది. అక్కడ నుంచి వెల్దండ తాడురు మీదుగా నాగర్‌కర్నూల్‌కు ఈ మార్గం నిర్మాణం చేయబడుతోంది.ఇక్కడి నుంచి వనపర్తికి చేరుకొని చివరగ శ్రీరాంనగర్‌దగ్గరలో గద్వాల రైల్వేలైన్‌కు కలుస్తోంది. ఇరువీన్ గ్రామం నుంచి శ్రీరామ్‌నగర్ వరకు రైల్వే మార్గంలో పాదయాత్ర చేస్తానని ఇటీవల మల్లురవి ప్రకటించారు.

# కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై సమాలోచనలు

## బంజారా సమాజం కోసం కార్యక్రమాలపై ఆరా

## రిటైర్డ్ ఐపిఎస్ అధికారి డిటి నాయక్‌తో కవిత సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 6:** రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ సహా పలువురు బంజారా ప్రముఖులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని డీటీ నాయక్ నివాసానికి వెళ్లి కవిత మర్యాదపూర్వకంగా ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో సమావేశమయ్యారు. ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో బంజారా సమాజం కోసం ఏం చేయాలనే అంశాలపై వారితో కవిత చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే బంజారాలకు మంత్రివర్గంలో ప్రాతినిథ్యం లేకపోవ డం ఇదే మొదటిసారి అని, తాము ఏర్పాటు చేయబోయే పార్టీలకు బంజారా సమాజానికి సముచిత అవకాశాలు ఇస్తామని కవిత హామీ ఇచ్చారు. బంజారా ప్రముఖులు తాము ఏర్పాటు చేయబోయే రాజకీయ పార్టీకి సలహాలు, సూచ నలు అందజేయాలని కోరారు. ప్రత్యక్ష రాజకీ యాల్లో ప్రవేశించాలనుకునే వారికి తాము ఏర్పాటు చేయబోయే పార్టీలోకి స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. సమావేశంలో బంజారా ప్రముఖులు, ట్రైబల్ వెల్ఫేర్ మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి లక్ష ్మణ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌సింగ్‌నాయక్, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ భీమ్లా నాయక్, బస్కీ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి హరినాయక్, ట్రైబల్ ఎలక్ట్రిసిటీ బోర్డు అధ్యక్షుడు నారాయణ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మీడియా సెక్రటరీ భీముడు నాయక్, ఎలక్ట్రిసిటీ డీఈఈ బాలాజీ నాయక్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్ నాయక్, జాగృతి నాయకులు మోహన్ నాయక్, కళ్యాణ్ నాయక్, సక్రు నాయక్, రవి రాథోడ్, శివ నాయక్, రాంజీ నాయక్, మహేందర్ నాయక్, మానుకోట కళ్యాణ్ నాయక్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో మద్యం బాటిళ్ల తయారీ 40 శాతం తగ్గుదల

## పశ్చిమాసియా యుద్ధప్రభావం

## సీసాల ధరలు భారీగా పెరగడంతో

## మద్యం ధరలు పెంచాలని కంపెనీల డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** పశ్చిమాసియా యుద్ధం ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలపై తీవ్ర రూపంగా మారడం తెలిసిందే. భా రత్‌లోనూ దీని ప్రభావం అనేక రంగాలపై కనిపిస్తుండగా తాజాగా గాజు సీసాల ఉత్పత్తి 40 శాతం తగ్గిపోయింది. దీంతో పాటు ఖాళీ సీసాల ధర లు 20 శాతం పెరగడంతో పాటు వీటి లభ్యత తగ్గింది. దీంతో మద్యం తయారీ కంపెనీలు తప్పనిసరిగా అధిక ధరలు వెచ్చించి బాటిళ్లను కొనాల్సి న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో మద్యం తయారీ కంపెనీలు బీర్లతో పాటు వీస్కీ సహా ఇతర ఇతర మద్యం ధరలను 15 శాతం పెంచా లని ఆయా రాష్ట్రాలను కోరుతున్నాయి. తెలంగాణ సర్కారుకు పలు మద్యం తయారీ కంపెనీలు ఇప్పటికే అర్జీ పెట్టుకోవడం గమనార్హం. మధ్య ఆసియా యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో సంక్షోభం నెలకొని చమురు, గ్యాస్ ఉత్పత్తి బాగా తగ్గిపోవ డంతో దేశంలోని అనేకచోట్ల గాజు సీ సాల ఉత్పత్తి అనూహ్యంగా తగ్గిపోయింది. మద్యం నింపేందుకు గాజు సీసాలు తప్పనిసరి కావడం, వీటి ఉత్పత్తి ఎల్‌పిజి గ్యాస్ సరఫరాపై ఆధార పడి వుండడం, గల్ఫ్ దేశాల్లో యుద్ధం వల్ల వీటి సరఫరా తగినంత లేకపోవడంతో దేశ వ్యాప్తంగా బీరు సీసాలు, ఇతర మద్యం బాటిళ్లకు తీవ్ర కొర త ఏర్పడింది. ఇటువంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ తలెత్తలేదు. ఇరాక్‌పై గతంలో అమెరికా దాడి చేసిన సమయంలో గల్ఫ్ దేశాల్లో పలుమార్లు సంక్షోభం నెలకొన్నప్పుడు కూడా దేశంలో మద్యం బాటిళ్లకు కొరత ఏర్పడలేదు.

తగినంత గ్యాస్ సరఫరా వుండడంతో ఉత్పత్తి డిమాండ్‌కు అనుగుణ ంగా వుండేది. మద్యం బాటిళ్ల తయారీ కంపెనీలు దేశ వ్యాప్తంగా అనేకం వుండగా తెలుగు రాష్ట్రాలలోనూ వున్నాయి. అయితే గ్యాస్ కొరత వల్ల ఈ కంపెనీల్లో మద్యం బాటిళ్ల ఉత్పత్తి డిమాండ్‌కు తగినంతగా జరగడం లేదు. ఇదే సమయంలో ఒకసారి వాడిన బీరు సీసాలకు డిమాండ్ ఏర్పడింది.

నిన్నటి వరకు మద్యం ప్రియులు బీరు తాగిన తరువాత ఖాళీ సీసాలు బయట పారేస్తుండగా ఇప్పుడు వాటిని 25 రూపాయల నుంచి 30 రూపా యల వరకు అమ్ముతున్నారు. బార్లలో వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది, సాధారణంగా వేసవి కాలంలో బీర్లకు డిమాండ్ వుండడం తెలిసిందే.

సా ధారణ సమయాలతో పోలిస్తే వేసవిలో బీర్లకు 30 నుంచి 40 శాతం వరకు అదనంగా డిమాండ్ వుంటోంది. ఇదే సమయంలో కల్లు విక్రయాలకు కూడా బీరు సీసాల అవసరం వుంది. చాలా వరకు కల్లు డిపోలలో బీరు సీసాలకు కొరత ఏర్పడడంతో చిన్నపాటి మట్టి ముంతల్లో విక్రయాలు జరు పుతున్నారు. గతంలో గల్ఫ్ దేశాల్లో సంక్షోభాలు నెలకొన్నపుడు డిమాండ్‌కు సరిపడినంత మద్యం బాటిళ్లు అందుబాటులో వుండేవి. అయితే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు మొదలై నెలన్నర కావస్తున్నా ముగింపు కానకాక పోవడంతో దీని కారణంగా గల్ఫ్ దేశాల్లో అనేకచోట్ల చమురుతో పా టు గ్యాస్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో అక్కడి నుంచి భారత్‌కు రావాల్సి న చమురు, గ్యాస్ ట్యాంకర్లు చాలా వరకు తగ్గిపోయాయి. దీంతో గాజు సీసాలతో పాటు అల్యూమినియం క్యాన్ల తయారీ తగ్గిపోవడంతో వీటి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీని ప్రభావం మద్యం తయారీ కంపెనీలపై పడడంతో వాటి నిర్వాహకులు మద్యం ధరలను పెంచాలని ప్రభుత్వాలను కోరుతు న్నాయి.

లేకుంటే మద్యం తయారీపై కోత విధించాల్సి వుంటుందని అల్టీమేటం ఇచ్చారు. రాబోయే రెండు నెలలు వేసవి కాలం కావడం, ఈ సమయంలో బీర్లకు డిమాండ్ వుండడంతో వీటి ఉత్పత్తిపై కోత పెడితే అబ్కా రీ శాఖ బద్నాం కావాల్సి వుంటుందని ఆ శాఖ అధికా రులు చెబుతున్నారు. దీనిపై తెలంగాణ సర్కారు ఎలాం టి నిర్ణయం తీసుకుంటుందో? చూడాల్సి వుంది.


తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (LA) విభాగం

కలెక్టరేట్: మహబూబ్‌నగర్

ఫారం - VI, ప్రాథమిక ప్రకటన

(చట్టం-30/2013 యొక్క సెక్షన్ -11(1) మరియు నిబంధన-19 యొక్క ఉప-నిబంధన (1) చూడండి)

No. Rev/0001/2026-G-Section తేది: .03.2026

[illegible] ఎ.2.31½ గుం.ల [illegible] 25.07.2017 [illegible] 2013 [illegible]

[illegible] ఎ.2.31½ గుం.ల భూమి [illegible]

గ్రామం : [illegible] మండలం : [illegible] జిల్లా : మహబూబ్‌నగర్

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 72 | మెట్ట | పట్టా | 0.04 | [illegible] | 71 | 74 | VB | 73 | - | - |
| 2 | 72 | మెట్ట | పట్టా | 0.03 | [illegible] | 71 | 74 | VB | 73 | - | - |
| 3 | 72 | మెట్ట | పట్టా | 0.02 | [illegible] | 71 | 74 | VB | 73 | - | - |
| 4 | 72 | మెట్ట | పట్టా | 0.02 | [illegible] | 71 | 74 | VB | 73 | - | - |
| 5 | 72 | మెట్ట | పట్టా | 0.02 | [illegible] | 71 | 74 | VB | 73 | [illegible] | [illegible] |
| [illegible] | | | | | | | | | | | |
| 24 | 113 | మెట్ట | పట్టా | 0.0½ | [illegible] | 77 | VB | 74 | 114 | - | - |
| 25 | 113 | మెట్ట | పట్టా | 0.0½ | [illegible] | 77 | VB | 74 | 114 | - | - |
| 26 | 113 | మెట్ట | పట్టా | 0.0½ | [illegible] | 77 | VB | 74 | 114 | - | - |
| 27 | 113 | మెట్ట | పట్టా | 0.0½ | [illegible] | 77 | VB | 74 | 114 | - | - |
| [illegible] | | | | | | | | | | | |
| 48 | 114 | మెట్ట | పట్టా | 0.04 | [illegible] | 112 | VB | 113 | 115 | - | - |
| 49 | 114 | మెట్ట | పట్టా | 0.03 | [illegible] | 112 | VB | 113 | 115 | - | - |
| 50 | 114 | మెట్ట | పట్టా | 0.04 | [illegible] | 112 | VB | 113 | 115 | - | - |
| 51 | 114 | మెట్ట | పట్టా | 0.03 | [illegible] | 112 | VB | 113 | 116 | - | - |
| 52 | 114 | మెట్ట | పట్టా | 0.03 | [illegible] | 112 | VB | 113 | 115 | - | - |
| | | మొత్తం : | | 2.31½ | | | | | | | |

[illegible] చట్టం 2013 (చట్టం నెం.30 ఆఫ్ 2013)లోని సెక్షన్ 11 (1) [illegible]

[illegible] సెక్షన్ (12)లో [illegible]

[illegible] సెక్షన్ 11(4) [illegible]

[illegible] సెక్షన్ (15) [illegible] 60 (అరవై) [illegible]

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R యూనిట్-II ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, మహబూబ్‌నగర్

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్

సం/-. జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO.NO: 08/LA/PP/Advt/Pub/2026-27

వార్త

అదృష్టం తనంత తానుగా వచ్చి తలుపు తడుతుందని అందరూ చెప్తుంటారు. నమ్మవద్దు. అది అవకాశం రూపంలో ఉంటుంది. దాన్ని వెంటాడు. సొంతం చేసుకో.

- జాన్ వాట్సన్

# మౌలిక వసతులే కీలకం

సకాలంలో అందని న్యాయం న్యాయమే కాదు. అందుకే 'ఓడిన వాడు కోర్టులో ఏడిస్తే, గెలిచిన వాడు బయట ఏడుస్తాడు' అన్న జన శ్రుతిఉండనే ఉంది. ఒకపక్క కోర్టుల్లో పెండింగ్ కేసుల గురించి పదే పదే చర్చించుకుంటున్నాము. ఎందరో మేధావులు ఎన్నెన్నో సలహాలు, సూచనలు ఇస్తుంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మారినప్పుడల్లా పెండెన్సీ తగ్గించేందుకు ఎన్నో న్యాయపరమైన సంస్కరణలు తెస్తూనే ఉంటారు. అయినా కోర్టులో పెండెన్సీ తగ్గిందని చెప్పుకోవడానికి ఎలాంటి ఆధారాలు చూపలేదు. లోకాయుక్తలలో మధ్యవర్తిత్వం, రాజీ అయినా మరికొన్ని కేసులు జమ అవుతూనే ఉంటాయి. కోర్టు ఏ స్థాయిదైనా మౌలిక వసతులు, వనరులు లేని కోర్టులలో న్యాయం చెప్పే విషయంలో ఎలాంటి జాప్యం అవుతుందో అత్యున్నత ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో చెప్పచూసారు. కొన్ని అమూల్యమైన సంగతులను నివేదించారు. అందరికీ న్యాయమనే లక్ష్యం సాకారం కావాలంటే సరైన మౌలిక వసతులు అవసరం. న్యాయవ్యవస్థ స్వతంత్రపై తీర్పులు, సమావేశాలు, రాజ్యాంగ చర్చల్లో తరచూ మాట్లాడుకుంటున్న విషయాలే. చెల్లాచెదురుగా ఉండే ఇరుకిరుకు భవనాల్లో హైకోర్టు నిర్వహణ ఇబ్బందికరమే. న్యాయవ్యవస్థ స్వతంత్రకు మౌలిక వసతులు అత్యంత అవశ్యకం. హైదరాబాద్‌లో వంద ఎకరాల్లో హైకోర్టు సముదాయ నిర్మాణం పూర్తయితే సమగ్ర న్యాయ నిర్వహణకు అవకాశముంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిభాషణలో వ్యక్తమయిన అభిప్రాయాలివి. పనిచేసే వాతావరణం లేని చోట ఎవరూ పనిచేయజాలరు. ప్రధానంగా న్యాయనిర్ణేతలుగా ఉండే వారికైతే ఇరువైపులా వాదనలు వినేందుకు ప్రశాంత వాతావరణమూ ముఖ్యమే. ఇలాంటి అభిప్రాయం న్యాయ కోవిదులందరిలోనూ ఉన్నా ఆచరణ దుస్సాధ్యం. అందుకే కొత్తగా నిర్మించుకునే భవనాలు ఆ రీతిలో ఉండాలని భావిస్తుంటారు. ఇప్పుడు తెలంగాణలో అలాంటి పరిస్థితులు కలిసొచ్చాయి. పనులు సజావుగా సాగుతున్నాయి. తెలంగాణలో ఆ లక్ష్యం క్రమేపీ ఆచరణలోకి వస్తోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రజలకు కోర్టు అంటే బెంచ్, జాతీయ చిహ్నం, విచారణలు మాత్రమే కన్పిస్తాయని, వాటి వెనుక నిలువెత్తు నిబ్బరంగా ఉండే మౌలిక వసతులే కోర్టును నడిపిస్తాయని ఆయన భావన. ప్రస్తుతమున్న హైకోర్టు భవనాలు అవసరాలకు సరిపోకపోవడంతో రాబోయే నూరేళ్ల అవసరాలకు సరిపడే విశాలమైన, ఎన్నో మౌలిక వనరులు, వసతులు ఉన్న నూతన హైకోర్టు భవనాలను వేగవంతంగా నిర్మించుకుంటున్నందుకు ఆయన ఆనందం వ్యక్తం చేశారు. భారీ వృక్షం నిలబడాలంటే వేర్లు ఎంత బలోపేతంగా ఉంటాయో అదే మాదిరి న్యాయ వ్యవస్థకు అన్ని సౌకర్యాలూ ఉన్న భవనాలు అవసరమే నన్నారు. పాత తీర్పుల ప్రతులకు భద్రతస్థానం ఎంతో ముఖ్యమైనదైనందున తెలంగాణ హైకోర్టులో సకల సౌక ర్యాలున్న వేర్వేరు భవన నిర్మాణాలు చోటు చేసుకోవడం ప్రధాన న్యాయమూర్తిని ఆకట్టుకుంది. రాజ్యాంగం సజీ వంగా ఉండాలంటే న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు ఒకే లక్ష్యంతో గమనాన్ని చేరడం అవసరమన్నది ఆయన ఆలోచన. ప్రతి కోర్టు గది వెనుక దాన్ని నడిపించే ఒ ప్రపంచ ఉంటుంది. అక్కడే న్యాయమూర్తులు నివసిస్తా రు. శిక్షణ తీసుకుంటుంటారు. అలాంటి న్యాయాలయా నికి పునాదులు వేసే కార్యాచరణ ఎంతో శుభప్రదం. అదొక రాజ్యాంగ విధిగా భావిస్తున్నట్లు వివరించారు. ప్రతి రాష్ట్రంలో ఓ హైకోర్టు చట్టపరమైన అవసరమే కాకుండా గణతంత్ర రాజ్య నిబద్ధతగా భావించాల్సి ఉం టుంది. అలాంటి నిబద్ధతకు ఆధారమైన మౌలిక సదుపా యాలు ఉన్నంత వరకే అర్థం ఉంటుంది. కాకుంటే కేవలం కాగితాల్లోనే మిగిలిపోతుంది. అలా కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ సమాంతరంగా ఒక సంయుక్త బాధ్యతతో నడక సాగించడం వలన అదొక నిర్దిష్ట రూపాన్ని సంతరించుకోవడం కళ్లెదుట సాక్షాత్కరిస్తోందని జస్టిస్ సూర్యకాంత్ ఒక సమగ్ర న్యాయవ్యవస్థకు మౌలిక వనరుల రూపకల్పనకు నిర్దిష్ట ఆచరణ ఉందంటూ, ఇదే మాదిరి సంకల్పంతో ఇతర రాష్ట్రాల్లో కూడా కోర్టులకు మౌలిక సదుపాయాలు అవసరమని నమ్ముతున్నారు. ఒక పటిష్టమైన ఆలోచనకు సాదృశ్యమైన ఒక విశేషాన్ని ప్రధాన న్యాయమూర్తి సభముందుంచారు. సమగ్ర మూలాల్లేని ఏ వ్యవస్థకైనా కూకటివేళ్లే ముఖ్యమన్న పరమావధిని అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఒక భారీ వృక్షానికి కొమ్మలు, ఆకులు మాత్రమే కనిపిస్తాయి. కానీ ఉధృతంగా తుపాను వచ్చిన సందర్భంలో వేర్లు మాత్రమే ఆ చెట్టును పడిపోకుండా నిలబెడతాయన్నది గుర్తించాల్సి ఉంటుంది. ఇవన్నీ న్యాయవ్యవస్థ మౌలిక వనరులు,వసతులపై ప్రధాన న్యాయమూర్తి వివరించిన విషయాలే. ఎన్నో కోర్టుల్లో కేసుల చిట్టాలు దాచుకునేందుకు కనీసం పటిష్టమైన గదులు ఉండవు. ఎక్కడైనా కోర్టుస్టోర్ రూమ్‌లు గమనిస్తే ఫైళ్ల ర్యాక్‌లు సరిగ్గా ఉండవు. యాభై యేళ్ల నాటి భవనాలున్న చోటవర్షాలకు ఎన్నో రికార్డులు తడిసి పోయి ఉండటం చూస్తుంటాము. న్యాయమూర్తుల క్వా ర్టర్లు న్యాయాలయాల సముదాయంలో కాకుండా ఎక్కడో ఉంటే న్యాయమూర్తులు ఎక్కడో దూరంగా వసతి ఉన్న సందర్భాలలో ట్రాఫిక్ రద్దీలో ఇరుక్కుని కోర్టులకు ఆలస్యంగా హాజరైతే ఎంతో మంది కక్షిదారులు ఇక్కట్లకు గురౌతుంటారు. ఇలాంటి సమస్యలన్నీ న్యాయవ్యవస్థలో అనుభవైకవేద్యమే!



మీ ఆలోచనలు సదాచారమార్గం నుంచి మిమ్మల్ని దూరం చేసే సంకేతాలను ఇస్తున్నాయంటే దురదృష్టం మీకై కాచుకు కూర్చుంది అని భావించండి.

తిరుక్కురళ్



మీరు సాహసంతో పని చేపట్టలేకపోతే మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.

వినోబా భావే

# సీట్ల పెంపుతో సమస్యకు పరిష్కారం!

**కేంద్రంలో ఒక సమయంలో తెలుగుదేశంపార్టీ 36 స్థానాలతో లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించగలిగింది. అదేసమయంలో తమిళ నాడు,ఆంధ్రప్రాంతానికి చెందిన అధికారులు కూడా కేంద్రంలో ఎక్కువగా వుండేవారు. దాంతో కేంద్రంలో ఏపనైనా వేగంగా జరిగేది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 25 లోక్‌సభ స్థానాలకు, తెలంగాణ 17 లోక్‌సభ స్థానాలకు మరిమితం అయ్యాయి. దాంతో కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. ప్రజలందరికీ సర్వసత్తాక సార్వభౌమ అధికారం వున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు చెందిన సభ్యులు చేసిన నిర్ణయానిదే పైచేయి అవుతుంది. జనాభా ప్రాతిపదికన లేదా నిష్పత్తి ప్రకారం పునర్విభజన జరిగితే పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రధానంగా ఉత్తర ప్రదేశ్,బీహార్ సంఖ్యాబలంపెరుగుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్యా బలానిదే పైచేయి.**



అన్నవరపు బ్రహ్మయ్య

ఎట్టకేలకు నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) నిర్వహిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఇదే సమయంలో చట్టసభల స్థానాల సంఖ్యను జనాభాను బట్టి కాకుండా గంపగుత్తగా 50శాతం పెంచుతామని ప్రకటించడంవల్ల నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) సంబంధించిన సమస్యలు తొలగిపోతాయని భావిస్తున్నారు. గతంలో జరిగిన డీలిమిటేషన్‌లను గమనంలోకి తీసుకుంటే స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1951, 1961,1971లలో జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ నిర్వహించారు. ప్రస్తుతం లోక్‌సభలో వున్న 543 నియోజకవర్గాల సీట్ల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించారు. ఆనాటి దేశ జనాభా 54.8 కోట్లు మాత్రమే. నిజానికి 1981లో నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమం నిర్వహించాల్సి వుంది. అయితే ఆనాడు దేశ జనాభా విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ముందుగా దేశంలో నియంత్రణ కార్యక్రమాలు అమలు చేయాలన్న తలంపుతో డీలిమిటేషన్ కార్యక్రమాన్ని 2021 సంవత్సరంలో నిర్వహించే జనగణన తర్వాత చేయాలని ఆనాడు పార్లమెంటులో తీర్మానంచేశారు. డీలిమిటేషన్ ప్రక్రియను పార్లమెంటు చట్టం ద్వారా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి అధ్యక్షతన ఏర్పడే 'డీలిమిటేషన్ కమిషన్' నిర్వహిస్తుంది. సహజంగా జనాభా సంఖ్యనుబట్టి నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయిస్తారు.కాని ప్రస్తుతం పరిస్థితుల్లో జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలను నిర్ణయించే పక్షంలో కొన్ని రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం వుంది. 1971 జనాభా లెక్కల సేకరణ తర్వాత దేశ వ్యాప్తంగా విస్తృతంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేశారు. అయితే ఆయా రాష్ట్రాల సామాజిక పరిస్థితులను బట్టి కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా అమలయ్యాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చాలా మందకొడిగా అమలయ్యాయి. ఇదే సమయంలో కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు చాలా పగడ్బందిగా అమలయ్యాయి. దాంతో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు సరిగా అమలు కాని రాష్ట్రాలలో జనాభా ఎక్కువగా వుంటే, నియంత్రణ కార్యక్రమాలు సక్రమంగా అమలయిన రాష్ట్రాలలో జనాభా తగ్గిపోయింది. ఈ స్థితిలో జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగే పక్షంలో ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి కొన్ని రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాలు విపరీతంగా పెరిగే అవకాశం వుండగా, కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని సవ్యంగా అమలు చేసిన కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతాయి,అందు వల్ల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తోసహా పలువురు ముఖ్యమంత్రులు జనాభాప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజను వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరగనున్న జనాభా లెక్కల సేకరణ లెక్కల ప్రకారం కాకుండా 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా చేసుకొని ప్రస్తుతం వున్న లోక్‌సభ స్థానాలకు అదనంగా 50శాతం స్థానాలను పెంచే విధంగా ఏర్పాటు చేస్తున్నామని కేంద్రమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ నిర్ణయం వల్ల ఆయా ముఖ్యమంత్రులకు కూడా అభ్యంతరం వుండదని భావిస్తున్నారు.నిజానికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పెంచడం కూడా




ఆచరణ సాధ్యం కాదు. ముందుగా చెప్పుకొన్నట్టుగా1971వ సంవత్సరంలో దేశ జనాభా 54.8 కోట్లు, ఆనాటి జనాభా ప్రకారం 543 స్థానాలు వుంటే, నేటి జనాభా దాదాపు 150 కోట్లకు కనీసం 1500స్థానాలకు పెరగాల్సి వుంటుంది. ఈ స్థానాలకు తోడు మూడోవంతు అంటే 500 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలను కూడా కలపాల్సి వుంటుంది. ఇంతమంది సభ్యులకు పార్లమెంటు భవనంలో సీట్లు కేటాయించడం కూడా సాధ్యం కాదు. కొత్తగా నిర్మించిన పార్లమెంటు భవనంలో లోక్‌సభ, రాజ్యసభలో మొత్తం 1272 సీట్లు మాత్రమేవున్నాయి. అంతేకాకుండా భారతదేశ జనాభా భవిష్యత్తులో అంటే మరో మూడు దశాబ్దాలపాటు పెరుగుతూనే వుంటుంది. భారతదేశ జనాభా సగటున 15 శాతం వంతున రాబోయే మూడుదశాబ్దాలలో దాదాపు 165-170 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు (మూడు దశాబ్దాల తర్వాత జనాభా తగ్గడం ప్రారంభం అవుతుంది). ఈ స్థితిలో ప్రతి పది సంవత్సరాలకు లోక్‌సభ స్థానాలు పెంచడం అసాధ్యం. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలలోచట్టసభల సంఖ్య విషయంలో పరిమితి విధించారు.ఉదాహరణకి అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 1913వ సంవత్సరానికి ముందు ప్రతి పదేళ్లకు జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్(పార్లమెంటు)లో సీట్ల సంఖ్య పెంచినప్పటికీ 1913 నుండి ప్రతినిధులసభలో సీట్ల సంఖ్య 435కి పరిమితం చేశారు. అమెరికా జనాభా 1911లో 9.4కోట్లు వుండగా ప్రస్తుతం అంటే 2024నాటికి దాదాపు నాలుగు రెట్లు పెరిగి 34కోట్లకు చేరుకుంది. అయినా అమెరికా కాంగ్రెస్‌లో ప్రతినిధులసీట్లు 435గానే వుంది. అదే విధంగా భారతదేశంలో ఏదో ఒక దశలో చట్టసభల సభ్యుల సంఖ్య పెంపుదలను నిలుపుదల చేస్తే మంచిదనే భావన వ్యక్తం అవుతుంది. జనాభా ప్రాతిపదికన కాకుండా ఆయా చట్టసభల సంఖ్యను బట్టి గంపగుత్తగా 50 శాతం లోక్‌సభ స్థానాలను పెంచే పక్షంలో రాష్ట్రాల జనాభాతో నిమిత్తం లేకుండా అన్నిరాష్ట్రాల లోక్‌సభ స్థానాలు పెరుగుతాయి. ఉదాహరణకి 50 శాతం లోక్‌సభ స్థానాలు పెంచే పక్షంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో లోక్‌సభ సీట్ల సంఖ్య 80 నుంచి 120కి, బీహార్ రాష్ట్రంలో 40 నుంచి 60 సీట్లకు పెరుగుతాయి. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో వున్న 25 సీట్ల సంఖ్య 38 స్థానాలకు, తెలంగాణలో ప్రస్తుతం వున్న 17 స్థానాలు 23 లేదా 24కి, తమిళనాడులో 39 సీట్ల సంఖ్య 58లేదా 59 స్థానాలకి పెరుగుతాయి.వివిధ రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాల సంఖ్య కూడా 50 శాతం అదనంగా పెరుగుతాయి. ఉదాహరణకి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో వున్న 175 స్థానాల సంఖ్య 265 స్థానాలకు, తెలంగాణలో ప్రస్తుతం వున్న 119 స్థానాల సంఖ్య 179 లేదా 180స్థానాలకు పెరుగుతాయి. ఇదే తరహాలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరుగుతుంది. ఇదిలావుండగా 106 రాజ్యాంగ సవరణ ప్రకారం రానున్న లోక్‌సభ ఎన్నికల నుంచి 33శాతం స్థానాలను మహిళలకు కేటాయించాల్సి వుంటుంది. అందువల్ల గంపగుత్తగా అదనంగా పెరగనున్న స్థానాలు 33శాతం మహిళా సభ్యులకుసరిపోతాయి. అందువల్ల ఇప్పటికే రాజకీయాలలో కీలకంగా వున్న పురుష అభ్యర్థులకు వచ్చిన ధోకా ఏమివుండదని చెప్పవచ్చు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరగక ముందు దక్షిణాది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌కు అత్యధికంగా 42 స్థానాలు వుండగా తమిళనాడుకు 39, కర్ణాటకకు 28,కేరళకు 20స్థానాలు వుండేవి. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా వున్నసమయంలో కేంద్రంలో కీలకంగా వుండేది. ఉదాహరణకి కేంద్రంలో ఒక సమయంలో తెలుగుదేశంపార్టీ 36 స్థానాలతో లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా వ్యవహరించగలిగింది. అదేసమయంలో తమిళనాడు,ఆంధ్రప్రాంతానికి చెందిన అధికారులు కూడా కేంద్రంలో ఎక్కువగా వుండేవారు. దాంతో కేంద్రంలో ఏపనైనా వేగంగా జరిగేది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 25 లోక్‌సభ స్థానాలకు, తెలంగాణ 17 లోక్‌సభ స్థానాలకు మరిమితం అయ్యాయి. దాంతో కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. ప్రజలందరికీ సర్వసత్తాక సార్వభౌమ అధికారం వున్నప్పటికీ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు చెందిన సభ్యులు చేసిన నిర్ణయానిదే పైచేయి అవుతుంది. జనాభా ప్రాతిపదికన లేదా నిష్పత్తి ప్రకారం పునర్విభజన జరిగితే పార్లమెంటులో ఉత్తరాది రాష్ట్రాల ప్రధానంగా ఉత్తర ప్రదేశ్,బీహార్ సంఖ్యాబలంపెరుగుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్యా బలానిదే పైచేయి.చట్టసభలలో మెజారిటీ సభ్యుల నిర్ణయాలను మైనారిటీ సభ్యులు భరించాల్సిందే. ●

# 'యుద్ధమంటల'తో ప్రకృతికి పెనుముప్పు

పసుపులేటి. వెంకటేశ్వరరావు

ప్రకృతి వైపరీత్యాలు, పెను ఉప్పెనలు, అకాల వర్షాలు ఇవన్నీ ఒకెత్తయితే, మానవ నిర్మిత 'యుద్ధమంటలు' నేడు భూగోళాన్ని మరో వినాశనం వైపు నెడుతున్నాయి. అభివృద్ధి ముసుగులో సాగుతున్న అంతులేని ఆయుధ పోరాటం కేవలం దేశాల సరిహద్దులనే కాదు,గాలిని,నీటిని, నింగిని కూడా విషతుల్యం చేస్తోంది. యుద్ధం అనేది కేవలం రక్తపాతం మాత్రమే కాదు, అది పర్యావరణంపై జరుగుతున్న ఒక అఘాయిత్యం. కార్బన్ ఉద్గారాలను పెంచుతున్న నాలుగో అతిపెద్ద కారకంగా నేడు 'యుద్ధం' నిలవడమే దీనికి నిదర్శనం. గత దశాబ్దకాలంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి ప్రవర్తనలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పెరుగుతున్న ఎండలు కేవలం వాతావరణ మార్పులే కాదు, మన విధ్వంసక చర్యల ప్రతిధ్వనులు. ఆధునిక యుద్ధాలలో వాడుతున్న క్షిపణులు, బాంబుల నుంచి వెలువడే అపారమైన ఉష్ణశక్తి నేరుగా వాతావరణంలో కలిసిపోతోంది. గత 175 ఏళ్ల చరిత్రలో 2024 ఫిబ్రవరి అత్యంత ఉష్ణోగ్రతలున్న నెలగా నమోదవ్వడం మనల్ని హెచ్చరిస్తోంది. ఇది కేవలం ప్రకృతి చక్రం కాదు, మానవ నిర్మిత గన్‌పౌడర్ పొగ ఫలితం. టీఎన్‌టీ, ఆర్‌డీఎక్స్ వంటి పేలుడు పదార్థాల్లో ఉండే సీసం, యురేనియం వంటి భార లోహాలు నేలని, నీటిని రాబోయేతరాల వరకు పనికిరాకుండా చేస్తున్నాయి. ఒకవైపు గ్రీన్ ఎనర్జీ గురించి మాట్లాడుతూనే, మరోవైపు టన్నుల కొద్దీ మందుగుండును పేల్చడం మానవాళి ద్వంద్వ నీతికి నిదర్శనం. యుద్ధం ఎప్పుడూ రెండు దేశాలమధ్యే ముగిసిపోదు.రష్యా ఉక్రెయిన్, ఇజ్రాయెల్ గాజా,ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య చెలరేగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్త ఇంధన, చమురు సంక్షోభాలకు దారితీస్తున్నాయి. యుద్ధ ట్యాంకులు, యుద్ధ విమానాలు వెదజల్లే కార్బన్ ఉద్గారాలు ఏదేశపు లెక్కల్లోనూ ఉండవు. ఈ విష రసాయనాలు పర్యావరణ వ్యవస్థలను గందరగోళానికి గురిచేస్తున్నాయి.భూమిపై తమ ఉనికిని తామే నాశనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న ఏకైక జీవి మానవుడే. అంతులేని సంపద పోగుచేయాలనే అంధమైన తపన, ప్రతిదాన్నీ నియంత్రించాలనే అహంకారం భూమి ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి. పరస్పర శత్రుత్వాలు పెరిగి యుద్ధాలు సంభవిస్తున్నప్పుడు, ప్రకృతి తన శాంతియుత స్వభావాన్ని కోల్పోయివిలయతాండవం చేస్తుంది.పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం సముద్రాలపై స్పష్టంగా కనిపిస్తోంది. సముద్రాలు వేడెక్కడం వల్ల వాతావరణంలో తేమ అసాధారణంగా పెరుగుతోంది. ఈ అదనపుతేమ భవిష్యత్తులో క్లౌడ్ బరస్ట్ రూపంలోనో లేదా అకాల తుపానుల రూపంలోనో విరుచుకుపడటం ఖాయం. ఒకసారి సముద్రాల సమతుల్యత దెబ్బతింటే, అది మానవాళి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తుంది. అడవులు తగలబడిపోతున్నాయి, జలవనరులు కలుషితమవుతున్నాయి. యుద్ధ విమానాల నుంచి వెలువడే పొగ పొరలు సూర్యరశ్మిని బంధించి 'గ్రీన్ హౌస్' ప్రభావాన్ని మరింత తీవ్రంచేస్తున్నాయి.శాంతిస్థాపన పేరుతో జరుగుతున్న ఈ మారణహోమం,పరోక్షంగా పర్యావరణ నాశనానికి దారితీస్తోంది. యుద్ధాలవల్ల కలిగే పర్యావరణ నష్టాన్ని పూడ్చడం అసాధ్యం. ఒక్క క్షిపణి దాడి వల్ల విడుదలయ్యే కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి లక్షలాది చెట్లను నాటాల్సి ఉంటుంది. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాల్సిన ఈ కీలక తరుణంలో, ఆయుధాలతో ఒకరినొకరు నాశనం చేసుకోవడం అత్యంత విషాదకరం. ●

# ప్రజావాక్కు



### అంటరాని కులం

ప్రస్తుత సమాజంలో మీరు తక్కువ కులం అంటరాని వాళ్ళు అని, మేము ఎక్కువం కులం అని అంటున్నారు కదా. తక్కువ కులం వాళ్ళని తక్కువ పని చేయమనొచ్చు. నీ పని పూర్తి అవ్వడానికి కులంతో సంబంధం లేదు కానినువ్వు చూపించే మర్యాద విధానానికి మాత్రం కులం అడ్డొచ్చిందా సోదరా! ముందు నువ్వు మారాలి. నీ చుట్టుఉన్న సమాజాన్ని మార్చాలి.సమాజంపట్ల, చదువు పట్ల అవగాహన కలిగిన మనమే ఇలా ఉంటే ఎలా? ముందుగా మనం మారాలి.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతోమంది ఎదురు చూస్తున్నారు. ఏటా లక్షల మంది దేశవ్యాప్తంగాఇంజినీర్లు పుట్టుకు వస్తున్నారు. వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ఈమధ్య తమసీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు.తక్కువ జీతంలో కొత్త వారిని తీసుకుంటున్నారు.దాదాపు మధ్యవయసునకు చేరిన వీరికి మరల ఉద్యోగాలు దొరకడం బహు దుర్లభం.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### పొగాకుపై నిషేధం విధించాలి

పొగాకు వినియోగం కేవలం వ్యక్తిగత అలవాటు కాదు, అది కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తూ దేశఆర్థిక వ్యవస్థను, ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న తీవ్ర సామాజిక సంక్షోభం. కేన్సర్, గుండె, శ్వాసకోశ వ్యాధులకు ప్రధాన కారణమైన పొగాకువల్ల ప్రతిఏటా లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పొగాకు పరిశ్రమ ద్వారా వచ్చే ప్రభుత్వ ఆదాయం కంటే, దానివల్ల కలిగే అనారోగ్యానికి చేసే వైద్య వ్యయం, మానవ వనరుల నష్టం చాలా రెట్లు అధికం. ముఖ్యంగా ఆకర్షణీయమైన ప్రకటనల ద్వారా యువతను ఈ వ్యసనానికి బానిసలుగా మార్చడం భవిష్యత్తుతరాల మనుగడకే ముప్పుగా మారింది.ఈ నేపథ్యంలో, పొగాకు ఉత్పత్తులపై కేవలం హెచ్చరికలు సరిపోవని, సంపూర్ణ నిషేధం దిశగా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టమవుతోంది.

- కె.రామారావు, నల్గొండ

### నిధుల కొరత

నేటి ఆధునిక కాలంలో ఒక దేశాభివృద్ధి ఆ దేశ విశ్వవిద్యాలయాలుచేపట్టే పరిశోధనలపైనే ఆధారపడి ఉంటుంది. విజ్ఞాన ఆధారిత సమాజంలో ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధికి చోదకశక్తులు. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో విశ్వవిద్యాలయాలు కేవలం బోధనా కేంద్రాలుగా మాత్రమే కాకుండా, అత్యాధునిక పరిశోధనా వేదికలుగా వర్ధిల్లుతున్నాయి.అమెరికా తన మొత్తం దేశీయ ఉత్పత్తిలో 3 శాతం కంటే ఎక్కువ నిధులను పరిశోధనల కోసం వెచ్చిస్తూ, పరిశ్రమలతో బలమైన అనుసంధానాన్ని కలిగి ఉంది. భారతదేశ పరిస్థితిని గమనిస్తే, మన దేశం పరిశోధనల కోసం తన దేశీయ ఉత్పత్తిలో కేవలం 0.7 శాతం వరకు మాత్రమే ఖర్చు చేస్తోంది. ఐఐటీలు వంటి కొన్నిసంస్థలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నప్పటికీ, మెజారిటీ రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో నిధుల కొరత, పాతబడిన ప్రయోగశాలలు పరిశోధకులను నిరుత్సాహపరుస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆయుర్వేద వైద్యంపై దృష్టి

మనదేశంలో 95శాతం వ్యక్తులు అల్లోపతి వైద్యంపైనే ఆధారపడ్డారు. ఈ వైద్య విస్తృత పరిశోధన పరిస్థితులకు కారణంగా మారింది. ఇటీవల జాతీయ స్థాయిలో సంప్రదాయ వైద్యం కూడా అందుబాటులోకి వచ్చి ప్రత్యామ్నాయ ఎంపికకు వైద్యశాలలు, మందులు వగైరా ఏర్పాటు నిమిత్తం దృష్టి సారించారు. ఎటువంటి ఇతర అదనపు ఇబ్బందులు లేని మన ప్రాచీన ఆయుర్వేద వైద్యం తక్కువ ఖర్చుతో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. కనుక ఎక్కువ మంది ప్రజలు ఈ ఆయుర్వేద వైద్యంపైదృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.

- బి. రమేష్‌బాబు, నల్గొండ

### కారుణ్య నియామక ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగులు చనిపోతే అట్టి ఉద్యోగం వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం క్రింద వారి కుమారుడు, కుమారై, భార్యకు ఇవ్వడం జరుగుతుంది. అట్టి ఉద్యోగి తల్లి తండ్రిని పోషించే బాధ్యత కూడా కారుణ్య నియామకం క్రింద వారి బాధ్యతగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. వృద్ధులైన తల్లిదండ్రులను కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందుతున్న కుటుంబ సభ్యులు వృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు.కారుణ్య నియామకాలు చేస్తున్న ఉద్యోగులకుకూడా తల్లిదండ్రులను పోషించేబాధ్యత అప్పగించాలి.

-రాపాక రవీందర్, జనగాం

# సమష్టి కృషితోనే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యం!

డాక్టర్ టి.సేవకుమార్

ఆరోగ్యవంతమైన ప్రజలే ఏ దేశానికైనా వెన్నెముక .నేడు ఆ వెన్నుముక మనదేశంలో వయస్సుతో నిమిత్తం లేకుండా అనేక రకాల వ్యాధులతో అష్ట వంకర్లు తిరిగిపోతోంది. అరిగి అనారోగ్యం పాలవుతోంది. వైద్యం, శస్త్ర చికిత్సల, ఆర్థికభారం తప్పడంలేదు. ఈ భారాలు ధనిక, పేద బేధం లేకుండా జీవన ప్రమాణాలను కృంగతీస్తున్నాయి. నేటి మనిషి ఆయుషు అయితే పెరిగింది గాని, ఆరోగ్యకర జీవనం అయితే ఉండడం లేదు. సంపాదనలో ఆహారం కోసం ఎంత ఖర్చు చేస్తున్నామో, ఆరోగ్యం కోసం కూడా అంత ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సంవత్సరం'శాస్త్ర ,సాంకేతికతల ఆధారంగా ప్రపంచవ్యాప్త సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం సంఘటితమవుదాం!'అనే నినాదాన్ని ఇచ్చింది. కేవలం మనుషుల పైనే దృష్టి పెడితే ఆరోగ్య పరిరక్షణ సాధ్యం కాదని, అడవులు, చెట్లు, జంతు జాలాల పరిరక్షణతో పర్యావరణ పరిరక్షణ ద్వారానే మనిషి ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఈ నినాదం లక్ష్యాలలో ప్రపంచఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది. ఏ దేశ ప్రజల ఆరోగ్యానికయినా స్థూలంగా నాలుగు రకాల ముప్పులు పొంచి ఉన్నాయి. నేడు వయసుతో సంబంధం లేకుండా వస్తోన్న అంటు వ్యాధులు (కమ్యూనికబుల్ డిసీజెస్ ),అంటువ్యాధులు కాని వ్యాధులు (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్), పుట్టుకతో జన్యువుల ద్వారా,అవయవ నిర్మాణ లోపాల కారణంగా వస్తున్న వ్యాధులు, వయస్సు పెరుగుదలతో వచ్చే వృద్ధాప్య వ్యాధులు. వీటినే డీ జనరేటివ్ డిసీజెస్ అని కూడా అనవచ్చు. నేడు వృద్ధాప్య వ్యాధుల్లో కూడా కొన్ని నియంత్రించవచ్చు. కొన్నింటికి తగిన చికిత్స, జాగ్రత్తలతో అధిగమించి ఆరోగ్యకర జీవితం పొందవచ్చు. మన దేశ ప్రజారోగ్యపరిస్థితుల విషయానికొస్తే పరాన్నజీవ (పారాసైటిక్), బ్యాక్టీరియల్, ఫంగల్,వైరల్ అంటువ్యాధులు తగ్గినట్లు కనిపిస్తున్న వ్యాప్తి మాత్రం జరుగుతూనే ఉంది. కొన్ని రాష్ట్రాలలో కొన్ని సీజన్లలో ఆయా వ్యాధులు విజృంభిస్తూనే ఉన్నాయి. కరోనాలా అవి విరుచుకుపడనందున మనం వాటిపై దృష్టి సారించడం లేదు. పరాన్న జీవవ్యాధుల్లో ఇంకా మలేరియా మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. బ్యాక్టీరియల్ వ్యాధుల్లో టైఫాయిడ్, నిమోనియా, ఆంత్రాక్స్, మెలిడీయోసిస్, స్క్రబ్ టైపస్ వంటి వ్యాధుల్ని చూస్తూనే ఉన్నాం. క్షయ వ్యాధి వ్యాప్తి వేగం పెరుగుతుందని ప్రభుత్వ గణాంక వివరాలే తెలుపుతున్నాయి. ఫంగల్ వ్యాధుల వల్ల కూడా మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. కరోన, డెంగు, చికెన్‌ఫాక్స్, చికెన్ గునియా, ఎన్ సెఫిలైటిస్, నిఫా, బర్డ్‌ఫ్లూ, మీజిల్స్ వంటి వ్యాధులతోపాటు ప్రమాదకర హెచ్ఐవి, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి వంటి వైరల్ వ్యాధులు ఆరోగ్య సమస్యల్ని సృష్టిస్తూనే ఉన్నాయి. ఇటీవల ప్రమాదకర హెచ్ఐవి, హెపా



టైటిస్ బి,సి వైరస్‌ల వ్యాప్తి వేగంగా పెరుగుతుందని చెప్పక తప్పదు. అంటు వ్యాధులలో వైరల్ వ్యాధులకు తప్ప మిగతా అన్నిరకాల వ్యాధులకు పూర్తిచికిత్స ఉన్నా, మరణాలు సంభవించడం మన ఆరోగ్య వ్యవస్థ విఫలత్వానికి నిదర్శనం. అంటు వ్యాధులు కాని వ్యాధుల విషయానికొస్తే దేశవ్యాప్తంగా మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్ బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఇవి జీవిత కాలం క్రమం తప్పకుండా మందులు వాడాల్సిన దీర్ఘకాల వ్యాధులు కావడంతో ప్రజలపై ఎంతో ఆర్థిక భారం పడుతుంది. ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, అగ్ని,రోడ్డు ప్రమాదాల వల్ల కూడా ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగిస్తున్నాయి. ఫలితంగా జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. పుట్టుకతో జన్యుపరంగా వచ్చే వ్యాధులు , అవయవనిర్మాణ లోపాలతో పుట్టే శిశువుల సంఖ్య నేడు పెరిగిపోతుంది. పుట్టినప్పటినుండే వారిని సాకటం తల్లిదండ్రులకు ఎంతో భారంగా మారుతుంది. అందుకు ఇటీవల ఆర్థిక సహాయం కోరుతున్న స్పైనల్ మస్కులర్ అట్రోఫీ కేసులే నిదర్శనం. 16 కోట్లు విలువ చేసే ఒక ఇంజక్షన్ కోసం తల్లిదండ్రుల పాట్లు వర్ణనాతీతం ప్రజారోగ్య చైతన్యం,పరిసరాల పరిశుభ్రత, వైద్యసదుపాయాల కొరత వంటి ప్రధాన అంశాలలో ప్రజలు,ప్రభుత్వం సంయుక్తంగాకృషి చేస్తేనే మంచిఫలితాలు సాధించగలం. నేడు ప్రజలందరికీ పౌష్టికఆహారం, వ్యాధుల వ్యాప్తికిగల కారణాలు,నియంత్రణ,నిరోధక చర్యలు,ముందు జాగ్రత్తలు తదితర విషయాల్లో శాస్త్రీయ అవగాహన తప్పనిసరి. పాఠశాలస్థాయి నుండే ఆరోగ్య పరిరక్షణ చర్యలను పాఠ్యాంశాలుగా పెట్టి అధ్యయం చేయించడం ద్వారా శాస్త్రీయ అవగాహన చిన్న వయస్సునుండే తీసుకురావాలి. వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండేలా వారిలో చైతన్యం రావాలి. నేటిసమాజంలో ఎవరికి వారు తమదాకా వచ్చేదాకా పట్టించుకోని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. వ్యాధుల నిరోధం ఒకసామాజిక బాధ్యతగా ప్రతి ఒక్క పౌరుడు స్వీకరించాలి. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వబాధ్యత ఎంతోఉంది. ప్రజారోగ్యం కోసం చేపట్టే పథకాలు,కార్యక్రమాలన్నీ కాగితాలలో చూపినట్టుగా వాస్తవంలో ఉండడం లేదు. ప్రస్తుతం అలా ఉండే పరిస్థితులు కూడా సమాజంలో లేవు.ఆరోగ్యం రాష్ట్ర జాబితాలోదే అయినా, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలు ప్రత్యక్షంగా ప్రవేశించి సమాజంలో కొంత గందరగోళ పరిస్థితులకు దారితీస్తున్నాయి. వైద్య, ఆరోగ్య,విద్యలో ప్రజారోగ్యంపై ఎంతో ప్రాధాన్యత గల సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఎస్.పి.ఎం) ప్రజారోగ్య వైద్య విభాగం ప్రభుత్వ స్థాయిలో,వైద్య కళాశాలల స్థాయిలో,విభాగ స్థాయిలో తీవ్ర నిర్లక్ష్యానికి గుర వుతోంది.వైద్య విద్యార్థులు ఆ విభాగానికి అంత ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఉత్తీర్ణత అయితే చాలు అనుకుంటున్నారు. చాలా వైద్యకళాశాలలోని ఈవైద్య విభాగంలో వైద్య విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా, ప్రాధాన్యతను గుర్తించి చెప్పే అధ్యాపకులు కరువవుతున్నారు. దేశంలో పెరిగిపోతున్న అంటు వ్యాధులకు మూలకారణం పరిసరాల పరిశుభ్రత. ఇందుకు ప్రజలు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఎక్కడబడితే అక్కడ చెత్త చెదారం వేసి మనపరిసరాలను మనమే అపరి శుభ్రం చేసుకుంటున్నాం. సురక్షిత మంచి నీరు, పరిసరాల పరిశుభ్రత ద్వారా ఎన్నో అంటువ్యాధుల్ని పూర్తిగా నిరోధించవచ్చు. ఆహారంలోని కల్తీలు ప్రజారోగ్యాన్ని తీవ్రంగా బల హీనపరుస్తున్నాయి. అప్పుడప్పుడు మరణాలు కూడా సంభవి స్తున్నాయంటే కల్తీలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవచ్చు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రభుత్వ కాంట్రాక్టులు కుటుంబ సభ్యులకా?

## సిబిఐ విచారణకు సుప్రీం ఆదేశం

### అరుణాచల్ సిఎం పెమా ఖండూకు షాక్

### రెండు వారాల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

### 16 వారాల్లోగా నివేదిక సమర్పించాలి: సుప్రీం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పేమా ఖండూ కుటుంబ సభ్యులతో సంబంధం ఉన్న ప్రభుత్వ కాంట్రాక్టులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సిబిఐ విచారణకు ఆదేశించింది. సిఎం పేమా ఖండూ కుటుంబ సభ్యులతో సంబంధం ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలకు ప్రభుత్వ పనుల కాంట్రాక్టుల కేటాయింపుపై రెండు వారాల్లోగా ప్రాథమిక విచారణ నమోదు చేయాలని భారత సుప్రీంకోర్టు సోమవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)ని ఆదేశించింది. జనవరి 1, 2015 నుండి డిసెంబర్ 31, 2025 మధ్య కాంట్రాక్టులు, వర్క్ ఆర్డర్ల కేటాయింపు, అమలు రెండింటినీ ఈ విచారణ పరిశీలిస్తుందని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. "తీర్పు వెలువడిన తేదీ నుండి రెండు వారాల్లోగా సిబిఐ ప్రాథమిక విచారణ (ఎఫ్ఐఆర్) నమోదు చేసి, చట్ట ప్రకారం ముందుకు సాగాలి," అని జస్టిస్ నాథ్ ఉత్తర్వులు జారీ చేస్తూ అన్నారు. 16వారాల్లోగా స్టేటస్ రిపోర్టు సమర్పించాలని కూడా కోర్టు ఏజెన్సీని ఆదేశించింది. విచారణ సందర్భంగా, ఖండూ కుటుంబ సభ్యులతో సంబంధం ఉన్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న నాలుగు సంస్థలకు గత దశాబ్ద కాలంలో సుమారు రూ. 1,270 కోట్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులు, వర్క్ ఆర్డర్లు కేటాయించారని సుప్రీంకోర్టుకు తెలియజేశారు. పిటిషనర్లు అయిన సేవ్ మోన్ రీజియన్ ఫెడరేషన్, వాలంటరీ అరుణాచల్ సేన తరఫున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను ఉటంకిస్తూ, ముఖ్యమంత్రి బంధువుల యాజమాన్యంలోని కంపెనీలకు అనేక కాంట్రాక్టులు కేటాయించారని వాదించారు. పిటిషన్‌ను ప్రాయోజిత వ్యాజ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అభివర్ణించింది. అరుణాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న న్యాయవాది ఈ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ, ఇది ఒక 'ప్రాయోజిత వ్యాజ్యం' అని గతంలోనే అభివర్ణించారు. గత ఏడాది డిసెంబర్ 2న, ముఖ్యమంత్రి కుటుంబ యాజమాన్యంలోని సంస్థలతో ముడిపడి ఉన్న కాంట్రాక్టులతోసహా, 2015 నుండి 2025 మధ్య కేటాయించినకాంట్రాక్టులపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఖండూ, కుటుంబ సభ్యులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో (పిఐఎల్) ముఖ్యమంత్రి పెమా ఖండూను ప్రతివాదిగా చేర్చారు. ఆయన తండ్రి దోర్జీ ఖండూ రెండవభార్య రించిన్ డ్రెమా, మేనల్లుడు త్సెరింగ్ తాషీతో సహా ఆయన కుటుంబ సభ్యులనుకూడా ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చారు. స్పష్టమైన ప్రయోజన వైరుధ్యం ఉన్నప్పటికీ, డ్రెమాసంస్థ 'బ్రాండ్ ఈగల్స్' గణనీయమైన సంఖ్యలో ప్రభుత్వ కాంట్రాక్టులను దక్కించుకుందని పిటిషన్‌లో ఆరోపించారు. దోర్జీ ఖండు, 2007నుండి ఏప్రిల్ 2011లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించే వరకు అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించారు. ఈ విషయమై సుప్రీం కోర్టు ఫిబ్రవరి 17న తన తీర్పును రిజర్వులో ఉంచి, సోమవారం తన ఆదేశాలను వెలువరించింది.




# రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించండి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

### 4 వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** దేశవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారుల నుండి వీధి పశువులను దూరంగా ఉంచేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం, ఈ పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, భారత పశు సంక్షేమ బోర్డుతో సహా ఇతరులకు నోటీసులు జారీ చేసింది. అనేక రాష్ట్రాలు 10శాతం గోవుల సెస్ వసూలు చేస్తున్నప్పటికీ ఏమీ చేయడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ) తరఫున హాజరైన న్యాయవాది, వీధి కుక్కల కేసులో సుప్రీంకోర్టు ఇప్పటికే తన తీర్పును రిజర్వ్ చేసిందని, ఆ కేసులో రహదారుల్లోకి వీధి జంతువులు ప్రవేశించే సమస్య కూడా ఉందని ధర్మాసనానికి తెలిపారు. 'లాయర్స్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్' అనే పిటిషనర్ తరఫున హాజరైన న్యాయవాది, ఈ అంశం చాలా వరకు వీధి కుక్కల కేసు తీర్పు పరిధిలోకి వస్తుందని, అయితే ఈ పిటిషన్‌లో మరికొన్ని ఇతర అం శాలను కూడా లేవనెత్తినట్లు తెలిపారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం నోటీసు జారీ చేసి, నాలుగు వారాల తర్వాత విచారణకు వాయిదా వేసింది. జాతీయ రహదారులపైకి పశువులు రాకుండా నిరోధించడానికి, ఏకరీతి జాతీయ మార్గదర్శకాలను రూపొందించి, అమలు చేయాలని అధికారులను ఆదేశించాలని ఈ పిటిషన్‌లో కోరారు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలకు, ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో తప్పనిసరిగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించాలని కూడా కోరారు. ప్రత్యేక నిధులతో శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించబడే పశువుల ఆశ్రయాలు/గోశాలలు ఏర్పాటు చేయాలని, పశువులను అక్రమంగా వదిలివేసిన వారిపై కఠినమైన శిక్షాస్మృతిని విధించాలని కూడా కోరారు. ఇతర ఆదేశాలతో పాటు, వీధి పశువుల వల్ల జరిగే ప్రమాదాల బాధితుల కోసం 'నోఫాల్ట్' పరిహార విధానాన్ని రూపొందించాలని కూడా ఈ పిటి షన్‌లో కోరారు. జనవరి 29న, రహదారుల్లోకి ప్రవేశించే వీధి జంతువుల సంరక్షణ కోసం, రోడ్ల నిర్మాణంలో పాలుపంచుకుంటున్న కాంట్రాక్టు దారులను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద ఒక గోశాలను ఏర్పాటు చేయమని కోరే విషయాన్ని పరిశీలించమని సుప్రీంకోర్టు ఎన్‌హెచ్ఎఐకి సూచించింది.



# బుల్లితెర నటి సుభాషిణి ఆత్మహత్య

**చెన్నై, ఏప్రిల్ 6:** బుల్లితెర నటి సుభాషిణి (36) ఆత్మహత్య ఘటన చెన్నైలో కలకలం సృష్టించింది. భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న సమయంలో జరిగిన వాగ్వాదం ఈ దారుణానికి దారితీసినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. చెన్నై పోరూరులోని ఒక ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సుభాషిణి, ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. శ్రీలంకకు చెందిన సుభాషిణి, తన భర్త పిప్పిన్‌తో కలిసి బెంగళూరులో ఉండేది. అయితే వృత్తిరీత్యా షూటింగ్‌లకోసం చెన్నైలోని పోరూరులో ఒంటరిగా ఉంటోంది. టీవీ సీరియల్ కయల్ ద్వారా ఆమె మంచి గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉంది. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, నిన్న రాత్రి భర్తతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్నప్పుడు ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత మనస్థాపానికి గురైన ఆమె ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కుటుంబ సమస్యల కారణంగానే ఆమె గత కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నారని, అదే ఆత్మహత్యకు ప్రేరేపించి ఉండవచ్చని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

# పరువు హత్యలకు అడ్డుకట్ట!

## ప్రేమజంటలకు రక్షణ: 'ఇవ నమ్మవ ఇవ నమ్మవ' బిల్లు

### కర్ణాటక అసెంబ్లీలో ఆమోదం.. గవర్నర్ చెంతకు దస్త్రం



**బెంగళూరు, ఏప్రిల్ 6:** పరువు హత్యలకు అడ్డుకట్ట వేస్తూ, ప్రేమ జంటలకు రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించే దిశగా కర్ణాటక ప్రభుత్వం ఒక విప్లవాత్మక అడుగు వేసింది. ప్రేమికులను కాపాడేందుకు ఉద్దేశించిన కర్ణాటక వివాహ ఎంపిక స్వేచ్ఛ, గౌరవం పేరిట జరిగే నేరాల నిరోధక బిల్లు 2026కు అసెంబ్లీ ఆమోదించింది. 2025 డిసెంబర్ 21న, కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లాలో, ఏడు నెలల గర్భవతి అయిన 19 ఏళ్ల మాన్యా పాటిల్, వారి ఇష్టానికి వ్యతిరేకంగా ఒక దళిత యువకుడిని వివాహం చేసుకుందనే కారణంతో, ఆమె తండ్రి, ఇతర బంధువుల చేతిలో దారుణంగా హత్యకు గురైంది. ఈ ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. దీంతో పరువు హత్యలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక చట్టాన్ని తీసుకువచ్చింది. అదే 'వివాహంలో ఎంపిక స్వేచ్ఛ, పరువు, సంప్రదాయాల పేరిట జరిగే నేరాల నివారణ, నిషేధ బిల్లు, 2026' (ఇవ నమ్మవ ఇవ నమ్మవ బిల్లు). రాష్ట్ర శాసనసభ ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందిన ఈ బిల్లు, ఇప్పుడు గవర్నర్ ఆమోదం కోసం ఎదురు చూస్తోంది. ఈ బిల్లు ప్రకారం.. తమకు ప్రాణహాని ఉందని భావించే ప్రేమ జంటలు పోలీసులను ఆశ్రయిస్తే, ఫిర్యాదు అందిన 6 గంటల్లోనే వారికి రక్షణ కల్పించాలి. వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 'సేఫ్ హౌస్'లను ఏర్పాటు చేయనుంది. బాధితులకు సహాయం అందించేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక సెల్‌తో పాటు, 24 గంటలు పనిచేసే హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులోకి తేనుంది. పరువు పేరుతో దాడులకు పాల్పడటం, సామాజిక బహిష్కరణ విధించడం వంటి చర్యలను ప్రభుత్వం ఈ బిల్లులో తీవ్రమైన నేరంగా పేర్కొంది. నేరం రుజువైతే, నిందితులకు కనిష్టంగా ఐదేళ్ల జైలు శిక్ష నుంచి గరిష్టంగా మరణశిక్ష వరకు విధించేలా కఠిన నిబంధనలు చేర్చింది. 18 ఏళ్లు నిండిన యువతి, 21 ఏళ్లు నిండిన యువకుడు పరస్పర అంగీకారంతో వివాహం చేసుకుంటే, తల్లిదండ్రులు లేదాకుల పెద్దల అనుమతి అవసరం లేదని ఈ బిల్లు స్పష్టం చేస్తోంది. 12వ శతాబ్దపు సంఘ సంస్కర్త బసవన్న చెప్పిన 'ఇవా నమ్మవ' (అతడు మనవాడే) అనే వచనం స్ఫూర్తితో ఈ బిల్లుకు పేరు పెట్టడం విశేషం.

# కొత్తగా ఎన్నికైన 19 మంది సభ్యులు ప్రమాణస్వీకారం

## ప్రమాణం చేయించిన ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులచేత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ తన ఛాంబర్‌లోప్రమాణ స్వీకారంచేయించారు. మొత్తం 19 మంది కొత్తగా ఎన్నికైనవారు, తిరిగి మరోసారి ఎన్నికైన సభ్యులచేత రాధాకృష్ణన్ ప్రమాణం చేయించారు. వీరిలో రామ్‌దాస్ బందు అథవాలే, మాయా చింతమాన్ ఇవనాతే, శరద్‌చంద్ర పవార్; రామ్‌రావు శాఖారమ్ వద్కుటే డా.జ్యోతి నాగ్‌నాథ్‌వాఘ్‌మేరే, క్రిస్టపర్ మాణిక్కమ్, డా.అన్బుమణి రామ్‌దాస్, కాన్‌స్టడైన్ రవిచంద్రన్; ఎల్‌కె సుధీష్, డా.ఎం తంబిదురై, తిరుచ్చిశివ, బాబుల్ సుప్రియా బారల్, డా.మనేకా గురుస్వామి,రాజీవ్ కుమార్; రుక్మిణి మాల్లిక్, బిశ్వజిత్ సిన్హా, సంతృప్త మిశ్రా, దిలీప్‌కుమార్‌రే, మన్మోహన్ సమాల్‌లతో రాధా కృష్ణన్ ప్రమాణం చేయించారు. వీరిలో ముగ్గురు సభ్యులు మరాఠీలోను, ఇద్దరు హిందీలోను, ఆరుగురు తమిళంలోను, ఒకరు ఆంగ్లంలోను, నలుగురు బెంగాలి లో ప్రమాణం చేయగా, ముగ్గురు ఒడియా భాషలో ప్రమాణంచేసారు. ఎన్నికైన సభ్యుల్లో ఐదుగురు మహారాష్ట్రనుంచి, ఆరుగురు తమిళ నాడు, ఐదుగురు పశ్చిమబెంగాల్, ముగ్గురు ఒడిశానుంచి ఎన్నికయ్యారు.

# పనిమనిషికి కూడా రూ.కోటి విలువైన ఫ్లాట్

## బీహార్ డిఎస్‌పి అక్రమాస్తుల చిట్టాచూసి విస్తుపోయిన తనిఖీ అధికారులు



**పాట్నా, ఏప్రిల్ 6:** అక్రమాస్తుల కేసులో సస్పెండైన బీహార్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) గౌతమ్ కుమార్ ఉదంతంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. సుమారు రూ.80కోట్ల విలువైన అక్రమాస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఆయనకు ఉచ్చు మరింత బిగుస్తోంది. ఆర్థిక నేరాల విభాగం అధికారులు జరిపిన దర్యాప్తులో ఆయన తన భార్య, ప్రియురాలితో పాటు ఇంట్లో పనిచేసే పనిమనిషి పేరిట కూడా భారీగా పెట్టుబడులు పెట్టినట్లు తేలింది. ఆయన చివరిగా కిషన్‌గంజ్‌లో ఎస్‌డీపీవోగా పనిచేసినప్పుడు ఈ అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఇంట్లో పనిచేసే పారో అలియాస్ పూజ అనే పనిమనిషి ఇంటి పనులకు ఏకంగా థార్ వాహనంలో వచ్చేదని దర్యాప్తులో తేలడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె పేరు మీద డీఎస్పీ పలు ప్లాట్లు కొనుగోలు చేయడంతో పాటు, ఓ బుల్లెట్ మోటార్‌సైకిల్‌ను కూడా బహుమతిగా ఇచ్చినట్లు ఆధారాలు లభించాయి. ఆమెతో ఆయనకు అక్రమ సంబంధం కూడా ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు ప్రకారం డీఎస్పీ తన భార్య రూబీ, ప్రియురాలు, అత్త పూనమ్ దేవి, కుమారుడు సిద్ధార్థ్ గౌతమ్ పేర్లతో మొత్తం 16 ప్లాట్లను కొనుగోలు చేసినట్లు ఈవోయూ వర్గాలు తెలిపాయి. ఆయనకు మూడు ఎస్‌యూవీలు ఉండగా, వాటిలో ఒకటి అత్తగారి పేరు మీద, ఒక ట్రక్కు ప్రియురాలి పేరు మీద రిజిస్టర్ అయి ఉన్నాయి. అవినీతి కేసు నమోదు కావడంతో ఇప్పటికే సస్పెండైన గౌతమ్ కుమార్‌పై మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా విచారణ జరిపే అవకాశం ఉంది. బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, నేపాల్‌లో ఆయన పెట్టిన బినామీ పెట్టుబడులపై అధికారులు దృష్టి సారించారు. కాగా, ఈ కేసు బయటకు వచ్చినప్పటి నుంచి పనిమనిషి పారో పరారీలో ఉంది. 1994లో ఇన్స్‌పెక్టర్‌గా చేరిన గౌతమ్, డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ కేసులో రాబోయే రోజుల్లో మరిన్ని విషయాలు బయటపడతాయని ఈవోయూ ఏడీజీ నయ్యర్ హస్నైన్ ఖాన్ తెలిపారు.

# మంటల్లో పశ్చిమాసియా

## అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఐఆర్‌జిసి ఇంటెలిజెన్స్‌చీఫ్ మృతి



**టెహ్రాన్, ఏప్రిల్ 6:** ఇరాన్‌కు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ దళాలు సం యుక్తంగా జరిపిన వైమానిక దాడిలో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఇంటెలిజెన్స్ చీఫ్, మేజర్ జనరల్ సయ్యద్ మజీద్ ఖదేమీ మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఈ దాడి జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ ఘటనపై ఐఆర్‌జీసీ ఒక ప్రకటన విడు దల చేసింది. ఇది నేరపూరిత ఉగ్రవాద దాడి అని, ఈ దాడిలో ఖదేమీ షహీద్‌ఖ్ (అమరుడు) అయ్యారని పేర్కొంది. అయితే, దాడి ఎక్కడ జరిగిందనే ప్రదేశాన్ని మాత్రం ఐఆర్‌జీసీ వెల్లడించలేదు. ఇరాన్ భద్రతా వ్యవస్థలో అత్యంత శక్తివంతమైన నిఘా విభాగానికి ఖదేమీ నాయకత్వం వహిస్తున్నారు. ఫిబ్రవరి 28నుంచి ఇరాన్‌పై అమె రికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి జరుగుతున్న దాడుల్లో ఇరాన్ అనేక మంది ఉన్నతాధికారులను కోల్పోయింది.

# అసోం సిఎం సతీమణికి మూడు పాస్‌పోర్టులు

## కాంగ్రెస్ ఆరోపణలతో అసోం ఎన్నికల ప్రచారంలో దుమారం

**గువాహతి, ఏప్రిల్ 6:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఇప్పుడు రసవత్తరంగా సాగుతుంది. ఏప్రిల్ 9న రాష్ట్రంలో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అధికారిక, ప్రతిపక్ష పార్టీలు ఈ దఫా అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ధీమాతో ఉన్నాయి. ఈ క్రమంలో ఓటింగ్‌కు కొద్ది రోజుల ముందు, ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ



భార్య రినికి భుయాన్ శర్మపై కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన ఆరోపణ చేసింది. ఆమెకు మూడు పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరా ఆరోపించారు. ఖేరా ప్రకటన ఒక్కసారిగా అస్సాంలో రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి హిమంత తన భార్యపై వచ్చిన ఆరోపణలకు స్వయంగా స్పందించారు. పవన్ ఖేరాపై పరువు నష్టం కేసు వేస్తానని సీఎం హెచ్చరించారు. అస్సాంలో, మొత్తం ఈశాన్య ప్రాంతంలో రినికి భుయాన్ శర్మ చాలా ఫేమస్. ఆమె 1973 జూలై 31న గౌహతిలో జన్మించింది.

# ట్రెక్కింగ్ కోసం వచ్చి కర్ణాటకలో తప్పిపోయిన యువతి

## అటవీ అధికారుల గాలింపుతో సురక్షితంగా తరలింపు



**బెంగళూరు, ఏప్రిల్ 6:** కేరళ నుంచి కర్ణాటకకు వచ్చి ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయిన జీఎస్ శరణ్య అనే యువతి ఆచూకీ దొరికింది. నాలుగు రోజుల తర్వాత ఆమెను రెస్క్యూ టీమ్ గుర్తించింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. కేరళలోని కోజికోడ్ జిల్లా చెందిన జీఎస్ శరణ్య అనే ఐటీ ఉద్యోగిని ట్రెక్కింగ్ కోసం గత బుధవారం కర్ణాటక వచ్చింది. కొడుగు జిల్లా, తడియండమోల్ ప్రాంతంలో పర్వతారోహణకు వెళ్లింది. స్థానికంగా ఒక ఇంట్లో బస చేసి, మరుసటిరోజు పర్వతారోహణకు వెళ్లింది. అటవీ అధికారులు ఆమెను చెక్ పాయింట్ వద్ద వివరాలు సేకరించి, వేరే బృందంతో కలిసి పంపించారు. ఎనిమిది గంటలకు అందరితో కలిసి వెళ్లింది. 10.40 గంటలకు పర్వతారోహణ పూర్తి చేసుకుని బయల్దేరారు. ఈ క్రమంలో తను వేగంగా నడవడం, బృందంలోని మిగతా వారు కూడా తలోదిక్కుకు వెళ్లడం ఇలా చివరికి తను ఒంటరిగానే మిగిలిపోయింది. అయినప్పటికీ వేరే వాళ్లతో కలవడానికి ప్రయత్నించింది. ఒక్కరు కూడా కనిపించలేదు. మధ్యాహ్నం తర్వాత తను బసచేసిన ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పింది. తాను తప్పిపోయానని సాయం చేయాలని కోరింది. ఇక తన స్నేహితులకు ఫోన్ చేసేలోపే ఫోన్ ఛార్జింగ్ అయిపోయింది. ఈ సమయంలో తను సాయం కోసం ఎదురుచూసింది. తను తప్పిపోయానని గ్రహించి ఒక చిన్న నీటి ప్రవాహం వద్ద ఉన్న రాయి మీద ఎదురుచూస్తూ ఉండిపోయింది. తనను వెతుక్కుంటూ ఎవరైనా వస్తారని నమ్మింది. ఈ సమయంలో తను అక్కడ ఉండటానికి ఆహారం, నీరు లేవు. దీంతో నీటి ప్రవాహం వద్ద బాటిల్‌లో నీళ్లు తెచ్చుకుని, తాగి, తనను తాను రక్షించుకుంది. వేరే మార్గంలో వెళ్లడానికి ప్రయత్నించినా, అది చివరికి దట్టమైన అడవిలోకి తీసుకెళ్లింది. ఆ రాయి ఉన్న చోటే ఉండిపోయింది. ఏనుగులు వంటి అటవీ జంతువులు ఉన్న పెద్దగా భయపడలేదని తెలిపింది. ఇలా నాలుగు రోజులు ఆ రాయి వద్దే ఉండిపోయింది. మరోవైపు నాలుగు రోజులుగా ఆమె కోసం అటవీ అధికారులు, పోలీసులు గాలించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఆమెను సహాయక బృందాలు గుర్తించాయి. దీంతో ఆమెను సురక్షితంగా అడవి నుంచి బయటకు తీసుకొచ్చారు. ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయినప్పటికీ, ట్రెక్కింగ్ చేయడం మాత్రం మానబోనని తెలిపింది.

# హార్ముజ్ నుంచి పెరగనున్న రాకపోకలు



**టెహ్రాన్, ఏప్రిల్ 6:** పశ్చిమాసియాలో యుద్ధ భయాల నేపథ్యంలో ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హార్ముజ్ జలసంధి వద్ద అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భారత్ వంటి ఇంధన అవసరాలు అధికంగా ఉన్న దేశాలు ఇరాన్‌తో జరిపిన చర్చలు సఫలం కావడమే దీనికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. గత వారంతంలో ఈ జలమార్గం గుండా ఏకంగా 21 నౌకలు ప్రయాణిం చాయి. మార్చి మొదటివారంలో ట్రాఫిక్ నిలిచిపోయిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో ఈ స్థాయిలో నౌకలు ప్రయాణించడం ఇదే తొలిసారి. ఈ 21 నౌకలలో 13 నౌకలు ఇప్పటికే అరేబియా సముద్రం లోకి చేరుకున్నాయి. ఇరాన్ నౌకల ఆధిపత్యం కొనసాగుతున్నప్పటికీ మిత్రదేశం అనే కారణంతో ఇరాక్ ముడిచమురు ట్యాంకర్లకు టెహ్రాన్ ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. భారతదేశం ఇరాన్‌తో జరిపిన దౌత్యపరమైన చర్చల ఫలితంగా ఎనిమిది ఎల్‌పిజి ట్యాంకర్లు ఈ మార్గం ద్వారా సురక్షితంగా బయటపడ్డాయి.

# క్రూడాయిల్ ధరలను భారీగా పెంచిన సౌదీ అరేబియా



**రియాద్, ఏప్రిల్ 6:** హార్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో సౌదీ అరేబియా క్రూడాయిల్ ధరలను పెంచేసింది. ఆసియా కొనుగోలుదారులకు అధిక ధరకు విక్రయి స్తున్నట్లు బ్లూమ్‌బెర్గ్ వార్తా కథనం పేర్కొంది. సౌదీ ఆరామ్‌కో అరబ్ లైట్ క్రూడ్‌ను ప్రీమియం ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొంది. మే నెలకు గానూ బెంచ్ మార్క్ ధరకంటే 19.50 డాలర్ల అధిక ధరకు ఆసియా రిఫైనరీలకు విక్రయిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు 50శాతం కంటే ఎక్కువ పెరిగాయి. మరికొంతకాలం పాటు ఉద్రిక్తతలు కొనసాగే అవకాశం ఉండడంతో సౌదీ ఆరామ్‌కో ధరలను పెంచేసింది. క్షిపణి, డ్రోన్ దాడుల వల్ల గల్ఫ్ ప్రాంతంలో కూడా మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒకవేళ ఇప్పుడే యుద్ధం ఆగి, హార్ముజ్ జలసంధి వెంటనే తెరుచుకున్నా.. చమురు సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడానికి, ఉత్పత్తి లక్ష్యాలను అందుకోవడానికి సమయం పడుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

# తమిళనాడును మణిపూర్ చేయాలని బిజెపి కుట్రలు

## ఎన్నికల ప్రచారంలో సిఎం స్టాలిన్ ధ్వజం



**చెన్నై, ఏప్రిల్ 6:** తమిళనాడులో ఎన్నికల వేడి పెరుగుతోంది. తాజాగా సీఎం ఎంకే స్టాలిన్ బీజేపీని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు. మదురైలో జరిగిన ప్రచార సభలో ఆయన మా ట్లాడుతూ మదురైని మణిపూర్‌లా మార్చేందుకు బీజేపీ ప్రయత్నించిందని ఆరోపించారు. మ దురైలో తిరుపరంకుండ్రం సుబ్రమణ్య స్వామి ఆలయ వివాదాన్ని స్టాలిన్ ప్రస్తావించారు. మదురై హైకోర్టు, కొండపై ఉన్న స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతి ఇచ్చింది. అయితే, ఈనిర్ణయాన్ని డీఎంకే సర్కార్ సవాలు చేసింది. ఈ వివాదం గురించి స్టాలిన్ ప్రస్తావించారు. తమిళనాడు దివాలా తీస్తుందని బీజేపీ ఆరోపిస్తోందని, అయితే దివాలా తీసేది మాత్రం ఎన్డీయే అని స్టాలిన్ ఎద్దేవా చేశారు. తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

# 'వన్‌నేషన్ వన్ ఎలక్షన్'కు ప్రజలు సానుకూల వైఖరి

## పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** ఉమ్మడి పౌరస్మృతి, వన్ నేషన్, వన్ ఎలక్షన్ గురించి తమ ప్రభుత్వం పాజిటివ్ కోణంలో ఆలోచిస్తున్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. తమ పార్టీ అమలు చేయాల్సిన ఎజెండాల్లో ఆ రెండూ మిగిలి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వీటి గురించి దేశ ప్రజలు సీరియస్‌గా ఆలోచిస్తున్నారన్నారు. బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్చువల్‌గా కార్యకర్తలను ఉద్దేశించి మోడీ ప్రసంగించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ పార్టీ వారిని టార్గెట్ చేసిందన్నారు. బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో అనేక బీజేపీ మంది కార్యకర్తలు ప్రాణా లు కోల్పోయినట్లు చెప్పారు. ఆ రాష్ట్రాల్లో హింస అనేది రాజకీయ సంస్కృతిగా మారిందన్నారు. తమ మిషన్ ఇంకా కొనసాగుతోందని, ఉమ్మడి పౌరస్మృతితో పాటు వన్ నేషన్, వన్ ఎలక్షన్ గురించి దేశంలో తీవ్ర చర్చ జరుగుతోందని, పాజిటివ్ కోణంలో ముందుకు వెళ్తున్నామన్నారు. వన్ నేషనల్ వన్ ఎలక్షన్ కింద లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తారు. ఇక యూసీసీ కింద ఏ మతస్థులవారైనా పెళ్లి, దత్తత లాంటి ఇతర అంశాల్లో అందరికీ ఒకే విధంగా చట్టాన్ని రూపొందించనున్నారు. ప్రతి సవాల్‌ను ఎదుర్కొనేందుకు బీజపీ కృషి చేస్తున్నట్లు ప్రజలు గుర్తించారని మోడీ అన్నారు. గతంలో పాజిటివ్ ఫలితాలు సాధించామని, భవిష్యత్తులోనూ పాజిటివ్ ఫలితాలు ఉంటాయన్నారు. బ్రిటీష్ కాలం నాటి వందల సంఖ్యలోని నల్ల చట్టాలను రద్దు చేశామని, ప్రజాస్వామ్య బద్ధంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించామని, జనరల్ క్యాటగిరీలో పేదల పిల్లలకు 10 శాతం కోటా, ట్రిపుల్ తలాక్, పౌరసత్వ సవర్ణ బిల్లు, అయోధ్యలో రామాలయ నిర్మాణం సంపూర్ణమయ్యాయి. బీజేపీ పార్టీ కార్యకర్తలు తమ స్వంత పార్టీని తల్లి తరహాలో చూసు కుంటారన్నారు. పార్టీ ఫౌండేషన్ డే అనేది రాజ కీయ ఈవెంట్ కాదు అని, అది భావోద్వేగ మైందన్నారు.

# గాడ్ ఈజ్ గుడ్‌తోనే మా పైలట్‌ను గుర్తించాం: ట్రంప్



**వాషింగ్టన్, ఏప్రిల్ 6:** ఇరాన్ భూభాగంలో కూలిపోయిన అమెరికా ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమాన సిబ్బందిలో ఒకరిని కాపాడిన ఉత్కంఠభరిత ఆపరేషన్ గురించి మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన విషయాలు వెల్లడించారు. ప్రమాదం తర్వాత ఇరాన్ పర్వత ప్రాంతంలో చిక్కుకుపోయిన అధికారి పంపిన 'గాడ్ ఈజ్ గుడ్' (దేవుడు గొప్పవాడు) అనే మూడు పదాల రేడియో సందేశం తొలుత అమెరికా అధికారుల్లో తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు కారణమైందని ఆయన తెలిపారు. అమెరికా బలగాలను ఉచ్చులోకి లాగేందుకు ఇరాన్ దళాలే ఈ నకిలీ సిగ్నల్స్ పంపుతున్నాయని వారు అనుమానించినట్లు యాక్సియోస్‌కు ఇచ్చినఇంటర్వ్యూలో ట్రంప్ వివరించారు. విమానం నుంచి బయ టకు దూకినతర్వాత గాయపడిన వెపన్స్ సిస్టమ్స్ ఆఫీసర్ పర్వత ప్రాంతంలో ఒక పగులులో దాక్కుని 24గంటలకు పైగా ప్రాణాలతో నిలిచారు. అతని కోసం వేలాది మంది ఇరాన్ సైనికులు, స్థానిక పౌరు లు గాలిస్తున్నారని, పట్టిచ్చిన వారికి బహుమతులు కూడా ప్రకటించారని ట్రంప్ చెప్పారు. ఈ నేప థ్యంలో, సుమారు 200మంది ప్రత్యేక దళాలతో అమెరికా అత్యంత సాహసోపేతమైన రాత్రిపూట రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. ఆ రేడియో సందేశం ఒక ముస్లిం మాట్లాడినట్లుగా అనిపించిందని ట్రంప్ అన్నారు. ఆ అధికారికి దైవభక్తి ఎక్కువని, అందుకే అలా అని ఉండవచ్చని తర్వాత అధికారులు స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంలో సీఐఏ చేపట్టిన డిసెప్షన్ ఆపరేషన్ కీలకపాత్ర పోషించింది.

# సామాజిక రుగ్మతను సంఘటితంగా ఎదుర్కోవాలి

## చర్లపల్లి జైలులో మత్తు విముక్తి కేంద్రాన్ని ప్రారంభించిన గవర్నర్ శుక్లా



చర్లపల్లి జైలులో మత్తు విముక్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా. ఫోటోలో జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** నగర శివార్లలోని చర్లపల్లి ఓపెన్ ఎయిర్ జైల్లో మత్తు విముక్తి కేంద్రాన్ని గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా సోమవారం ప్రారంభిం చారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారు, డ్రగ్స్ కేసులో దొరికిపోయిన వారిలో అనేక మందికి ఆయా కోర్టులు జైళ్లకు పంపుతుండడం తెలిసిందే.

ఇలా జైళ్లకు వచ్చే వారికి ఈ కేంద్రంలో వుంచి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి విడు దలయ్యాక మంచివారుగా వుండే విధంగా చూస్తారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా సహా ఇతర అధికారులు స్వాగతం పలికారు. మత్తు విముక్తి కేంద్రం ప్రారంభించిన తరువాత గవర్నర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం తీవ్రమైన సామాజిక రుగ్మతగా అభివర్ణించారు. దీనిని ప్రజారోగ్య సమస్యగా కూడా చూడాలని ఆయన కోరారు. మత్తు పదార్థాల వినియోగాన్ని అందరు సంఘటితంగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. తన రాజకీయ జీవితంలో ప్రజా సమస్యలపై పోరాడిన సమయంలో అనేకసార్లు జైళ్లకు వెళ్లిన అనుభవం వుందని, దీంతో అక్కడ వుండే ఖైదీలు, జైళ్లలో పనిచేసే సిబ్బంది ఎదుర్కొనే సమస్యలు తనకు బాగా తెలుసునని ఆయన అన్నారు. యుపిలో తా ను జైళ్ల శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో సిబ్బంది బాగోగుల కోసం అనేక చర్యలు తీసుకున్నానని ఆయన తెలిపారు. జైళ్లలో ఖైదీలకు నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. మత్తు విముక్తి కేంద్రాలు ఏర్పాటు వల్ల ఇందులో వచ్చే వారిని పూర్తిగా మార్చాల్సిన బాధ్యత ఇక్కడ పనిచేసే సిబ్బందిదేనని గవర్నర్ తెలిపారు.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని, జైళ్ల శాఖ అధికారులను ఆయన అభినందించారు. జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా మాట్లాడుతూ చర్లపల్లి జైల్లో ఏర్పాటైన మత్తు విముక్తి కేంద్రం జైళ్లలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా అమల్లోకి వచ్చిందని తెలిపారు. మత్తు విముక్తి కేంద్రంలో వచ్చే వారిని శిక్షకు గురైన వారుగా తాము చూడడం లేదని, వారిని ఉత్తమ పౌరులుగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. చర్లపల్లితో పాటు చంచల్‌గూడ, సంగారెడ్డి, నిజామాబాద్, చంచల్‌గూడ మహిళా జైల్లో మత్తు విముక్తి కేంద్రాలు పనిచేస్తున్నాయని ఆమె తెలిపారు. ఈ కేంద్రాలలో సైకాలజిస్టులతో పాటు సామాజికవేత్తలు కౌన్సిలింగ్ రూపంలో సేవలందిస్తున్నారని ఆమె తెలిపారు. ఇ క్కడ నుంచి విడుదలైన వారికి తగిన సహాయం అందిస్తున్నామని ఆమె వెల్లడించారు. అనంతరం జరిగిన మరో కార్యక్రమంలో గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లా చర్లపల్లి జైల్లోని అగ్రికల్చరల్ కాలనీని సందర్శించి అక్కడి ఖైదీలు, సిబ్బందితో మాట్లాడారు.

దీని తరువాత ఏరియా 77 నేచర్ క్యాంప్, అడ్వెం చర్ పార్క్‌ను, విడుదలైన ఖైదీల పునరావాసం కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రం, ఉపాధి కల్పనా కేంద్రాలను కూడా గవర్నర్ సందర్శించా రు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు, సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి శైలజ, జైళ్ల శాఖ ఐజి మురళీబాబు, డిఐజి శ్రీనివాస్, ఉప్పల్ డిసిపి సురేష్ కుమార్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ విభాగాల్లో పన్నుల ఎగవేత అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 6:** రెవెన్యూ విభాగాల్లో పన్నుల ఎగవేతను అరికట్టేందుకు చర్యలు ప్రభుత్వం చేపట్టింది. సీఎస్ నేతృత్వంలో రెవెన్యూశాఖ విభాగాల కార్యదర్శులతో అధ్యయన కమిటీ ఏర్పాటు చేసింది. ఆదాయం తెచ్చే శాఖలన్నింటికీ కలిపి రెవన్ (రెవ్‌వన్) పోర్టల్ ఏర్పాటు చేసింది. శాఖల మధ్య డేటా మార్పిడి, పర్యవేక్షణకు పోర్టల్‌పై అధ్యయనం చేయనుంది. స్థానికసంస్థలు వినోదపన్ను వసూలు చేసే అవకాశంపైనా అధ్యయనం చేస్తారు. యూపీఐ, పీవోఎస్ లావాదేవీలపై నిఘా పెట్టేలా కొత్త చట్టం ఏర్పాటుపై అధ్యయనం చేయనున్నారు. 30 రోజుల్లో ప్రాథమిక, 60 రోజుల్లో సమగ్ర నివేదిక కమిటీ ఇవ్వనునుంది.

# త్రిస్సూర్ జిల్లాలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికలు జరుగుతున్న కేరళంలోని త్రిస్సూర్ జిల్లాలో సోమవారం తెలంగాణా ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహిచారు. త్రిస్సూర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జోసెఫ్ తాజెట్‌తో కలిసి ఆయన రెండ్రోజులుగా ఒల్లూర్, నట్టిక, కైపమండలం, పుదుక్కాడ్, చలకుడి, కోడుంగల్లూర్, మనలూర్ తదితర అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. త్రిస్సూర్ జిల్లాలో 13 శాసనసభ నియోజక వర్గాలు ఉండగా 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యుడిఎఫ్ కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకుంది. ఈ సారి అధికార ఎల్డీఎఫ్ తీవ్ర స్థాయిలో ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్న



నేపథ్యంలో త్రిస్సూర్ జిల్లాలో కాంగ్రెస్ మెజారిటీ సీట్లను దక్కించుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పగలంతా ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉంటున్న శ్రీధర్ బాబు రాత్రి వేళల్లో త్రిస్సూర్ కాంగ్రెస్ సీనియర్ నేతలతో పలుదఫాలు సమావేశాలు నిర్విహించారు. పార్టీ గెలుపునకు అందరూ ఐకమత్యంగా కలిసి పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. మహారాష్ట్రలోని పశ్చిమ నాగపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, నాగపూర్ డిసిసి అధ్యక్షుడైన వికాస్ ఠాక్రే శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల ప్రచారం తీరుతెన్నులపై చర్చించారు.

# అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయండి

**బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్**

**రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు ఫోన్‌లో శుభాకాంక్షలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ముందుకు సాగాలని బిజెపి జాతీయ అధ్యక్షలు నితిన్ నబీన్ అన్నారు. సోమవారం బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బిజెపి జాతీయ అధ్యక్షలు నితిన్ నబీన్‌రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావుకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, కార్యకర్తలకు బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో బలోపేతమై రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలని పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజల వద్దకు వెళ్లి ప్రజల ఆశీర్వాదం తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం భారతీయ జనతా పార్టీ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుందని రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందన్న ఆశాభావం జాతీయ పార్టీకి ఉందన్నారు కార్యకర్తలు నాయకులు ప్రజలతో సమష్టిగా పనిచేస్తూ ముందుకెళ్లాలని సూచించారు.

# 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్(స్పెషలిస్ట్) పోస్టుల జాబితా విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** తెలంగాణ వైద్య విధాన పరిషత్(టివివిపి) పరిధిలోని 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్(స్పెషలిస్ట్) పోస్టులకి ఎంపికైన డాక్టర్ల లిస్టును తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల జాబితాను రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం సాయంత్రం విడుదల చేసింది. పోస్టుల్లో అనస్తేషియా 226, గైనకాలజీ 247, పీడియాట్రిక్స్ 219 పోస్టులు ఉన్నాయి. పోస్టులకి ఎంపికైన వారికి నేడు(ఏప్రిల్ 7) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా.. 692 మంది డాక్టర్లకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలు అందజేయనున్నారు. మొత్తం 1616 సివిల్ అసిస్టెంట్ సర్జన్(స్పెషలిస్ట్), 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది ఎంహెచ్ఎస్ఆర్బీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 1616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టులకుగానూ గైనకాలజీ, అనస్తేషియా, పీడియాట్రిక్స్ స్పెషాలిటీలకు సంబంధించిన 692 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తవడంతో సోమవారం ఫలితాలు విడుదల చేశారు. మిగిలిన 924 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీ ప్రక్రియ మే నెలలో పూర్తికానుంది. గతేడాది 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో గైనకాలజీ, అనస్తేషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ స్పెషాలిటీలకు సంబంధించిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తవడంతో రెండ్రోజుల క్రితమే సెలక్షన్ విడుదల చేశారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్లకు కూడా నేడు నియామక పత్రాలు అందించనున్నారు.

# పండ్లు తింటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోంది

**గ్యాస్ కొరతపై స్పందించిన సిపిఐ నారాయణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** దేశంలో నెలకొన్న వంట గ్యాస్ కొరత, పెరుగుతున్న ధరలపై సీపీఐ జాతీయ నేత నారాయణ స్పందించారు. తన ఇంట్లో గ్యాస్ అయిపోవడంతో కనీసం కాఫీ, టీ కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని, కేవలం పండ్లు తింటూ కాలం వెళ్లదీయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం తన సమస్య మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా సామాన్యులందరూ ఎదుర్కొంటున్న సమస్యని పేర్కొన్నారు. ప్రధాని మోదీపై ఆయన విమర్శలు గుప్పించారు. ఒకవైపు గ్యాస్ అందుబాటులో ఉందని మోదీ అబద్ధాలు చెబుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజలు ఖాళీ సిలిండర్లతో ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాల వల్ల తలెత్తిన యుద్ధ వాతావరణం గ్యాస్ సంక్షోభానికి కారణమన్నారు. భారత విదేశాంగ శాఖ యుద్ధాన్ని ఆపాల్సింది పోయి, బాధితులను బతిమాలడం విడ్డూరంగా ఉందన్నారు. సామాన్యుల ఇళ్లలో పొయ్యి వెలగని పరిస్థితికి కేంద్ర వైఫల్యమే కారణమని నారాయణ విమర్శించారు.

# మోడీ కుట్రలపై పది జిల్లాల్లో ప్రచారం

**13న మహబూబ్‌నగర్ జిల్లా నుంచి షురూ**

**పిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** జనగణనలో బిసి ప్రస్తావన చేయని మోడీ కుట్రలను ఉమ్మడి పది జిల్లాల్లో ప్రచారం చేస్తానని ఈ నెల 13న మధ్యాహ్నం 12 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభం చేయబోతున్నానని ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీకి హటావో ఒబిసి బచావో అనే నినాదంతో బిసి ప్రజారాశులను దేశవ్యాంగా సమీకృతం చేస్తానని ప్రకటించారు. కేంద్రప్రభుత్వం జనగణనలో కుల గణన చేయక పోతే అన్యాయం జరుగుతుదనీ,రాజకీయ,సామాజిక,ఆర్థిక సమాన త్వం సాధించేందుకు బిసిల కోసం యుద్ధం చేయడానికి నేను సిద్ధమైనానని అన్నారు.గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీకి హటావో ఒబిసి బచావో అనే నినాదంతో బిసి ప్రజారాశులను దేశవ్యాంగా సమీకృతం చేస్తానని ప్రకటిం చారు. మోడీ రిమోట్ కంట్రోల్ మోహన్ భగవత్ దగ్గర ఉందని ఆయన అగ్రకుల మను భావాజాలంతో ఏం చెప్పినా అదే చేస్తాడని ఆవేదన చెందారు. భారత దేశాన్ని ముక్కలు చేయడమే ఆర్ఎస్ఎస్ ఆలోచన అని విమర్శించారు. 'బిసిలు ఓట్లేసే మిషన్లమా? మేం ఓట్లు వేయడానికి తప్పా అధికారం చేపట్టడానికి పనికిరామా?ఎన్ని రోజులు మేం అడుక్కుతినాలి?' అని ఆయన ఆగ్రహంతో ప్రశ్నించారు.బిసిలకు రాజ్యాధికారంలో సమాన వాటా కావాలనే లక్ష్యంతో యుద్ధం చేయడానికి నేను సిద్ధమయ్యాను అని ఖరాఖండిగా ప్రకటించారు. పది ఉమ్మడి జిల్లాల్లో తిరిగి మోదీ కుట్ర గురించి ప్రజల్లో ప్రచారం చేస్తా అని ఆయన చెప్పారు. కేంద్రం జనగణనలో కుల గణన చేయకపోతే అన్యాయం జరుగు తుందని ఆయన ఆవేదన చెందారు. మోడీ చేస్తున్న జన గణనలో కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం చేస్తున్న గణనలో బిసిల ప్రస్తావన లేదు అని ఆయన అన్నారు. చదువుకుంటేనే బ్రతుకు మారుతుందని జ్యోతిరావు పూలే అన్నారనీ ఆయన గుర్తుచేసుకొన్నారు. పూలే బాటలోనే అంబేద్కర్ అధ్యయనం చేశాడని రాహుల్ ప్రధాని కాగానే దేశంలో కులగణన చేస్తామని విహెచ్ ప్రకటించారు.

# నేడు ఎస్ఎస్‌సి మూల్యాంకన కేంద్రాల్లో ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శనలు

**పిలుపునిచ్చిన ఉపాధ్యాయ జెఎసి సంఘాలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఎస్ఎస్‌సి మూల్యాంకన పారితోషికంతోపాటు కులగణన పారితోషికం చెల్లించనందుకు నిరసనగా నేడు(మంగళవారం) స్పాట్ కేంద్రాలలో భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు చేయాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. 2025 మార్చిలో నిర్వహించిన స్పాట్ మూల్యాంకన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషికం ఇవ్వడంతోపాటు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేడు స్పాట్ కేంద్రాల దగ్గర నిరసన ప్రదర్శనలు చేపట్టాలని టిజిజేఏసీ, యుఎస్‌పిసి, జాక్టో నిర్ణయించాయి. ఈ నిధుల విడుదల కోసం జేఏసీలు పలుమార్లు ప్రాతినిధ్యాలు చేసినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కులగణన విధులు పూర్తయి సుమారు 18 నెలలు కావస్తున్నా ఇపనపటి వరకు పారితోషికం చెల్లింపులు జరపకపోవడం అన్యాయమని టిటిజేఏసీ ఛైర్మన్ పి దామోదర్ రెడ్డి, యుఎస్‌పిసి ఛైర్మన్ చావ రవి, జాక్టో ఛైర్మన్ జి సదానందం గౌడ్ అన్నారు. 10వ తరగతి మూల్యాంకన విధులకు చెల్లించే పారితోషికం గత 7 సంవత్సరాలుగా పెంచలేదని, కానీ ఇంటర్ స్పాట్ రేట్లు రెండుసార్లు పెంచారని కాబట్టి ఎస్ఎస్‌సి స్పాట్ రేట్లు కనీసం 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ సంవత్సరం స్పాట్ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం పూర్తి కాగానే ఆలస్యం చేయకుండా వెంటనే స్పాట్ పారితోషికాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. నేడు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎస్ఎస్‌సి స్పాట్ మూల్యాంకన కేంద్రాలలో టిటిజేఏసీ, యుఎస్‌పిసి, జాక్టో ఉపాధ్యాయ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించ నున్నట్టు తెలిపారు.

# నేల ఆరోగ్యాన్ని కాపాడితేనే రైతుకు భవిష్యత్తు

**రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి**

**సేంద్రియ వ్యవసాయంవైపు మళ్లాలి**

**పంట అవశేషాలను తగలబెట్టకండి**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** సుస్థిర వ్యవసాయం ద్వారానే నేల ఆరోగ్యాన్ని పరి రక్షించడం సాధ్యమని, తద్వారా రైతు భవిష్యత్ భద్రంగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఇక్రిశాట్ సంయుక్తంగా చేపట్టిన రెండు రోజుల ప్రత్యేక రైతు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నేల ఆరోగ్యం కేవలం పంటలకే పరిమితం కాకుండా పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరచడాన్ని ప్రతి ఒక్కరూ భాద్యతగా తీసుకొని ఉద్యమంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. నేల ఆరోగ్యంగా ఉంటేనే పౌష్టికాహారం, పర్యావరణ సమతుల్యత, మానవ శ్రేయస్సు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణ రైజింగ్ విజన్ 2047లో భాగంగా సాగు ఖర్చులను తగ్గిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. రైతులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని రసాయన ఎరువులపై ఆధారపడ టాన్ని తగ్గించి, సేంద్రియ, శాస్త్రీయ మట్టి నిర్వహణ పద్ధతులను అవలంబించాలన్నారు. పిల్లిపెసర, జీలుగ, జనుము, మినుము, పెసర లాంటి లెగ్యూమీనస్ పంటలను వేసుకొని నేల సారాన్ని పెంచుకోవల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజల పంటల సాగు విషయంలో ఇక్రిశాట్ ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తోందని కొనియాడారు. ఈ శిక్షణ ద్వారా వలంటీర్లు తమ గ్రామాల్లోని ఇతర రైతులకు నేల యాజమాన్యంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, భూముల సారాన్ని పరిరక్షించుకునే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నుండి సుమారు 120 మంది రైతులు సాయిల్ హెల్త్ వలంటీర్లుగా శిక్షణ పొందుతున్నారు. ఈ రెండు రోజుల శిక్షణలో భాగంగా రైతులకు తరగతి గది బోధనతో పాటు శిక్షణ కూడా అందిస్తున్నారు. పొలంలో మట్టి నమూనాలను సేకరించడం నుండి ల్యాబ్‌లో పరీక్షించే విధానం వరకు శాస్త్రవేత్తలు ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు. సాయిల్ హెల్త్ కార్డ్ వివరాల ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో ఎలా వినియోగించాలో వలంటీర్లకు నేర్పించానున్నారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా స్టాన్‌ఫోర్డ్ బ్లేయిడ్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మి న్, ఉద్యాన యూనివర్సిటి ఉప కులపతి రాజిరెడ్డి, ఇక్రిశాట్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయి.. లేదంటే సిఎంతో కలిసి పనిచేయాలి

**ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్ తెలంగాణ, ముఖ్యంగా దక్షిణ భారతదేశ ప్రజలకు న్యాయం జరిగేలా పని చేయాలి, మీకు అది చేతకాకపోతే సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేయాలని ప్రభుత్వ విప్ వేముల వీరేశం హితవు చెప్పారు. సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ అసత్యప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సిఎం అంటున్నారని వివరించారు. దక్షిణాది రాష్ట్రాలు కుటుంబనియంత్రణతో జనాభా పెరుగుదలను అరికట్టడమే కాకుండా మేలిరకం మానవ వనరులతో దేశ ఆర్థిక స్వావలంబనకు జిడిపిలో అత్యధిక వాటాను అందిస్తుంటే ఈ రాష్ట్రాల నుంచి నిధులు తీసుకెళ్లి ఇక్కడి ప్రజలకు తీరని అన్యాయం చేస్తోందని, ఇప్పుడు అదేవిధంగా రాజ్యాధికారంలో దక్షిణాది పాత్రలేకుండా కుట్రలు చేస్తున్నారని ఆవేదన చెందారు. దక్షిణాది నుంచి కేంద్రమంత్రిగా బండి సంజయ్ ఉన్నారని ఈ రాష్ట్రాలకు నష్టం జరగనివ్వమని బండి సంజయ్ వ్యవహరించాలని కోరారు. దేశంలో అధికార వాటాలో దక్షిణాది ప్రజల ప్రాతినిధ్యం కాపాడుకోవడానికి కృషిచేస్తున్న సిఎంపైన విమర్శలు చేస్తు న్నారని ఆరోపించారు. ఈ దేశం పట్ల ఆయన ఒక్కరికే భక్తి ఉన్నట్లు మాట్లాడుతున్నాడనీ కానీ దేశం కోసం త్యాగాలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది మాత్రమే అని ఆయన అన్నారు. దేశం కోసం గాంధీ కుటుంబం రక్తాన్ని ధారపోసిందనీ, అలాంటి చరిత్ర ఉన్న పార్టీకి చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు పునర్విభజనలో నష్టం జరుగుతుందని ఇక్కడి ప్రజల తరుపున సిఎం మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి మాటలకు బిజెపి నాయకులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచారని, వాస్తవాలు మాట్లాడుతున్న సిఎంపైన అవాకులు చెవాకులు మాట్లాడొద్దని ఆయన సలహా ఇచ్చారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవాలు

**పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన ఎన్. రాంచందర్‌రావు**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బిజెపి జాతీయ నాయకులు మురళీధర్ రావు, శాసన మండలి బిజెపి ఫ్లోర్ లీడర్ ఏవిఎన్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, బిజెపి రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, ఇతర ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ కోట్లాది మంది కార్యకర్తల నిస్వార్థ త్యాగం, అంకితభావం వల్లే బిజెపి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని, అందుకు కృషిచేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇది కేవలం సంబరాలు చేసుకునే రోజు మాత్రమే కాదని, దేశమే ప్రథమం అనే సిద్ధాంతం పట్ల



నిబద్ధతను చాటుకునే గర్వకారణమైన రోజని పేర్కొన్నారు. సామాన్య కార్యకర్తలే బలగంగా, దేశ హితమే పరమావధిగా ప్రారంభమైన బిజెపి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగింది. నాడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి మహనీయులు వేసిన పునాదులపై నేడు పార్టీ అప్రతిహతంగా దూసుకుపోతుందని అన్నారు.

తెలంగాణలో ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం, ప్రజల గొంతుకగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దృఢమైన, స్వయం సమృద్ధమైన వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండిపై ఆరోపణలు అవాస్తవం.. ఉద్యోగుల ఖండన

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సిఎండిపై చేస్తున్న అభియోగాల్లో ఏమాత్రం వాస్తవం లేదని ఆ సంస్థ ఉద్యోగులు ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ప్రస్తుతం ఉన్న ఎన్పీడీసీఎల్ బిల్డింగ్ లో ప్రభుత్వం కొత్తగా పోస్టులను మంజూరు చేయడం వల్ల కొన్ని విభాగాల్లో ముఖ్యంగా హెచ్‌ఆర్డి, ఫైనాన్స్ మరియు ఆపరేషన్ లోని ఉద్యోగులకు తగినంత స్థలం లేదన్నారు. ఉద్యోగుల అభ్యర్థుల అభ్యర్థనతో ఒక కమిటీ ఏర్పాటు చేసిన సిఎండి ఆ కమిటీ సిఫారసు మేరకు ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ పై ఐదో(5) అంతస్తు నిర్మించడానికి నిర్ణయించారని వివరించారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన ఐదో అంతస్తులో ఆపరేషన్, స్కాడా, సివిల్ విభాగాలకు స్థలంను కేటాయించారని, సిఎండి ప్రస్తుత ఛాంబర్ లో ఏలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. ఎన్పీడీసీఎల్ అధికారిక క్యాంప్ ఆఫీస్‌ను దాదాపు 14 సంవత్సరాల కిందట నిర్మించినందున కొన్ని మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకోసం కేవలం రూ.15 లక్షలు ఖర్చు పెట్టడం జరిగిందని తెలిపారు. అయితే ఈ మెత్తాన్ని రూ.60 లక్షలుగా చిత్రీకరించడం పూర్తిగా ఆవాస్తవం, నిరాధారమన్నారు. ఉన్నతాధికారుల సమావేశం సందర్భంగా సాధారణ వర్కింగ్ లంచ్ ఏర్పాటు చేస్తే దాన్ని కూడా వక్రీకరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అలాగే సంస్థలోని ఉద్యోగులను అవసరాలు, ఉద్యోగుల అఆరోగ్య రీత్యా సంబంధించి బదిలీలు చేయడం వల్ల ఎటువంటి సమస్య లేదని, దీనివల్ల ఎంతో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని జీర్ణించుకోలేక కొందరు వ్యక్తులు, కొన్ని శక్తులు గిబివిశిదీదిలి సిఎండి పై అబద్దాలు ప్రచారం చేయడాన్ని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులందరం ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు.

# ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యం

**సంగెం, ప్రభాతవార్త:** సంగెం మండల పరిధిలో తీగరాజుపల్లి గ్రామ సమీపాన గల శివాలయం వద్ద గల ఎస్సారెస్పి కాకతీయ మేన్ కేనాలో మృతదేహం లభ్యమైంది.ఎస్ఐ వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ పనులకు వెళుతున్న స్థానిక రైతులు ఎస్సారెస్పి కెనాల్‌లో మృతదేహాన్ని గుర్తించి గ్రామ సర్పంచ్‌కు తెలియపరచడం జరిగింది. సర్పంచ్ గోపాల్ మాకు సమాచారం అందిచడంతో రెస్క్యూటీం ద్వారా మృతదేహాన్ని బయటకి తీసి అది మహిళా మృతదేహంగా గుర్తించడం జరిగింది. వయస్సు 30 నుండి 35 ఏండ్లుగా ఉంటుందని, ఎల్లో కలర్ పంజాబి డ్రస్,రెడ్ కలర్ ప్యాంట్ వేసుకుని సుమారు 5 అడుగుల ఎత్తు ఉందని, మెడపై నల్లటి మచ్చలున్నాయని తెలిపారు. ఎవరికైనా మహిళ గురించి తెలిస్తే సంగెం పీఎస్ 8712685023 కాల్ చేయాలని తెలిపారు. మృతదేహాన్ని బద్రపరచటానికి వరంగల్ ఎంజీఎం మార్చురీకు పంపి ధర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.



డిమాండ్ పత్రాలతో అభివాదం చేస్తున్న నేతలు షఫీ అహ్మద్‌ఖాన్, తుడుం రాజేందర్, దైనంపల్లి మల్లికార్జున్, తదితరులు

# జూలై 15న ఎల్బీ స్టేడియంలో 'దివ్యాంగుల ఆత్మగౌరవ సభ'

**రాష్ట్ర దివ్యాంగుల సంఘాల జెఎసి**

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో దివ్యాంగుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేందుకు న్యాయమైన హక్కుల సాధన కోసం జూలై 15న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో లక్ష మంది దివ్యాంగులతో 'దివ్యాంగుల ఆత్మగౌరవ సభ' నిర్వహించబోతున్నట్లు దివ్యాంగుల సంఘాల నేతలు ప్రకటించారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, స్కైట్ రాష్ట్ర అధ్యక్షుడు షఫీ అహ్మద్, టిఎండిఏ రాష్ట్ర అధ్యక్షులు వెంకట రెడ్డి తదితర సంఘాల ప్రతిధులు ఉమ్మడిగా ఈ ఉద్యమ కార్యాచరణను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 90కు పైగా ఉన్న శారీరక దివ్యాంగులకు ఉద్యోగ రిజర్వేషన్లలో తీవ్రఅన్యాయం జరుగుతుందని వారికి మొదటి రోస్టర్ కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో దివ్యాంగులకు నామినేటెడ్ పదవులు కల్పించి రాజకీయ భాగస్వామ్యం కల్పించాలన్నారు, తీవ్ర వైకల్యం ఉన్న దివ్యాంగులకు రూ. 15,000, సాధారణ దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్ హామీ తక్షణమే అమలు చేయాలని, ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు.

# నక్సలైట్ల ఏరివేతపై ముగిసిన ఆపరేషన్ కగార్

## అజ్ఞాత మావోయిస్టు లొంగుబాటుకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసుల యత్నం

## సుదీర్ఘకాలంగా కనిపించకుండా పోయిన 38 మంది గురించి ఆరా

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మావోయిస్టుల ఏరివేతకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్‌కు గత నెల 31వ తేదీన గడువు ముగియడంతో అజ్ఞాతంలో వున్న మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ పోలీసులు మరోమారు ప్రయత్నాలు చేబట్టారు. మావోయిస్టుల లొంగుబాటు తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్‌లోనే ఎక్కువగా జరగడంతో ఈ విషయంలో కేంద్రం కూడా ఈ రెండు రాష్ట్రాల పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే లొంగిపోయిన నక్సలైట్ల సహకారంతో అజ్ఞాతంలో వున్న వారికి నచ్చచెప్పి జనజీవన స్రవంతిలో వచ్చేలా చేసేందుకు రెండు రాష్ట్రాల పోలీసులు తమవంతు కృషి చేయనున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తెలంగాణ పోలీసుల ముందు రెండు లేదా మూడు రోజుల్లో పెద్ద సంఖ్యలో ఆయుధాలతో నక్సలైట్లు లొంగిపోతున్నారని తెలిసింది. ఇందులో సుదీర్ఘ కాలంగా అజ్ఞాతంలో వున్న 38 మంది నక్సలైట్లలో కొందరు వున్నట్లు తెలిసింది.

దేశంలో మావోయిస్టుల శకం ముగిసిందని కేంద్రం ప్రకటించడంతో ఛత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో మిగిలిపోయిన వంద నుంచి 200 మంది వరకు నక్సలైట్లను కూడా లొంగిపోయేలా చేసేందుకు పోలీసుల ప్రయత్నాలు ఊపందుకున్నాయి. అజ్ఞాతంలో వున్న వారిలో కొందరు 20 నుంచి 25 ఏళ్లుగా నక్సలిజంలో వున్న వారు కావడం గమనార్హం. అజ్ఞాతంలో వున్న 38 మంది ఆచూకీ తెలియడం లేదని, వీరిలో కొందరు వయో భారంతో చనిపోయి వుండవచ్చని, ఇంకొందరు అంతర్గత కలహాల వల్ల హత్యకు గురై వుండవచ్చని పోలీసులు ఇదివరకే ప్రకటించారు. వీరి సంఖ్య ఎంత అనేది చెప్పలేదు. అజ్ఞాతంలో వున్న వారి సంఖ్య 55గా పోలీసులు చెప్పినా ఆ తరువాత ఆ సంఖ్యను 38గా ప్రకటించారు. వీరిలో కొందరు చనిపోయి వుంటారని కూడా పోలీసులు తెలిపారు. అయినప్పటికి 20 మంది నక్సలైట్లు కచ్చితంగా జీవించి వుంటారని పోలీసుల అంచనా. గతంలో అజ్ఞాతం లో వున్న నక్సలైట్ల యోగక్షేమాలు గ్రామాలలో వుండే వారి కుటుంబాలకు మావోయిస్టుల తరపున పనిచేసిన కొరియర్లు చెబుతుండేవారు. ఒకవేళ ఎవరైనా ఎన్‌కౌంటర్లలో చనిపోతే వారి కుటుంబాలకు పార్టీ తరపున సమాచారం అందడంతో పాటు కొంతమేర ఆర్థిక సహాయం కూడా అందేది. అయితే దేశంలో నక్సలిజం నిర్మూలనకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ 1, కగార్ 2 తరువాత మావోయిస్టులు వందల సంఖ్యలో లొంగిపోవడం, పదుల సంఖ్యలో ఎన్‌కౌంటర్లలో మరణించిన దరిమిలా అజ్ఞాతంలో వున్న వారి ఆచూకీ వారి కుటుంబాలకు తెలియరావడం లేదు. అయితే దేశంలో ఇప్పుడు మావోయిస్టుల శకం ముగిసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పడంతో మిగిలిపోయిన వారిని జనజీవనస్రవంతిలో తెచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఓవైపు ఛత్తీస్‌ఘడ్ పోలీసులు మరోవైపు ప్రయత్నాలు చేస్తుండగా వీరికి ఆయా ప్రాంతాల నేతలు, నక్సల్స్ సానుభూతిపరులు సహకరిస్తున్నారు. అయితే ఇంతమంది నక్సలైట్లు లొంగిపోయినా అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి ఆచూకీ మాత్రం ఇంత వరకు తెలియరాలేదు. ఆయన విదేశాల్లో వున్నాడని చెబుతున్నా ఎక్కడ తలదాచుకున్నాడనే దానిపై పోలీసుల వద్ద కచ్చితమైన సమాచారం లేదు.

## తలసరి ఆదాయంలో ఆదిలాబాద్ టాప్

### ఆదాయం రూ.74,392 నుండి రూ.3,36,898కి చేరిక

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఒకప్పుడు కరువుకు మారుపేరుగా నిలిచి వలస జిల్లాగా పేరుగాంచిన తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు తాజాగా తలసరి ఆదాయ వృద్ధిలో అగ్రభాగాన నిలిచింది. రాష్ట్రం ఏర్పాటు అయ్యే నాటికి కేవలం రూ.74,392గా ఉన్న తలసరి ఆదాయం 2024-25లో ఏకంగా 352.86 వృద్ధిరేటుతో రూ.3,36,898 కి చేరినట్లు తెలంగాణ సోషియో ఎకనామిక్ సర్వేలో తేలింది. ఈ నివేదిక ప్రకారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల తలసరి ఆదాయం రాష్ట్ర సగటు కంటే ఎక్కువ. ప్రస్తుత ధరల ప్రకారం దేశ తలసరి ఆదాయం రూ.2,05,324 మాత్రమే. తెలంగాణలోని అన్ని జిల్లా లూ ఇంతకన్నా ఎక్కువ తలసరి ఆదాయాన్ని కలిగివున్నాయి. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా ఏడింటిలో తలసరి ఆదాయంలో అగ్రభాగాన నిలిచింది. ఈ జిల్లాలో 10 ఏళ్ల క్రితం రూ.3,43,731గా ఉన్న తలసరి ఆదాయం, ఇప్పుడు 228.66 వృద్ధి చెంది రూ.11,29,735కు చేరింది. అనేక ఐటీ కంపెనీలు, గ్లోబల్ కేపాబిలిటీ సెంటర్ల ఏర్పాటుతో సేవారంగానికి రంగారెడ్డి జిల్లా ప్రధాన కేంద్రంగా ఎదిగింది. ఇదే సమయంలో రాష్ట్ర సగటు తలసరి ఆదాయం 169 వృద్ధి చెంది రూ.1,40,840 నుంచి రూ.3,80,031కి చేరింది. దీంతో పోలిస్తే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలు అధిక తలసరి ఆదాయాన్ని నమోదు చేయగా, జగిత్యాల రూ.2,44,245, వికారాబాద్ రూ.2,47,747 తలసరి ఆదాయంతో మిగిలిన జిల్లాల కంటే వెనుకబడ్డాయి. ఇకవ్యవసాయ రంగంలో వృద్ధి కనిపించినా మొత్తం తలసరి ఆదాయ వృద్ధిలో ఆ రంగం వాటా 15.76 శాతమే. ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం ఏకంగా మూడు రెట్లు పెరిగి 21.80 లక్షల హెక్టార్ల నుంచి 56.18 లక్షల హెక్టార్లకు చేరింది. ఆహార ధాన్యాల ఉత్పత్తి 51.45 లక్షల టన్నుల నుంచి 232.10 లక్షల టన్నులకు పెరిగింది. దీంతో 202526లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కి పెరుగుతుందని అంచనా.

## డిజిపిని కలిసిన పోలీసు డ్యూటీమీట్ విజేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధిం చిన తెలంగాణ పోలీసు జట్టు డిజిపి శివధర్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసింది. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ఆయా విభాగాల క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు వున్నారు.



మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగిన అఖిల భారత పోలీసు డ్యూటీ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన తెలంగాణ పోలీసు జట్టు డిజిపి శివధర్ రెడ్డిని కలిసిన దృశ్యం.

తెలంగాణ పోలీ సు జట్టు వరుసగా మూడవసారి ఈ ఛాంపియన్ షిప్‌ను అందుకోవడం పట్ల డిజిపి శివధర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరిగే పో టీలలో ఇటువంటి ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పాటు కోచ్‌లను డిజిపి అభిన ందించారు. ఈ సమావేశంలో సిఐడి చీఫ్ చారు సిన్హా సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మిలో అవకతవకలు.. అనర్హులకు మంజూరు?

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో మధ్య దళారీల పాత్రే కీలకమనేది వెల్లడయింది. ప్రధానంగా మైనర్లకు వివాహ ప్రయోజనాలను విస్తరించడం, వాస్తవ పుట్టిన తేదీలను మార్చడం, తప్పుగా వివాహ తేదీలను పేర్కొనడం, నిర్దిష్ట ఆదాయం కంటే మించి ఉండటం తదితర వాటికి సంబంధించి అనర్హులకు మంజూరు చేసినట్లు అధికారవర్గాలు గుర్తించాయి. రాష్ట్రవ్యాప్తంగా వేలాది కేసులకు సంబంధించి కేసీఆర్ కిట్ డేటా ప్రకారం ప్రసవ తేదీ, కళ్యాణ లక్ష్మి పథకం కింద నమోదైన వివాహ తేదీ కంటే ముందే ఉండటం విశేషం. భర్తల పేర్లు కూడా సరిపోలినందున, దరఖాస్తులలో పేర్కొన్న తేదీల కంటే ముందే వివాహాలు జరిగి ఉండవచ్చని, లేదా ప్రయోజనాన్ని పొందేందుకు ధృవపత్రాలను తారుమారు చేసి ఉండవచ్చని అధికారులు తేల్చారు. ఈ ఒక్క వ్యత్యాసం వల్లనే మొత్తం రూ. 72.91 కోట్ల ఆర్థిక ప్రభావం ఏర్పడిందని అంచనా. అలాగే మైనర్ల అక్రమ వివాహాలకు సంబంధించి వధువు వయస్సు, వివాహం యొక్క చట్టబద్ధతను ధృవీకరించడానికి ధ్రువీకరణ నియంత్రణలు లేవని నిర్ధారించింది. వీటితో పాటు, మైనర్ వధువులు, అర్హత ప్రమాణాలను మించిన ఆదాయం ఉన్న కుటుంబాలతో సహా అనర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు విస్తరించినట్లు వెల్లడయింది. ఈ విధంగా రూ.55.12 కోట్ల తప్పుడు వ్యయం జరిగింది. ముఖ్యంగా, వివాహ సమయంలో వధువులు 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సులో ఉన్న సందర్భాల్లో బాల్య వివాహాల నిషేధ చట్టం కింద శిక్షార్హమైనదిగా నివేదించడానికి బదులుగా, వారికి ఆర్థిక ప్రోత్సాహకాలను అందించడం గమనార్హం. అలాగే లబ్ధిదారులు తల్లిదండ్రుల ఆదాయ ధృవీకరణ పత్రానికి బదులుగా వధువు ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించి ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించడం వల్ల దాదాపు మరో రూ.33.25 కోట్లను అనర్హులకు విడుదల చేసినట్లు కనుగొన్నారు.

## పారదర్శకతకు మారు పేరు ఆర్టీఐ

### మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డా. వర్రే వెంకటేశ్వర్లు

### విజయవంతంగా సమాచార హక్కు చట్టం-2005 అవగాహన సదస్సు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** పారదర్శకతకు మారుపేరు ఆర్టీఐ అని, సమాచార హక్కు చట్టం ద్వారానే పారదర్శక పాలన అందుతుందని రాష్ట్ర పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు, మాజీ ప్రధాన ఆర్టీఐ కమిసనర్ డా. వర్రే వెంకటేశ్వర్లు అన్నారు. అధికారులు జవాబు దారీతనంగా పనిచేస్తేనే దేశంలో అవినీతిని నిర్మూలించవచ్చునని ఆయన స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ రాష్ట్రస్థాయి సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఛైర్మన్ డా. చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షులు సూర స్రవంతి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డా. వర్రే వెంకటేశ్వర్లు రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్లు పి.వి. శ్రీనివాస్, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, తెలుగు తమిళ సినీహీరో కిరణ్‌కుమార్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. పారదర్శక పాలన కోసం అన్నిరకాల కమిషన్లు రాష్ట్రంలో లేనందువల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని కమిషన్ల ఏర్పాటు చేయడంతో సక్రమ పాలన మార్గం సుగమమైందన్నారు. ఆర్టీఐ పట్ల అవగాహన చాలా తక్కువగా వల్ల విద్యావంతులు, ఉద్యోగులు,



సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పర్వీన్, భూపాల్, వెంకటేశంగౌడ్, గోపీనాథ్, చంటి, స్రవంతి తదితరులు

మీడియా, ఎన్జీవో సంస్థలు ప్రజలకు అవగాహన పెంచేందుకు కృషిచేయాలని వెంకటేశ్వర్లు కోరారు. పి.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ అనేకమంది త్యాగాల ఫలితంగానే సమాచార హక్కు చట్టం ఏర్పడిందని గుర్తుచేశారు. ప్రతీ జిల్లాకువెళ్లి ప్రజా సమస్యలు పరిష్క రిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయలేకపోవడం వల్ల 18వేలకుపైగా కేసులు అపరిష్కృతంగా ఉన్నా యని, కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుని సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడం జరిగిందని భూపాల్ పేర్కొన్నారు. పర్వీన్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో ఉన్న లోపాలే సమాచార హక్కు చట్టంలో ఉన్నాయని వాపోయారు. చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన ఆవశ్యకతను నొక్కివక్కాణించారు. చట్టాలలో సంస్కరణలు చేయాలన్నారు. ఈ సదస్సులో జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశంగౌడ్, జాతీయ ఉపాధ్యక్షుడు గోపినాధన్ కట్టికోల, జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శి వంగల వివేకానందు, రాష్ట్ర కన్వీనర్ కిఫాయాత్, అధికార ప్రతినిధి కాశీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ ఏరియాలో యువకుని దారుణ హత్య

### దావత్‌కని తీసుకెళ్లి కత్తులతో కడతేర్చిన తోటి స్నేహితులు



నసీర్ (ఫైల్)

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఏరియాలో అర్ధరాత్రి సమయాన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విందు (దావత్) కోసం పిలిచిన స్నేహితులతో కలిసి వెళ్ళిన సదరు యువకుడు కత్తి పోట్లతో రక్తపు మడుగులో విగత జీవుడయ్యాడు. వ్యక్తిగత విభేదాలు, పాత కక్షలతో తోటీ స్నేహితులై ఈ దారుణానికి ఒడిగట్టారని మృతుడి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్‌రెడ్డి వెల్లడించిన ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. బాలాపూర్ షాహిన్‌నగర్ వాది-ఎ-సాలేన్‌లోని రహమానియా మజీద్ వీధిలో నివాసం ఉంటున్న మహ్మద్ నసీర్ (22) ఎలక్ట్రీషియన్ పని చేస్తుంటాడు. అయితే ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో అతని మిత్రులు మహ్మద్ దస్తగిర్, మహ్మద్ సుభానుద్దీన్‌లు దావత్ (విందు) చేద్దామని యాక్టివా వాహనంపై నసీర్‌ను తీసుకెళ్ళారు. కాగా అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత స్థానికంగా నివసించే ఓ బాలుడు వాది-ఎ-సాలేన్ రోడ్డులోని హబీబ్ హోటల్ సమీపంలో నసీర్ కత్తిపోట్లకు గురై మరణించి ఉన్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో నసీర్ కుటుంబ సభ్యులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని అక్కడ రక్తపు మడుగులో నసీర్ మృతి చెంది ఉండడాన్ని గమనించి కన్నీరు మున్నీరయ్యారు. సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు అప్పటికే సంఘటనా ప్రాంతాని వచ్చి పంచనామా చేశారు. కాగా మృతుడి శరీరంపై పలు చోట్ల కత్తి పోట్ల గాయాలు అదే విధంగా సిమెంట్ ఇటుకలతో దాడి జరగడం ద్వారా తలకు గాయాలు ఉన్నట్లు గమనించారు. అయితే మహ్మద్ దస్తగిర్, మహ్మద్ సుభానుద్దీన్, మహ్మద్ ఇలియాస్, మహ్మద్ నదీమ్ ఖాన్‌లు పాత కక్షలతో నసీర్‌కు మద్యం సేవించి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ సుధాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్ బుకింగ్ కోసం ధ్రువీకరించిన నంబర్లకే డయల్ చేయండి

### రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేసే సమయంలో అధికారికంగా ధ్రువీకరించిన విధానాలనే అనుసరించాలని ప్రజలకు పౌరసరఫరాలశాఖ సూచించింది. సిలిండర్ల కొరత అంటూ పుకార్లను నమ్మి అనధికారిక నంబర్లకు డయల్ చేసి సిలిండర్ బుక్ చేసేందుకు యత్నించొద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ పౌరసరఫరాలశాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అనధికారిక మార్గాల్లో గ్యాస్ సిలిండర్‌ల బుకింగ్‌కు యత్నించి స్కామ్‌ల బారిన పడొద్దని హెచ్చరించింది. గ్యాస్ బుకింగ్ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా 1967కు డయల్ చేయాలని పిలుపునిచ్చింది.

## విద్యా కమిషన్ నివేదికలో ఉపాధ్యాయులకు అభద్రత కలిగించే అంశాలను తొలగించాలి

### ఎడ్యుకేషన్ పాలసీ చైర్మన్ కేశవరావుకు టిఆర్‌టిఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యా కమిషన్ నివేదికలో ఉపాధ్యాయులకు అభద్రత కలిగించే అంశాలను తొలగించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్(టిఆర్‌టిఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టిఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి సోమవారం తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ చైర్మన్ డాక్టర్ కేశవరావుని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమిషన్ నివేదికలో విద్యా బడ్జెట్‌ను 18 శాతానికి పెంచాలని కోరడం, అంగన్‌వాడీలను టీచర్లకు శిక్షణ ఇచ్చి పూర్వ ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయడం, మధ్యాహ్న భోజనాన్ని ఇంటర్ వరకు విస్తరించడం, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ వంటి ప్రతిపాదనలు విద్యా వ్యవస్థ బలోపేతానికి దోహదపడతాయని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా కుల ప్రస్తావన లేని అటెండెన్స్ రిజిస్టర్లు, 9 నుండి 12 తరగతులను ఒకే యూనిట్‌గా మార్చడం వంటి సామాజిక, పరిపాలనా సంస్కరణలను టిఆర్‌టిఎఫ్ సంపూర్ణంగా స్వాగతిస్తుం దన్నారు. ఇదే నివేదికలో ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలకు సంబంధించి చేసిన పలు ప్రతిపాదనలు క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను ఐదేళ్ల కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడం, ప్రతి ఐదేళ్లకోసారి పరీక్షలు నిర్వహించడం, మార్కెట్ రేటు ప్రకారం వేతనాలను తగ్గించాలనే ఆలోచన ఉపాధ్యాయులను తీవ్ర అభద్రతాభావానికి గురిచేస్తుందన్నారు. పదోన్నతులను నిలిపివేసి 100 శాతం ప్రత్యక్ష నియామకాలు చేపట్టడం, ఉపాధ్యాయులను గ్రేడింగ్‌ల పేరుతో విభజించడం వంటి చర్యలు వృత్తిపరమైన ఎదుగుదలను దెబ్బతీస్తాయన్నారు. క్లస్టర్ విధానం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు దూరమయ్యే ప్రమాదం ఉందని, తెలంగాణ ఫండమెంటల్ స్కూల్స్‌ను 5వ తరగతి వరకు పెంచాలని, అలాగే ఎంసెట్ రద్దు చేయడం వల్ల జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాష్ట్ర విద్యార్థులు నష్టపోతారని వారన్నారు. పాఠ్య ప్రణాళిక, మూల్యాంకనం, ఓపెన్ స్కూల్ (టాస్), రెగ్యులర్ బోర్డుల విలీనం డ్రాపౌట్ల సంఖ్యను పెంచుతుందన్నారు. ప్రభుత్వం ఈ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, ఉపాధ్యాయుల హక్కులను హరించే ప్రతిపాదనలను తొలగించాలని కేశవరావుకు విజ్ఞప్తి చేశారు.

## రూ.500 కోట్లు ఆర్థిక సంఘం నిధులు నష్టపోనున్న రాష్ట్రం

### జెడ్పీటిసి ఎన్నికలు సకాలంలో నిర్వహించని ఫలితం

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కేంద్ర అనుబంధ, అనుబంధేతర గ్రాంట్లకు సంబంధించి నిధులను తెలంగాణ పెద్ద ఎత్తున నష్టపోనుంది. కేంద్ర గ్రాంట్లు కింద రూ.600 కోట్లకు పైగా మరో విడతను విడుదల చేసినప్పటికీ, రాష్ట్రానికి రావలసిన రూ.1,000 కోట్ల బకాయిలలో కనీసం రూ.500 కోట్లు నష్టపోయే అవకాశం ఉంది. జెడ్పీటీసీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లనే ఈ పరిస్థితి ఉత్పన్నం కానుందని ఆర్థిక శాఖ అధికారవర్గాలు భావిస్తున్నాయి. అధికారిక సమాచారం ప్రకారం కేంద్రం ఇటీవల 15వ ఆర్థిక సంఘం కింద నిధులను విడుదల చేసింది. ఇందులో టైడ్ గ్రాంట్ల కింద రూ. 371.91 కోట్లు, అన్‌టైడ్ గ్రాంట్ల కింద రూ. 247.94 కోట్లు ఉన్నాయి. అయితే, ఈ కమిషన్ కింద పంచాయతీ రాజ్ విభాగానికి కేంద్రం ఇంకా మరో రూ.1,000 కోట్లు చెల్లించాల్సి ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత 15 నుంచి 20 రోజుల గడువు ఉంటుందని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.500 కోట్లు సమకూర్చుకోవడంపై ఆశాభావంతో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. దీనికి విరుద్ధంగా, షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించలేకపోవడంతో, మిగిలిన రూ.500 కోట్లు సమకూర్చుకోవడం అసాధ్యం కావచ్చు. ప్రభుత్వం ఇటీవల సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించినప్పటికీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను పూర్తిగా రద్దు చేయడం ద్వారా త్రిస్థాయి పరిపాలనా వ్యవస్థను తొలగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో, కేంద్రం 15వ ఆర్థిక సంఘం బకాయిల కింద మొత్తం రూ. 1,900 కోట్లకు పైగా నిధులను విడతలుగా విడుదల చేసింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 5న రూ.259.36 కోట్లు, ఆ తర్వాత అదే నెల 12న రూ.387 కోట్లు విడుదల చేశారు. ఫిబ్రవరి 20న మూడో విడతగా రూ. 387.53 కోట్లు అందించడంతో, మూడు విడతలలో మొత్తం రూ. 1,032.42 కోట్లకు చేరింది.అయితే నిధుల కేటాయింపులో నిరంతర జాప్యం, స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న అనిశ్చితి కారణంగా కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటికే ఆటంకాలు ఎదురయ్యాయని అధికారులు అంగీకరిస్తున్నారు.

## ప్రతిపాదిత 345 కొత్త సహకార సంఘాలకు నో

### నాబార్డు అధ్యయనంలో వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. తెలంగాణలో కొత్తగా అగ్రికల్చరల్ సహకార పరపతి సంఘాల ఏర్పాటుకు సంబంధించి చేసిన 345 ప్రతిపాదనల్లో 12 మాత్రమే అన్ని అర్హతలు ఉన్నట్లు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) అధ్యయనంలో వెల్లడైంది. అయితే కొత్త సహకార సంఘాల ఏర్పాటు కన్నా ముందుగా ప్రస్తుతం ఉన్న సొసైటీలను పటిష్ట పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 906 వ్యవసాయ సహకార, పరపతి సంఘాలు ఉండగా, దూరంగా ఉండి రైతులకు అందుబాటులోలేని ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా అన్ని జిల్లాలల్లోని సహకార సంఘాల అధికారులు (జిల్లా కోపరేటివ్ అధికారుల (డిసిఒ)) నుండి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించింది. అధికారులతోపాటు, ప్రజాప్రతినిధులు సైతం తమకు అవసరమైన ప్రాంతాల్లో సహకార సంఘాల ఏర్పాటుకు లేఖలు పంపించాలని కోరింది.

## ప్రైవేటు మెడికల్ కాలేజీల అక్రమ ఫీజు వసూళ్లను అరికట్టాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల అక్రమ ఫీజు వసూళ్ళను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యం విద్యార్థుల నుండి నాలుగున్నర సంవత్సరాలకు బదులుగా ఐదు సంవత్సరాలకు అక్రమంగా అదనపు ఫీజులు వసూలు చేయడాన్ని ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో చేరిన 2091 మంది బి కేటగిరీ విద్యార్థుల నుండి రూ. 11, 50,000లు, 872 మంది సి కేటగిరీకి చెందిన విద్యార్థుల నుండి రూ.23 లక్షల నుండి రూ.26 లక్షల వరకు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై రూ. 209 కోట్ల రూపాయల అదనపు భారాన్ని వేశారని మండిపడ్డారు. హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు అధిక ఫీజులు వసూలు చేయరాదని సర్క్యులర్ జారీ చేసినా, ప్రయివేటు యాజమాన్యాలు యధావిధిగా వసూలు చేయడంతోపాటు విద్యార్థులను మార్కులు తక్కువగా వేసి ఫెయిల్ చేస్తామని బెదిరిస్తున్నట్లు కూడా తెలుస్తుందన్నారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల యాజమాన్యం రాజకీయ పలుకుబడి కలిగిన వారే కావడటం వల్ల తమ రాజకీయ ప్రాబల్యంతో, అధికార పార్టీ అండదండలతో బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకొని అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న సదరు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. దాంతోపాటు ఇప్పటి వరకు విద్యార్థులను నుండి అదనంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే తిరిగి విద్యార్థులకు ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పాట గెలిచింది.. తూటా ఓడిపోయింది

### గద్దర్ ఫౌండేషన్ సభలో నారాయణ, కోదండరాం, జాన్‌వెస్లీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 6:** గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోపాటపై తూటాప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలు (1997లో ఏప్రిల్ 6న గద్దర్ పై కాల్పులు జరిగిన రోజు) అనే పేరిట సభను నిర్వహించారు. గద్దర్ తనయుడు సూర్య కిరణ్ అధ్యక్షతన ఈ సభ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ. ఎమ్మెల్సీ కోదండరాం. సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ. సీనియర్ సంపాదకులు అల్లం నారాయణ, సాంబమూర్తి తదితరులు హాజరయ్యారు. 5 దశాబ్దాలు విప్లవంలో ఉన్న యోధుడు గద్దర్ అని అల్లం నారాయణ అన్నారు. అజ్ఞాతం నుండి బైటికి వచ్చిన గద్దర్ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన భూమిక వహించారని, ఆయన ప్రజల గుండెల్లో చిరంజీవి అని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగానా ప్రజా జీవితంలో మార్పు తీసుకు వచ్చినవాడు గద్దర్ అని అన్నారు. సామాజిక మార్పును, సమాజ చైతన్యం ఆయన తీసుకు వచ్చాడని అన్నారు. తెలంగానా ఆత్మ గద్దర్ అని అన్నారు. రాజ్యాంగాన్ని గద్దర్ ఆయుధంగా తీసుకుని మార్పు కోసం ధైర్యంగా నిలబడ్డాడని అన్నారు. రాజ్యాంగా విలువలను జీవితంలో అమలు చేయాలని అన్నారు. సీపీ ఐ జాతీయ నేత కె. నారాయణ మాట్లాడుతూ పాట గెలిచిందని తూటా ఓడి పోయిందని అన్నారు. రాజ్యం, కోర్టు వివక్షతను చూపుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సహజీవనం చేసే వారిని భార్యా భర్తలుగా పరిగనించాలని కోర్టు చెప్పడం /ఆపరేషన్ కగార్ / సరికాదన్నారు. ఎర్ర జెండా నమ్ముకున్న వారాంతా ఒకే గొడుగు కిందికి రావాలని జాన్ వేస్లీ సూచించారు.

## మాజీ ఎంపి సంతోష్‌కుమార్‌కు గ్లోబల్ గ్రీన్ ఐకాన్ పురస్కారం

### బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో 17న ప్రదానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఏప్రిల్ 6:** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ఇగ్నైటెడ్ మైండ్స్ నిర్వాహకులు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ కు ప్రతిష్టాత్మక గ్లోబల్ గ్రీన్ ఐకాన్ పురస్కారం దక్కింది. బ్రిటన్ హౌస్ ఆఫ్ లార్డ్స్ లో ఏప్రిల్ 17న ఆయన ఈ పురస్కారం అందుకోనున్నారు. భారతదేశంలో పర్యావరణ ఉద్యమాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడంలో ఇగ్నైటింగ్ మైండ్స్ నిరంతర కృషి చేస్తున్నది. ముఖ్యంగా సంతోష్ కుమార్ ప్రారంభించిన “హారా హై తో భరా హై“ (ఆకుపచ్చగా ఉంటేనే సిరిసంపదలు) నినాదంతో ముందుకొచ్చిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ దేశవ్యాప్తంగా పర్యావరణ బాధ్యతను ఒక సత్సంప్రదాయంగా మార్చింది. విద్యార్థులు, యువత, రైతులు, సామాన్యుల నుంచి జాతీయ స్థాయి సెలబ్రిటీల వరకు ఎంతోమంది ఈ ఉద్యమంలో భాగస్వాములై మిలియన్ల కొద్దీ మొక్కలు నాటారు.పర్యావరణ పరిరక్షణ,సుస్థిర అభివృద్ధి, వాతావరణ మార్పులపై పోరాడుతున్న ప్రపంచ స్థాయి నాయకులను గుర్తించి వారికి పురస్కారాలు అందిస్తున్న బ్రిటన్ సంస్థ హెలిన్ స్పార్క్ స్ట్రాటజీస్ యూకే లిమిటెడ్ ఏప్రిల్ 17న అంతర్జాతీయ కాన్ క్లేవ్ నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా బ్రిటన్ పార్లమెంట్ లోని హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సంతోష్ కుమార్‌కు గ్లోబల్ గ్రీన్ ఐకాన్ పురస్కారాన్ని అందజేస్తారు.

## వాతావరణంలో పెనుమార్పులు

### ఉత్తర తెలంగాణలో కురియనున్న భారీవర్షాలు

### దక్షిణ తెలంగాణలో దంచికొట్టనున్న ఎండలు

**హైదరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులపాటు వాతావరణం మరింత భిన్నంగా ఉండబోతోంది. తుఫాన్లు, వాయుగుండం ప్రభావంతో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా మరికొన్ని చోట్ల భానుడి ప్రంచఢ ప్రతాపం కొనసాగుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. సముద్రంలో ఆస్ట్రేలియా సమీపంలో రెండు తుఫాన్లు ఏర్పడ్డాయని, అదే సమయంలో హిందూ మహాసముద్రంలో కొనసాగుతున్న ఇందుసా వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో పెను మార్పులు చోటుచేసుకోనున్నాయని అధికారులు తెలిపారు. దీనికి తోడు అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి ఏర్పడటంతో ఈ నెల 10 వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. వర్షంతో పాటు పిడుగులుకూడా పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

# ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో మెడల్స్ వాంట్ : ఫైనల్లో ప్రీతి పవార్



కాంస్యంతో సరిపెట్టిన నిఖత్ జరీన్



**ఉలాన్ బాతర్:** మంగోలియాలోని ఉలాన్‌బాతర్‌లో జరుగుతున్న 2026 ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు జోరుచూపుతున్నారు. ప్రీతి పవార్‌తో పాటు పలువురు ఫైనల్ చేరారు. సెమీస్‌కు చేరుకోవడం ద్వారా మహిళల 51 కేజీల విభాగంలో మెడల్ ఖాయం చేసుకున్న హైదరాబాదీ బాక్సర్, మాజీ ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్.. ఫైనల్ చేరడంలో విఫలమైంది. సెమీస్‌లో చైనాకు చెందిన పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ వు యు చేతిలో పరాజయం ఎదురైంది. ఆరంభంలో చక్కగా డిఫెండ్ చేసిన నిఖత్‌జరీన్.. చైనా బాక్సర్ దాడికి ఎదురునిలవలేకపోయింది. ఒలింపిక్ మెడలిస్ట్ లవ్లీనా బోర్గోహైన్.. మహిళల 75కిలోల విభాగంలో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన అజీజా జోకిరోవా చేతిలో పరాజయం పాలైంది. మహిళల 80 కేజీల విభాగంలో ఒలింపియన్ పూజా రాణి కూడా ఓటమితో కాంస్యపతకాలతో సరిపెట్టారు.

మహిళల 54 కేజీల విభాగంలో ఫైనల్ చేరిన ప్రీతి పవార్..పారిస్ ఒలింపిక్ కాంస్య పతక విజేత ఏజీ ఇమ్ (కొరియా)ను ఓడించింది. ఇమ్‌తో జరిగిన పోరులో ప్రీతి పవార్ మూడు రౌండ్లలోనూ ఆధిపత్యం చెలాయించింది. రెఫరీల ఏకగ్రీవ నిర్ణయంతో 5-0 తేడాతో విజయం సాధించింది. స్వర్ణం కోసం ప్రీతి పవార్... మూడుసార్లు బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్ చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ సియావోవెన్‌తో తలపడనుంది. 2026 ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్స్‌కు చేరిన బాక్సర్లు కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్‌కు నేరుగా అర్హత సాధిస్తారు.

అరుంధతి 4-1తో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఓయ్షా టోయిరోవాపై విజయం సాధించి ఆకట్టుకుంది. ఫైనల్లో కజకిస్తాన్ బాక్సర్ బకిత్ సెయిడిష్‌తో తలపడనుంది. మహిళల 48, 57 కిలోల విభాగాల్లో ప్రపంచ ఛాంపియన్లు మీనాక్షి హుడా, జాస్మిన్ లాంబోరియాలతో సహా పలువురు భారతీయ బాక్సర్లు సెమీఫైనల్స్‌లో పోటీపడనున్నారు. పురుషుల విభాగంలో లోకేశ్ (85 కేజీలు), ఆకాశ్ (75 కేజీలు), హర్ష్‌చౌధరి (90 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. తద్వారా కనీసం కాంస్య

## డ్రాలతో సరిపెట్టిన ప్రజ్ఞానంద

# మలిదశపై భారీ ఆశలు

**పెయియా (సైప్రస్):** క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద డ్రాలతో కొనసాగుతున్నాడు. ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను ప్రజ్ఞానంద 38 ఎత్తుల్లో డ్రాగా ముగించాడు. అతనికిది అయిదో డ్రా. ప్రస్తుతం ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో ఇంకా ఏడు రౌండ్లు మిగిలిఉన్నాయి. మొదటి దశలో డ్రాలతో సరిపెట్టిన ప్రజ్ఞానంద... పరిస్థితిని తన వైపుకు తిప్పుకోవడానికి రెండోదశలో మిగిలిన ఏడు గేమ్‌ల్లో విజయాలతో దూసుకుపోవడంపై దృష్టి సారించాడు. ఎనిమిదో రౌండ్‌లో డచ్ ఆటగాడు అనీష్ గిరితో తలపడనున్నాడు. ప్రస్తుతం ఇద్దరూ కూడా 3.5 పాయింట్లతో సమవుజ్జీగా ఉన్నారు. తొలి రౌండ్‌లో అనీష్ గిరిపై విజయంతో ప్రారంభించిన ప్రజ్ఞానంద, రెండో విజయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఎనిమిదో రౌండ్‌లో ప్రజ్ఞానంద తెల్ల పావులతో గిరితో తలపడనుండగా, సిందరోవ్ ఎసిపెంకోతో పోరాడాల్సి ఉంది. ఇప్పటివరకు, ఉజ్బెకిస్థాన్‌కు చెందిన జవోఖిర్ సిందరోవ్ ఐదు గేమ్‌లు గెలిచి, మిగిలిన రెండు గేమ్‌లను డ్రా చేసుకున్నాడు. ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అమెరికాకు చెందిన ఫాబియానో కరువానా 4.5 పాయింట్లతో తరువాతి స్థానంలో ఉన్నాడు.









# జైశ్వాల్, సూర్యవంశీ జోడీకి ముంబై సవాల్

## గువహటి వేదికగా థ్రిల్లర్ మ్యాచ్ ✦బలాబలాల్లో సమానం ✦విజయం ఎవరి వశం?

**గువహటి:** కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు ఉత్కంఠ పోరు జరగనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న రాజస్థాన్ రాయల్స్... 5సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌తో బర్సపారా స్టేడియంలో తలపడనుంది. లోకల్ టాలెంట్‌తో దుమ్మురేపుతున్న రాజస్థాన్ రాయల్స్.. ఐపీఎల్ కొత్త సీజన్‌ను గ్రాండ్‌గా ఆరంభించింది. తొలి మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై గ్రాండ్ విక్టరీ కొట్టిన ఆర్ఆర్... అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ఉత్కంఠభరిత పోరులో ఆరు పరుగుల తేడాతో గెలుపొందింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ అంచనాలకు తగట్లు చక్కని శుభారంభాలు ఇస్తున్నారు. ఇద్దరూ గొప్పఫామ్‌తో పరుగుల వేటలో ఉన్నారు. కెప్టెన్ రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ కూడా ఫామ్‌లో ఉండడం కలిసివచ్చే అంశం. హార్డ్ హిట్టర్ హెట్మెయర్ తన స్థాయికి తగ్గ మెరుపు ఇన్నింగ్స్ చూపితే తిరుగుండదు. అయితే ముంబై బౌలింగ్ వీరికి సవాల్‌గా మారనుంది. సూపర్ ఆల్‌రౌండర్లు ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా అర్చర్, బర్గర్‌లతో కూడిన రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ వైవిధ్యంగా ఉంది.

మరోవైపు, ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో ఓటమితో ముంబై ఇండియన్స్ బరిలోకి దిగుతోంది. గత మ్యాచ్‌లో బ్యాటింగ్ వైఫల్యం జట్టు కొంపముంచింది. రోహిత్‌శర్మ, ర్యాన్ రికల్టన్, తిలక్‌వర్మ, నమన్ ధీర్ బ్యాటింగ్‌కు పనిచెప్పాల్సి ఉంటుంది. కేకేఆర్‌పై ఛేజింగ్‌లో చూపిన తెగువ మరోసారి రిపీట్ చేయాలని చూస్తోంది. సూర్యకుమార్ గత మ్యాచ్‌తో ఫామ్‌లోకి వచ్చాడు. హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు అందుబాటులోకి వస్తే బ్యాటింగ్ మరింత పటిష్టమవుతుంది. మరో సూపర్ ఆల్‌రౌండర్ మిచెల్ సాంట్నర్ ఇటు బౌలింగ్, అటు బ్యాటింగ్‌లో జట్టుకు కొండంత అండ. ఇక జస్ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, శార్దూల్ ఠాకూర్‌లతో కూడిన పేస్ అటాక్ ఏ జట్టుకు లేని విధంగా అత్యుత్తమంగా ఉంది.

| ఐపీఎల్‌లో నేటి మ్యాచ్ | |
|---|---|
| రాజస్థాన్ రాయల్స్ V/S ముంబై ఇండియన్స్ | రాత్రి 7.30 గం.లకు |

### హెడ్ టు హెడ్

రాజస్థాన్ రాయల్స్‌తో పోలిస్తే ముంబై ఇండియన్స్ ఒకింత బలమైన జట్టు. రెండు జట్లలోనూ హార్డ్‌హిట్లర్లు ఉండడంతో క్రికెట్ అభిమానులకు పరుగుల విందు ఖాయం. ఇరు జట్లు ఇప్పటివరకు 31 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ముంబై ఇండియన్స్ 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ రాయల్స్ 14 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

### పిచ్ రిపోర్ట్

గువహతి పిచ్‌పై స్వింగ్ ఉంటుంది. సీమర్లు.. బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. బౌండరీలు కాస్త చిన్నగా ఉండడంతో భారీ స్కోర్లు ఖాయం. రెండోసారి బ్యాటింగ్ చేసే జట్టుకు అనుకూలంగా ఉంటుంది.

**రాజస్థాన్‌రాయల్స్ (అంచనా):** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రాన్ హెట్మెయర్, ఫెరీరా, రవీంద్ర జడేజా, జోఫ్రా ఆర్చర్, నాండ్రే బర్గర్, తుషార్ దేశ్‌పాండే, సందీప్ శర్మ; **ఇంపాక్ట్ ప్లేయర్:** రవి బిష్ణోయ్

**ముంబై ఇండియన్స్ (అంచనా):** రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్య కుమార్, నమన్ ధీర్, షెర్ఫానే రూథర్ ఫోర్డ్, హార్దిక్ పాండ్యా (కెప్టెన్), మిచెల్ సాంట్నర్, శార్దూల్ ఠాకూర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా; **ఇంపాక్ట్ ప్లేయర్:** దీపక్ చాహర్

# భారత్ టెన్నిస్ జట్టుకు సానియా విష్




**ఢిల్లీ:** బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా/ఓషియానియా గ్రూప్-1 టెన్నిస్ టోర్నీలో పాల్గొనే భారత టెన్నిస్ జట్టు దేశం గర్వపడే విజయాన్ని అందుకోవాలని సానియా మీర్జా ఆకాంక్షించారు. జట్టుకు బెస్ట్ విషెస్ చెప్పారు. దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం. మీరందరూ బాగా రాణించాలని, మీరు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని, నూటికి నూరు శాతం కృషి చేసి కప్ సాధించాలని తాను ఆశిస్తున్నట్లు సానియా తెలిపింది.

బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా/ఓషియానియా గ్రూప్-1 టోర్నీకి ఢిల్లీ ఆతిథ్యం ఇస్తోంది. నేటినుండి 5 రోజుల పాటు న్యూఢిల్లీలోని డీఎల్‌టిఎ స్టేడియంలో జరగనుంది. అంకితా రైనా, సహజ యమలపల్లి, వైష్ణవి అడ్కర్, శ్రీవల్లి భమిడిపాటి, రుతుజ భోస్లే, వైదేహి చౌధరి... భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మహిళల టెన్నిస్ ప్రపంచ కప్‌గా పిలువబడే ఈ టోర్నమెంట్‌లో ఆరు దేశాలు రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీపడతాయి, ఇందులో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు నవంబర్‌లో జరిగే బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశం భారత్‌తో పాటు ఇండోనేషియా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా,మంగోలియా, న్యూజిలాండ్, థాయిలాండ్ బరిలోకి దిగుతున్నాయి. వరల్డ్ గ్రూప్ ఆశలను సజీవంగా ఉంచుకోవడానికి భారత్ మొదటి రెండు స్థానాల్లో నిలవాలని లక్ష్యంగా

# సింధూ, లక్ష్యసేన్‌పై టైటిల్ ఆశలు



**నింగ్‌బో:** చైనాలోని నింగ్‌బోలో నేటి నుంచి బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్ జరగనుంది. భారత డబుల్స్ జోడీ చిరాగ్ శెట్టి, సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి గాయం కారణంగా వైదొలిగారు. భారత స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, పీవీ సింధూపైనే ఆశలన్నీ. ఆల్‌ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్యసేన్... ఈ టోర్నీలోనూ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. 61 ఏళ్ల నిరీక్షణకు తెరదించి టైటిల్ సాధించడంపై దృష్టి సారించాడు. 1965 ఆసియా ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్‌లో దినేష్ ఖన్నా విజేతగా నిలిచాడు. అప్పటినుంచి ఈ టైటిల్ భారత షటర్లను ఊరిస్తూనే ఉంది. లక్ష్యసేన్... తొలి రౌండ్‌లో హాంకాంగ్‌కు చెందిన లీ చెక్ యూతో తలపడనున్నాడు.

ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్, స్విస్ ఓపెన్‌లకు దూరమైన రెండుసార్లు ఒలింపిక్స్ మెడలిస్ట్ పీవీ సింధూ...కొద్ది విరామం తర్వాత ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నది. మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌తో తొలి రౌండ్‌లో పోటీపడనుంది. సింధూతో పాటు ఉన్నతి హూడా, తన్వి శర్మ, మాల్వాక బన్సోద్.. మహిళల సింగిల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాగా భుజం గాయం నుంచి కోలుకుని తిరిగివస్తున్న హెచ్.ఎస్.ప్రణయ్.. తొలి రౌండ్‌లో క్వాలిఫయర్‌తోతలపడనుండగా, కిదాంబి శ్రీకాంత్ సింగపూర్‌కు చెందిన ఎనిమిదో సీడ్ లోహ్ కీన్ యూతో పోటీపడతాడు. యూఎస్ ఓపెన్ ఛాంపియన్ ఆయుష్ శెట్టి, చైనాకు చెందిన ఐదవ సీడ్ లీ షి ఫెంగ్‌తో తలపడనున్నాడు.

# లాభాలతో స్టాక్ మార్కెట్లు కళకళ

## యుద్ధవిరమణ ప్రతిపాదనలతో సెన్సెక్స్, నిఫ్టీకి ఊతం

**ముంబయి, ఏప్రిల్ 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారం ప్రారంభంలో లాభాలతో కళకళలాడాయి. శాంతి చర్చలతో అమెరికా, ఇరాన్ మధ్యఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చన్న సానుకూల అంచనాలు ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఈ సానుకూల పరిణామాలతో అన్ని రంగాల్లో కొనుగోళ్ల మద్దతు లభించింది. సోమవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 787 పాయింట్లు లాభపడి 74,106.85 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 255 పాయింట్లు వృద్ధి చెంది 22,968.25 వద్ద ముగిసింది. అమెరికా, ఇరాన్ మధ్య ఘర్షణలకు ముగింపు పలికేందుకు ఒక ప్రతిపాదన సిద్ధమైనట్లు వచ్చిన నివేదికలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. రెండు దశల్లో ఈ ఒప్పందం కుదరనుండగా, 15 నుంచి 120 రోజుల్లో తుది కాల్పుల విరమణ ఒప్పందంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

అణు కార్యక్రమాలపై పరిమితులు, ఆంక్షల ఉపశమనం వంటి అంశాలు ఈ ప్రతిపాదనలో ఉన్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే ప్రపంచ మార్కెట్లు స్థిరపడతాయని, ముఖ్యంగా ఇంధన ధరలు అదుపులోకి వస్తాయని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. నిఫ్టీలో ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, టైటాన్ కంపెనీ షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 1.52శాతం, స్మాల్‌క్యాప్ 1.29 శాతం మేర లాభపడ్డాయి. అయితే, ముడి చమురు ధరల్లో అస్థిరత కారణంగా ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మాత్రం కొంత వెనుకబడింది. యాక్సిస్‌బ్యాంకు 3.94శాతం, ఎల్అండ్‌టి 3.19, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.68శాతం చొప్పున పెరిగాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ మాత్రం 3.41శాతం క్షీణించి షేరుధర 1304.75కి చేరింది.



బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.30శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ సూచీ కూడా 1.10శాతం ఎగబాకింది. విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారకం విలువలు 93.03కి చేరింది. అంతకుముందురోజు 93.18 నుంచి గణనీయంగా పటిష్టపడింది. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ జూన్‌నెల సెటిల్‌మెంట్‌కోసం 1.02శాతం పెరిగి రూ.1,51,207కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 57 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 108.46 డాలర్లుగా కొనసాగింది. ఈస్టర్‌డే కావడంతో యూరోపియన్ మార్కెట్లు మూతపడ్డాయి. జపాన్ దక్షిణకొరియా స్టాక్స్ గణనీయంగా పెరిగాయి. బ్యాంకింగ్ రంగంలో హెచ్‌డిఎఫ్‌సి ఇండస్ ఇండ్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు,ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ఆర్బీఎల్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకోబ్యాంకు, ఎల్అండ్‌టి, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు భారీ లాభాలు పొందాయి.

# 33 పైసలు బలపడిన దేశీయ కరెన్సీ



**ముంబయి, ఏప్రిల్ 6:** డాలరుతో రూపాయి మారకం విలువలు బలపడుతున్నాయి. సోమవారం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి ట్రేడింగ్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 33 పైసలు బలపడి 92.85వద్ద ముగిసింది. ఆర్‌బిఐ కట్టడి నిబంధనలు, డాలర్ల నిల్వలపైనా ఆంక్షలు విధించడంతో రూపాయి కొంత బలపడింది. బ్యాంకులు నికర ప్రారంభ నిల్వ డాలర్ల పొజిషన్లు 100 మిలియన్ డాలర్లుగా నిర్ధారించింది. ప్రపంచ దేశాల్లో ఉద్రిక్తతలు, అనిశ్చితిలు ఉన్నప్పటికీ ఆర్బీఐ విధించిన ఆంక్షలు ఫలితాలిచ్చాయి. ఫోరెక్స్ ట్రేడర్లు మాట్లాడుతూ దేశీయంగా ఇటీవలికాలంలో తీవ్ర ఒత్తిడికి లోనయింది. ఈక్విటీ మార్కెట్లనుంచి ఎక్కువ విత్‌డ్రాలే డాలర్‌ను పటిష్టంచేసాయని, ముడిచమురుధరలు పెరగడం, ధరలు కూడా డాలర్లలోనే చెల్లింపులు చేయడం వంటి వాటితో రూపాయి ఒత్తిడికి లోనయినట్లు వెల్లడించారు. ఫోరెక్స్ కౌంటర్లలో రూపాయి 93.13 వద్దప్రారంభం అయిత క్రమేపీ పటిష్టం అవుతూ 92.85వద్దకు చేరింది. చివరకు 33 లాభపడింది. గతవారాంతంలో రూపాయి భారీగా లాభపడింది. 152 పైసలు లాబపడి డాలరుతో రూపాయి మారకం 93.18గా కూడా నమోదయింది. ఆర్బీఐ చేపట్టిన కార్యాచరణ ఫలితాలిస్తున్నాయి. డాలర్ పొజిషన్లు ఏప్రిల్ 10 గడువు విధించింది. రానున్న కాలంలో డాలరుతో రూపాయి మారకం విలువలు 91.50 నుంచి 92 రూపాయలుగా ఉంటుందని సిఆర్‌ఫోరెక్స్ అడ్వయిజర్స్ ఎండి అమిత్‌పభారి వెల్లడించారు. ఆర్థిక వ్యవస్థ ధోరణులు, వాణిజ్యలోటు, కరెంటుఖాతాలోటు, ఆర్థిక పరిపుష్టి వంటివికూడా రూపాయి పటిష్టతకు దోహదంచేస్తాయని ఆయన అన్నారు.




# రికార్డుస్థాయిలో డిజిటల్ చెల్లింపులు

**ముంబయి, ఏప్రిల్ 6:** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సరికొత్త రికార్డులు సాధిస్తోంది. 2025సంవత్సరంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ ద్వారా జరిగిన లావాదేవీలు 33 శాతం వృద్ధిచెంది 228.5 బిలియన్లకు చేరాయి. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ.299.74 ట్రిలియన్లుగా నమోదైంది. వరల్డ్‌లైన్ సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది. వ్యాపారులకు జరిపిన చెల్లింపులు 34 శాతం పెరిగి 143.82 బిలియన్లకు చేరాయి.

మరోవైపు, యూపీఐ సగటు లావాదేవీ విలువ (యావరేజ్ టికెట్ సైజ్) 9 శాతం తగ్గి రూ.1,314కు చేరింది. ముఖ్యంగా వ్యాపారుల వద్ద జరిపే చెల్లింపుల సగటు విలువ రూ.592కు పడిపోవడం గమనార్హం. గతంలో నగదుతో జరిపిన వీధి వ్యాపారుల వద్ద కొనుగోళ్ల వంటి చిన్న చిన్న చెల్లింపులు కూడా డిజిటల్ పరిధిలోకి వస్తున్నాయని ఇది సూచిస్తోందని నివేదిక పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల కోసం మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. 2025లో యూపీఐ క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 15 శాతం పెరిగి 731.38 మిలియన్లకు చేరింది. భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ పరిణితిలో కొత్తదశకు చేరుకుంటోందని వరల్డ్‌లైన్ ఇండియా సీఈవో రమేష్ నరసింహన్ తెలిపారు.

మరోవైపు,భారత్ బిల్‌పే ద్వారా జరిగే రికరింగ్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. దీని లావాదేవీల సంఖ్య 40 శాతం పెరిగి 3.05 బిలియన్లకు, వాటివిలువ 93శాతం వృద్ధితో 14.84 ట్రిలియన్లకు చేరింది. ఎడ్యుకేషన్ ఫీజులు, బీమా, ఈఎంఐల వంటివి దీని ద్వారా చెల్లించడం పెరుగుతోందని నివేదిక వివరించింది. ఇదే సమయంలో క్రెడిట్ కార్డు లావాదేవీలు 27 శాతం పెరగ్గా, చిన్న లావాదేవీలు యూపీఐకి మళ్లడంతో డెబిట్ కార్డుల వాడకం 23 శాతం తగ్గింది.

# 30 రోజుల వ్యాలిడిటీతో టెల్కోలు రెడీ

**ముంబయి, ఏప్రిల్ 6:** వినియోగదారులను ఆకట్టుకునేందుకు టెల్కోలు కొత్త కొత్త ఆఫర్లుప్రవేశపెడుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగంలోని బిఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్‌ప్లాన్ మళ్లీప్రారంభించింది. కేవలం ఒక్కరూపాయికే 30 రోజుల వ్యాలిడిటీ, రోజుకు 2 జిబి డేటా అపరిమిత కాల్స్‌ను ప్రకటించింది. ఐపిఎల్ సీజన్ కావడంతో డేటా వినియోగంఎ క్కువ ఉంటుందన్న లక్ష్యంతో టెల్కోలు అదనపు బెనిఫిట్లు అందిస్తున్నాయి. బిఎస్ఎన్ఎల్ అయితే కొత్త కస్టమర్లకు మాత్రమే ఈ ప్లాన్ వర్తింపచేస్తోంది.

ఇక టెల్కోల్లో అగ్రగామిగా కొనసాగుతున్న రిలయన్స్ జియో యూజర్లకు 30రోజుల వ్యాలిడిటీతో రీఛార్జి ప్లాన్ ప్రారంభించింది. రోజుకు 1.5 జిబి డేటా అపరిమిత కాల్స్‌తోపాటు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. రూ.339 రీఛార్జితో నెలరోజుల వ్యాలిడిటీ ఉంటుందని వెల్లడించింది. పార్లమెంటులో ఆప్ ఎంపి రాఘవ్‌ఛద్దా 28 రోజుల వ్యాలిడిటీపై ప్రశ్నలు వేయడంతో ఇపుడు టెల్కోలు 30 రోజుల వ్యాలిడిటీకి మారుతున్నాయి. ముందుగా బిఎస్ఎన్ఎల్ ఆతర్వాత జియోలు ఈ ప్లాన్లు అమలుచేస్తున్నాయి.




కొన్ని కంపెనీలు 30రోజులు వ్యాలిడిటీ ఉన్నప్పటికీ పరిమితంగానే అందిస్తు న్నాయి. ఇతరత్రా ఎయిర్‌టెల్, వొడాఫోన్‌ఐడియా, ఎంటిఎన్ఎల్ కంపెనీలు నెలరోజుల వ్యాలిడిటీ ఉన్న రీఛార్జి ప్లాన్లు ప్రకటించేందుకు సిద్ధం అవుతు న్నాయి. అదనపు సదుపాయాలు, టాక్‌టైమ్, డేటా వంటి ఆఫర్లతో ఈ కొతనత రీఛార్జి ప్లాన్లు వస్తున్నాయి.

# బులియన్ మార్కెట్‌పై మధ్యప్రాచ్య యుద్ధం ఎఫెక్ట్

**ముంబయి, ఏప్రిల్ 6:** బులి యన్‌మార్కెట్‌పై మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావం ఎక్కువగానే ఉంటున్నది. మార్కెట్లలో 24 కేరట్ల పదిగ్రాముల బంగారం సోమవారం రూ.1,50,660గా కొనసాగితే 22 కేరట్ల బంగారం పదిగ్రాములు రూ.1,38,100 గాను 18కేరట్ల బంగారం 1,12,990గాను కొనసాగింది.దేశంలోని ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్, కేరళ, పూణెనగరాల్లో ఇవే ధరలు కొనసాగుతుంటే ఢిల్లీలో మాత్రం తులంబంగారం 15,0810,చెన్నైలో 1,52,620గా కొనసాగింది. ఇక వెండిపరంగా చూస్తే దేశంలో సగటు ధరలు కిలో ఒక్కింటికి 2.60 లక్షలుగా ఉంది. ఈధరలు చెన్నై, హైదరాబాద్‌లలో ఒకే విధంగా ఉంటే ముంబయి, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరు నగరాల్లో రూ.2,50 లక్షలుగా మాత్రమే కొనసాగుతున్నాయి.



కిలో ఒక్కిం టికి ఐదువేలు పెరిగినట్లు అంచనా. ఈ నెల ఒకటో తేదీ ఒక్కరోజు మాత్రమే రూ.15 వేలు పెరిగిన వెంట ఆపై కొంతమేర తగ్గుతూ వచ్చి సోమవారం నాటికి రూ.2.50 లక్షలవద్ద స్థిరపడింది. ఎంసిఎక్స్‌లో బంగారం ధరలు రూ.1,51,113 గా కొనసాగాయి.

ఎంసిఎక్స్‌లో వెండి ధరలు మేనెల ఫ్యూచర్స్ రూ.2,35,150గా కొనసాగాయి. ముందురోజుతో పోలిస్తే 2655 పెరిగిందని అంచనా. అలాగే అమెరికాలోకూడా పసిడిధరలు గ్రాము 154 డాలర్లుగా కొనసాగాయి.

## డెల్లాయిట్ ఇండియా ట్యాలెంట్ సర్వే

# ఈ ఏడాది జీతాల పెంపు 9.1శాతం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6:** భారత కార్పొరేట్‌రంగంలో ఈసారి ఉద్యోగుల జీతాలు 9.1శాతంపెరగవచ్చని గత ఏడాది 9శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరుగుతుందని డెల్లాయిట్ ఇండియా ట్యాలెంట్ ఔట్‌లుక్ 2026లో ప్రకటించింది. జనవరి ఫిబ్రవరినెలల్లో నిర్వహించిన సర్వే ఆధారంగా వివిధ సంస్థలనుంచి అభిప్రాయ ఏకరణ జరిపింది. ఏడురరంగాలు, మరో 27 సబ్ సెక్టార్లనుంచి ఈ సర్వే నిర్వహించింది. ఎక్కువగా ముఖ్యంగా మానవ వనరుల విభాగం అధికారులు, సీనియర్ హెచ్ఆర్ లీడర్లతోనే ఈ సర్వే నిర్వహించింది. కంపెనీల్లో కూడా పనితీరు రేటింగ్స్‌లో మార్పులు ఉన్నాయని గుర్తించింది. అత్యధిక రేటింగ్ ఐదు పాయింట్ల పనితీరు స్కేలు 2025లో ఏడుశాతంగా ఉంటే 2024లో పదిశాతం ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నట్లు తేల్చింది.

ఉద్యోగులకు 2025లో కేటగిరీల వారీగా 14శాతం వరకూ కూడా ప్రమోషన్‌లు లభించాయి. అదే అంతకుముందు సంవత్సరంలో 12శాతంగా మాత్రమే ఉంది. ఇక ఉద్యోగులు తరచూ కంపెనీలు మారుతున్న ధోరణులు 2025లో 17.6శాతంగా ఉంది. అదే 2024లో 17.4శాతం నుంచి కొంతమేర మెరుగుపడినట్లు డెల్లాయిట్ సర్వేలో తేలింది. ఇటీవలికాలంలో వేతన పెంపు అనేది స్వల్పస్థాయిలోనే ఉంది. సెక్టార్ల వారీగా చూస్తే ఫార్మారంగంలో రికార్డు స్థాయిలో ఉంది. 2026లో 10.1శాతం, 2025లో 9.8 శాతంగా ఉంది. ఇక లైఫ్ సైన్సెక్ రంగంలో జీతాల పెంపు 9.9 శాతంగా ఉంది. ఉత్పత్తి రంగ కంపెనీలు సగటు వేతన పెంపు 9.8 శాతంగా ఉంది. 2025లో6 9.6శాతంగా ఉంది.




ఆటోమోటివ్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తిదారులు 10.3 శాతంగా వేతనాలు పెంపు అందుకోగలిగారు. ఆర్థికసేవలరంగంలో మొత్తం 9.1శాతంగా పెంపుదల ఉంది. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు కూడా 9.5శాతంగా ఉన్నాయి. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల్లో మాత్రం రికార్డుస్థాయిలో ఉన్నాయి. 9.4శాతంగా ఉంది. టెక్నాలజీరంగంలో ఐటి కంపెనీలు 9.2శాతం మాత్రమే ఇచానచయి. ఐటి సేవలరంగ కంపెనీలు మాత్రం 6.9శాతానికి కుదించాయి. మొత్తం కార్పొరేట్‌రంగంలో తరచూ ఉద్యోగులు మారుతున్న వైఖరి 2025లో 17.6శాతంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.